అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 30-6-2023



బక్రీద్ సందర్భంగా హైదరాబాద్‌లోని అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో ముస్లిం సోదరుల ప్రార్థనలు...

సంపుటి : 9 | సంచిక : 180 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

బెంగళూర్‌లో ప్రతిపక్షాల రెండో సమావేశం



జులై 13, 14 తేదీల్లో నిర్వహణ : ఎన్సీపీ అధినేత శరద్ పవార్

న్యూఢిల్లీ : ప్రతిపక్ష పార్టీల నేతల తదుపరి సమావేశం జులై 13, 14 తేదీల్లో బెంగళూర్‌లో జరగనున్నట్టు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ చెప్పారు. 'పాట్నాలో ప్రతిపక్ష పార్టీల సమావేశం తరువాత ప్రధాని మోడీ అశాంతికి గురయ్యారు' అని అన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నివాసంలో సమావేశమైన ప్రతిపక్ష నేతలు జూలై 10-12 తేదీల్లో సిమ్లాలో సమావేశం కానున్నట్టు గతంలో ప్రకటించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోరాడేందుకు ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తూనే కలిసికట్టుగా ముందుకు వెళ్లేందుకు ఎజెండాను సిద్ధం చేసేందుకు ఈ సమావేశం జరగనుంది. ఈ నెల 23న పాట్నాలో జరిగిన సమావేశంలో ప్రధాని పదవిపై ఎలాంటి చర్చా జరగలేదని ఇటీవల శరద్ పవార్ ...9లో

రాహుల్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

మణిపూర్ పర్యటనలో నాటకీయ పరిణామాలు

- దాడుల భయంతో అడ్డుకున్నామన్న అధికారులు
- ఆ తర్వాత హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్‌కు పయనం
- సహాయ శిబిరాలను సందర్శించి.. బాధితులను కలిసిన రాహుల్



ఇంఫాల్ : అల్లర్లతో అలజడి చెలరేగిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సహాయ శిబిరాలను సందర్శించటం, అల్లర్లతో ప్రభావితమైన కుటుంబాలను ...9లో

కోటా ఏదైనా వ్యాపారమే



ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో అక్రమాలు...కన్వీనర్ కోటాలోనూ లాభాలే పరమావధి

టాప్ ర్యాంకర్లతో సీట్లు బ్లాక్ చేస్తున్న యాజమాన్యాలు

- స్పాట్‌లో రూ.లక్షలకు అమ్ముకుంటున్న వైనం
- బీ కేటగిరీ సీట్లు యథేచ్ఛగా దోపిడీ
- సీఎస్‌ఈకి భారీగా డిమాండ్
- ప్రముఖ కాలేజీల్లో డొనేషన్ రూ.15 లక్షల వరకు కట్టాల్సిందే
- ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల ఇష్టారాజ్యం



ఓ విద్యార్థికి తెలంగాణ ఎంసెట్‌లో టాప్ టెన్‌లో ర్యాంకు వచ్చింది. అదే విద్యార్థి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ టాప్ 50లోపు ర్యాంకు సాధించాడు. ఆపైన ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొని టాప్ కాలేజీలో భారీగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో సీటు పొందుతాడు. ఆ కాలేజీ యాజమాన్యం ఆ సీటును బ్లాక్ చేస్తుంది. ఆ తర్వాత అదే విద్యార్థి ఐఐటీలో సీటు వచ్చిందంటూ ఆ కాలేజీ నుంచి వెళ్లిపోతాడు. అయితే ఆ ఇంజినీరింగ్ కాలేజీ మాత్రం బ్లాక్ చేసిన ఆ సీటును స్పాట్ అడ్మిషన్లలో ఇతర విద్యార్థికి అమ్ముకుంటుంది. వెరసి పేద విద్యార్థులకు అన్యాయమే జరుగుతోంది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రముఖంగా ఉన్న ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో యథేచ్ఛగా జరుగుతున్న దందా ఇదే.

బొల్లె జగదీశ్వర్

రాష్ట్రంలో ఎంసెట్ ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. కన్వీనర్ కోటా సీట్లను కూడా చట్టబద్ధంగా భర్తీ అయ్యాయని చెప్తూనే వాటిని బ్లాక్ చేసి ఆ తర్వాత స్పాట్ అడ్మిషన్లలో రూ.లక్షలకు అమ్ముకుంటున్నాయి. విద్యావ్యాపారానికి పాల్పడుతున్నాయి. ఇక బీ కేటగిరీ సీట్ల దోపిడీ ఏటా యథేచ్ఛగా కొనసాగుతున్నది. కొన్ని కాలేజీలు జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా సీట్లు ఇస్తున్నా మెజార్టీ కాలేజీ యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. ఇప్పుడు సీఎస్ఈకి మంచి డిమాండ్ ఉన్నది. దీన్ని క్యాష్ చేసుకుంటున్నాయి. ఆ బ్రాంచీలో సీటు కావాలంటే ఎంత కడతారు?అంటూ విద్యార్థులు, తల్లిదండ్రులను నేరుగా అడుగుతున్నాయి. ఎవరు ఎక్కువ డబ్బులు చెల్లిస్తే వారికే సీటు గ్యారంటీ చేస్తున్నాయి. ప్రముఖ ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈ సీటు రూ.15 లక్షల వరకు డొనేషన్ కట్టాల్సిందేనని హుకుం జారీ చేస్తున్నాయి. లేదంటే సీట్లు లేవంటూ చెప్పడం గమనార్హం. దీంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్పులు చేసైనా ఆ డబ్బును చెల్లించేందుకు వెనుకాడడం లేదు. దీన్నే యాజమాన్యాలు ఆసరాగా తీసుకుని అందినకాడికి దోపిడీ చేస్తున్నాయి. అంటే కన్వీనర్ కోటా అయినా, యాజమాన్య కోటా అయినా వ్యాపారమే తమ లక్ష్యంగా ...2లో

> ఆ టాప్ ర్యాంకర్లు సీటు రిజర్వు చేస్తే వారికి కొంత డబ్బును ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నాయి. దీంతో వారి తల్లిదండ్రులు విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరం అవుతుందనే కారణంతో దానికి అంగీకరిస్తున్నారు. ఆ మేరకు ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కన్వీనర్ కోటాలోనే సీఎస్ఈలో సీటు సంపాదిస్తారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీటు రిజర్వు చేస్తారు. ఆ తర్వాత ఆ సీటు ఇతరులకు కేటాయించడానికి అవకాశముండదు. అయితే యాజమాన్యాలు ఆ సీటును బ్లాక్ చేసి స్పాట్ అడ్మిషన్లకు ముందు విద్యార్థులు వెళ్లిపోయారంటూ ఖాళీగా చూపించి అమ్ముకుంటున్నాయి. ఏటా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నాయి.

ఆర్‌ఆర్‌ఆర్ ఫట్టేనా?

బీజేపీకి అచ్చిరాని ట్రిబుల్ ఆర్ జపం

- అధిష్టానంపై అలిగిన ఈటల
- దూరం దూరంగా రఘునందన్‌రావు
- సస్పెన్షన్ వేటులో రాజాసింగ్
- అదే బాటలో రాజగోపాల్‌రెడ్డి

ఎన్టీఆర్-రాంచరణ్ కాంబినేషన్‌లో వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమా బ్లాక్‌బ్లాస్టర్ హిట్టయింది. మరో ఆర్‌ఆర్‌ఆర్(రీజనల్ రింగ్ రోడ్డు) ప్రాజెక్టు పట్టా లెక్కింది. కానీ, పొలిటికల్‌గా బీజేపీ జపించిన ఆర్‌ఆర్‌ఆర్(ఈటల రాజేందర్, రఘునందన్ రావు, రాజాసింగ్) మాత్రం రాజకీయ చౌరస్తాలో అట్టర్ ఫ్లాప్ అయింది. నాలుగో ఆర్(రాజగోపాల్‌రెడ్డి) తో తెలంగాణలో చక్రం తిప్పాలని చూసిన బీజేపీ బొక్కబోర్లా పడింది. ఇప్పుడు ఆ పార్టీలో 'ఆర్‌ఆర్‌ఆర్' జపం పక్కకుపోయింది. వేగంగా మారుతున్న రాష్ట్ర రాజకీయ పరిణామాలను చూస్తే ఆ ముగ్గురూ... కాదు,కాదు ఆ నలుగురూ పార్టీలో ఉంటారా? లేదా? అనేదే పెద్ద ధర్మసందేహంగా మారింది.



అచ్చిన ప్రశాంత్

రఘునందన్‌రావు బీజేపీలో మంచి వాక్చాతుర్యమున్న వ్యక్తి. మీడియాలో పొలిటికల్ డిబేట్ ఉందంటే మొదట కనిపించేది ఆయనే. తన మాటల తూటా ద్వారా బీజేపీ వాయిస్‌ను బలంగా వినిపించే నేత. ఇప్పుడు సీను సితారైంది. కొంతకాలంగా ఆయన మీడియాలో ఎక్కడా కనిపించడంలేదు. బీజేపీలో గ్రూపు విభేదాల నేపథ్యంలో ఆయన దుబ్బాక నియోజకవర్గ కేంద్రానికే పరిమితమయ్యారు. అనుమానంతో ఇదేంటని సీనియర్లు ఆరా తీస్తే...'అలాంటిదేం లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వంటి హేమాహేమీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల మధ్యలో తన అసెంబ్లీ స్థానం ఉంది కాబట్టి క్షేత్రస్థాయిలో పనిచేసుకుంటున్నా' అని దాటవేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. మరోవైపు పార్టీలో గ్రూపులు కట్టి హడావిడి చేసే వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనీ, సబ్జెక్టు ఉన్న తనకు తగిన గుర్తింపు ఇవ్వట్లేదని తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు తెలుస్తోంది. నిజానికి రాజాసింగ్‌పై వేటు తర్వాత తనకు శాసనసభలో బీజేపీఎల్పీ నేతగా అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ, అధిష్టానం అస్సలే పట్టించుకోలేదు. అధిష్టానం జాతీయస్థాయిలో పదవి అయినా ఇస్తుందని ఆశపడ్డా అదీ జరగలేదు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఆయన కినుక వహించి పార్టీకి దూరంగా ఉంటున్నారనీ, త్వరలో పార్టీని కూడా వీడబోతున్నారని ...2లో

గాయకుడు, గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయిచంద్ హఠాన్మరణం

సాయిచంద్ మృతదేహానికి సీఎం కేసీఆర్ నివాళ్లు

- అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు
- వేలాదిగా తరలి వచ్చిన అభిమానులు



(ఫైల్)



వివరాలు 9లో

కమలంలో ట్వీట్ వార్

అగ్గి రాజేసిన జితేందర్‌రెడ్డి పోస్టు

- నేతలను తన్ని దారిలోకి తెచ్చుకోవాలని అర్థమొచ్చేలా ట్వీట్
- ఇది బండి నాయకత్వాన్ని ప్రశ్నించేవారిని ఉద్దేశించే అంటూ మరో పోస్టు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కమలం పార్టీలో అంతర్గ పోరు ఇప్పట్లో సర్దుమణిగేలా లేదు. అధిష్టానం రాష్ట్ర నేతలకు ఎంత హితబోధ చేసి పంపినా వివాదాస్పద వ్యాఖ్యలు, ట్వీట్లతో నిప్పుల కుంపటి రాజుకుంటూనే ఉన్నది. ట్విట్టర్ వేదికగా మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి తాజాగా చేసిన పోస్టు ఆ పార్టీలో దుమారం రేపుతున్నది. సతాయిస్తున్న బర్రెను వెనుకనుంచి తన్ని మరీ ఆటోలో ఎక్కిస్తున్న ఫొటో పెట్టి..పార్టీలో మాట వినని నేతలకు ఇలాగే ట్రీట్‌మెంట్ చేయాలంటూ సోషల్‌మీడియా వేదికగా వదిలిన పోస్టు వివాదాస్పదమైంది. ఆ పోస్టును కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, అధ్యక్షులు జేపీ నడ్డా, ముఖ్యనేత సంతోష్‌జీ, రాష్ట్ర ఇన్‌చార్జి సునిల్ బన్సల్‌లకు ట్యాగ్ చేశాడు. సొంత పార్టీ నేతలను విమర్శిస్తూ చేసిన ఈ పోస్టు రాజకీయంగా చర్చనీయాంశమవుతున్నది. ప్రతిపక్ష పార్టీలకు మంచి ఆయుధమైంది. ఈ పోస్టుపై బీజేపీ నేతలంతా ఏమైంది? అని ఆరా తీస్తుండగానే...జితేందర్‌రెడ్డి తొలగించేశారు. మళ్లీ రెండు గంటల తర్వాత అదే పోస్టును రీ ట్వీట్ చేశారు. దానికి అదనంగా '..... బండి సంజయ్ గారి నాయకత్వాన్ని ప్రశ్నించేటోళ్లకు ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాల్నో చెప్పే ప్రయత్నాన్ని తప్పుగ అర్థం చేసుకునే ఊరకుక్కల్లారా..బిస్కెట్ల కోసం బరితెగించకురి' అనే వ్యాఖ్యల్ని జోడించారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి స్పందించి.. 'బీజేపీలో అంతర్గత కుమ్ములాటను అద్భుత పోలికతో ప్రజలకు వివరించారు. బీజేపీలో చేరి ఇబ్బంది పడుతున్న వారి పరిస్థితి గురించి ఇంతకన్నా మంచిగా ఎవ్వరూ చెప్పలేరు' అంటూ ...9లో

ఏండ్ల నిరీక్షణ.. ఫలించనున్నట్టేనా..!

పోడు పట్టాల జారీకి సర్కారు సమాయత్తం

- నేడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా పంపిణీ
- రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తుల్లో సగానికే పత్రాలు
- మిగతావారి పరిస్థితిపై తేల్చని ప్రభుత్వం
- గిరిజనేతరుల అసంతృప్తి



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పోడు పట్టాల కోసం ఏండ్లుగా నిరీక్షిస్తున్న గిరిజనుల కల నేటికి నెరవేరనుంది. తాతల కాలం నుంచి అటవీ భూమిని నమ్ముకొని పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేద గిరిజనులకు ఆ భూములపై హక్కులు అందనున్నాయి. అయితే. దరఖాస్తు చేసుకున్న గిరిజనుల్లో దాదాపు నగం మందికిపైగా ఎంపిక చేయకుండా పక్కనపెట్టేశారు. వారి పరిస్థితి ఏంటనే దానిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఎంపిక చేసిన లబ్దిదారుల పోడు భూములకు సంబంధించి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హక్కుపత్రాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి లాంఛనంగా ప్రారంభించనుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల్లో గిరిజనులకు పోడుపట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,03,896 ఎకరాలకుగాను 37,401 మందికి హక్కుపత్రాలు జారీ కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12.46లక్షల ఎకరాల పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకోగా.. ప్రభుత్వం 4,50,601లక్షల ఎకరాలకు సంబంధించి మాత్రమే 1,50,012మంది లబ్దిదారులకు హక్కుపత్రాలు జారీ చేయనున్నట్టు తెలిసింది. మిగతా వారి పరిస్థితి ఏంటనేది ప్రభుత్వం ఇంతవరకు ఏమీ తేల్చలేదు. వారికి ఎప్పుడిస్తారు.. ఏం చేస్తారనేది తెలియదు.

పోడు భూములకు పట్టాలిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇది వరకే ప్రకటించడంతో.. కిందటేడాది ...9లో

టీఎస్ ఐసెట్ 2023 ఫలితాలు విడుదల



నవతెలంగాణ-కేయూ క్యాంపస్

టీఎస్ ఐసెట్ -2023 ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆచార్య ఆర్.లింబాద్రి.. టీఎస్ ఐసెట్ చైర్మెన్, వీసీ ఆచార్య తాటికొండ రమేష్, కన్వీనర్ ఆచార్య వరలక్ష్మిలతో కలిసి కాకతీయ యూనివర్శిటీ కామర్స్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం విడుదల చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం మే 26, 27 తేదీల్లో నిర్వహించిన టీఎస్ ఐసెట్-23 ప్రవేశ పరీక్షల్లో తొలి 10 ర్యాంకుల్లో అబ్బాయిలే విజయం సాధించారు. హుజూర్‌నగర్‌కు చెందిన నూకల శరణ్‌కుమార్ మొదటి ర్యాంకు సాధించగా, హైదరాబాద్‌కు చెందిన నాగుపల్లి సాయి నవీన్ రెండవ ర్యాంక్, రవితేజ సజ్జ ...2లో

మూడు పంటలకు నీళ్లు..

మూడోసారి తుంగతుర్తి బీఆర్‌ఎస్‌దే..

- ఐటీ పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదు : మంత్రి జగదీశ్ రెడ్డి



నవతెలంగాణ-తిరుమలగిరి

"సమైక్య పాలనలో రాళ్లు, ఇసుకతో దర్శనమిచ్చిన ప్రాజెక్టులు.. నేడు మూడు పంటలకు నీరందించేలా అభివృద్ధి చేసుకున్నాం.. సీఎం కేసీఆర్ ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటున్నారు" అని ఐటీ పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చెప్పారు. తుంగతుర్తిలో మూడోసారి బీఆర్‌ఎస్‌దే విజయమని, ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ హాట్రిక్ సాధించడం ఖాయమని అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రగతి నివేదన సభలో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, సీసీరోడ్లు, ...2లో

వచ్చే నెల 17నుంచి 19వరకు ఏఐఏడబ్ల్యుయూ జాతీయ సమావేశాలు

- నాగార్జున సాగర్‌లో నిర్వహణ
- ఉపాధి చట్ట రక్షణ కోసం చర్చ
- 17న సెమినార్‌కు విజయరాఘవన్
- విలేకర్ల సమావేశంలో ఆర్ వెంకట్రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో వచ్చే నెల 17నుంచి 19వరకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యుయూ) జాతీయ కమిటీ సమావేశాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరా బాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు నారి ఐలయ్య, కందుకూరి జగన్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాగిరి అంజనేయులుతో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రా ములు విలేకర్లతో మాట్లాడారు. సాగర్‌లో నిర్వహించే సమావేశాలకు చాలా ప్రాముఖ్యత ఉందని చెప్పారు. బీజేపీ సర్కార్ ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుచి, కూలీల పొట్టకొడుతున్నదనీ, పోరాడి సాధించుకున్న కూలి చట్టాన్ని రక్షించుకునేందుకు మరో పోరాటానికి సన్నద్ధం కావాల్సిన అవసరాన్ని సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. బీజేపీ సర్కార్ అనుసరిస్తున్న వ్యవ సాయ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా జాతీయ స్థాయి పోరాటాలకు శ్రీకారం చుట్టనున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా 'ఉపాధి హామీ చట్టం-రక్షణ' అంశంపై జాతీయ స్థాయి సెమినార్‌ను మిర్యాలగూడెంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఈ సదస్సుకు అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు విజయరాఘవన్‌తో పాటు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాజ్యసభ సభ్యులు శివదాసన్, మాజీ శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య హాజరవుతారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆహార భద్రత చట్టాన్ని నీరుగార్చిందని విమర్శించారు. సబ్సిడీ బియ్యాన్ని ఎత్తేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేదోళ్లకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని నిలబెట్టుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలేసుకుని ఉంటున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జూలై 10, 11, 12 తేదీల్లో టోకెన్ సమ్మె

- మధ్యాహ్న భోజన కార్మికులు

జయప్రదం చేయాలి : పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 10,11,12 తేదీల్లో టోకెన్ సమ్మె చేయనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఆ సమ్మెలో మధ్యాహ్న భోజన కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సమావేశం ఇందూరు సులోచన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లా డుతూ.. దేశంలో సగం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడు తున్నారనీ, వారికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతున్నదని చెప్పారు. డ్రాపౌట్స్ తగ్గి చదుకునే పిల్లల సంఖ్య పెరగడానికీ, సామాజిక సమానత్వం కాపాడటానికి ఈ పథకం ఎంతో దోహదపడుతున్నదని చెప్పారు. ఇలాంటి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తు న్నాయని విమర్శించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి అమలు చేస్తే మరెన్నో ఫలితాలు పొందవచ్చునని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ. రమ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 54201 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులు 25 వేల పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారన్నారు. పెరిగిన ధరలతో పోల్చితే గతంలో కేటాయించిన బడ్జెట్ సరిపోవడంలేదని తెలిపారు. ధరల పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. 2022 బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ సాక్షిగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి రూ.3 వేలకు పెంచుతామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ, ఇప్పటివరకూ రూ.3 వేల గౌరవ వేతనం ఇచ్చింది లేదన్నారు. అసెంబ్లీలో ప్రకటన చేసినప్పటి నుంచి ఎరియర్స్‌తో సహా చెల్లించాలనీ, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూని సవరించాలనీ, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎజె. రమేష్, నాయకులు ఆర్. శ్రీనివాస్, రాజు, దీప్లానాయక్, రమ్య, కృష్ణమాచారి, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు సీహెచ్. ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, సరస్వతి, నరసమ్మ రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి కళావతి, చామంతి లక్ష్మి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గన్ మిస్ ఫైర్.. సెక్యూరిటీ గార్డు మృతి..

- మింట్ కాంపౌండ్‌లో ఘటన

నవతెలంగాణ-బంజారాహిల్స్

గన్ మిస్ ఫైర్ అయ్యి సెక్యూరిటీ గార్డు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మింట్ కాంపౌండ్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న కానిస్టేబుల్ రామయ్య(46) గన్‌ను శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ అయింది. బుల్లెట్ దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడిన రామయ్యను నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతను మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రామయ్య స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు చెందిన వ్యక్తి. సైఫాబాద్ పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై ప్రింటింగ్ ప్రెస్‌లోని సెక్యూరిటీ సిబ్బందిని సైఫాబాద్ ఏసీపీ సంజయ్ కుమార్, సీఐ సత్తయ్య ఆరా తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గీత వృత్తిని ప్రమాద రహిత వృత్తిగా చేయడమే లక్ష్యం

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సదస్సులో.. గీత పారిశ్రామిక సహకార సంస్థ చైర్మెన్ పల్లె రవి కుమార్‌గౌడ్



నవతెలంగాణ జనగామ

గీత వృత్తిని ప్రమాద రహిత వృత్తిగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని గీత పారిశ్రామిక సహకార సంస్థ చైర్మెన్ పల్లె రవికుమార్ గౌడ్ తెలిపారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా పల్లె రవికుమార్ గౌడ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 2.60 లక్షల మంది గీతా కార్మికులు గీత వృత్తిని కొనసాగిస్తు న్నారని, దాదాపు 5 లక్షల మంది గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వృత్తిలో వైఫల్యాలు అరికట్టి ఆధునీకరణను పెంచుకుంటూ చావులను ఆపడమే లక్ష్యంగా పని చేద్దామని సూచించారు. వృత్తిని నిర్లక్ష్యం చేయకుండా తాటి, ఈత వనాలను కాపాడుకుందామని కోరారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కల్లు గీయడం ప్రమాద కరమైన వృత్తి అయినప్పటికీ కుటుంబ పోషణ కొరకు చేస్తున్నారని తెలిపారు. ప్రతేడాది రాష్ట్రంలో 600 మంది పైగా ప్రమాదానికి గురవుతున్నారని, కాళ్లు, చేతులు విరగడం, నడుములు పడిపోవడం జరుగుతుందని, నూటికి యాభైకి పైగా చనిపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ప్రమాదాలు ఏ వృత్తిలో లేవన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న ఎక్స్‌గ్రేషియో ఆలస్యం అవుతుందని ఎన్ని సార్లు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. నీరా తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ నెలకొల్పి యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, సభ్యు లందరికీ ద్విచక్ర వాహనాలి వ్వాలని, కోటి వరాల పథకంలో 439 సొసైటీలకు ఇచ్చిన భూములు అన్ని ఆన్యాక్రాంతం కాకుండా చూసి, వాటిలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టాలని డిమాండ్ చేశారు. చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలని, 560 జీవో అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, సదస్సులో.. యాదాద్రి భువనగిరి జిల్లాలో తోటి గీత కార్మికుని ప్రాణాలు కాపాడిన బింగి పాండును అభినందించి, సత్కరించారు. అనంతరం బాధితులకు కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెక్కుల ను రవికుమార్ గౌడ్ అందించారు. సదస్సులో సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, ఎస్ రమేష్, బూడిద గోపి, అరుణ్, అంజయ్య, ఉపాధ్యక్షులు గోవిందు, వెంకట నరసయ్య, గౌని వెంకన్న, వెంకట మల్లయ్య బలగాని జయరాములు, వివిధ జిల్లాల అధ్యక్ష,కార్యదర్శులు, మండల అధ్యక్ష,కార్యదర్శులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

కోటా ఏదైనా వ్యాపారమే

(మొదటిపేజీ తరువాయి)

ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యాజమాన్య కోటాలో 24,027 సీట్లు

రాష్ట్రంలో 155 ఇంజినీరింగ్ కాలేజీల్లో 86,106 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 16 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కాలేజీల్లో 4,713 సీట్లు, రెండు ప్రయివేటు వర్సిటీల్లో 1,302 సీట్లు కలిపి మొత్తం 6,015 సీట్లున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరానికి 137 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలకు ఓయూ, జేఎన్టీయూ హైదరాబాద్, కేయూలు అనుబంధ గుర్తింపు ను ప్రకటించాయి. వాటిలో 80,091 సీట్లున్నాయి. అయితే 155 ఇంజి నీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో మాత్రం 62,079 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 137 ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల పరిధిలో 24,027 సీట్లు యాజమాన్య కోటాలో ఉండనున్నాయి.

కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), దాని అనుబంధ కోర్సుల్లోనే 30,807 సీట్లుండడం గమనార్హం. ఇందులో సీఎస్ఈ కోర్సులో 15,897 సీట్లు, సీఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ (ఏఐఅండ్ఎంటీ) కోర్సులో 7,854 సీట్లు, సీఎస్ఈ (డాటా సైన్స్) కోర్సులో 4,515 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) కోర్సులో 9,734 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) కోర్సులో 3,854 సీట్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) కోర్సులో 3,696 సీట్లు, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులో 2,667 సీట్లు, సివిల్ ఇంజినీరింగ్ కోర్సులో 3,087 సీట్లు ఉన్నాయి.

టాప్ ర్యాంకర్లకే గాలం...

ఎంసెట్‌లో టాప్ ర్యాంకర్లందరూ ఐఐటీలలోనే చేరతారు. దీన్ని అవకాశంగా తీసుకుని పలు ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు ఎంసెట్ టాప్ ర్యాంకర్లకు గాలం వేస్తున్నాయి. ఎంసెట్ ద్వారా తమ కాలేజీలో చేరకపోయినా వెబ్‌ఆప్షన్ ఇవ్వాలంటూ కన్సల్టెన్సీల ద్వారా, ఆ కాలేజీ పాత విద్యార్థుల ద్వారా సమాచారం ఇస్తున్నాయి.

ఆ టాప్ ర్యాంకర్లు సీటు రిజర్వు చేస్తే వారికి కొంత డబ్బును ఇస్తామంటూ ఆశ చూపిస్తున్నాయి. దీంతో వారి తల్లిదండ్రులు విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరం అవుతుందనే కారణంతో దానికి అంగీకరిస్తున్నారు. ఎంసెట్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కన్వీనర్ కోటాలోనే సీఎస్ఈలో సీటు సంపాదిస్తారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీటు రిజర్వు చేస్తారు. ఆ తర్వాత ఆ సీటు ఇతరులకు కేటాయించడానికి అవకాశ ముండదు. అయితే యాజమాన్యాలు ఆ సీటును బ్లాక్ చేసి స్పాట్ అడ్మిషన్లకు ముందు విద్యార్థులు వెళ్లిపోయారంటూ ఖాళీగా చూపించి అమ్ముకుంటు న్నాయి. ఏటా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నాయి.

కన్వీనర్ కోటాలో అయితే తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) నిర్ణయించిన ఫీజులనే తీసుకోవాలి. ఒకవేళ ఎంసెట్‌లో పదివేల లోపు ర్యాంకు, ఎస్సీ,ఎస్టీలైతే మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుంది. అది కూడా ఏటా విడుదల చేయడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలిస్తూ అక్రమ పద్ధతుల్లో సీట్లను భర్తీ చేస్తున్నాయి. అయితే టాప్ ర్యాంకర్లు చేరకపోయినా సీఎస్ఈ వంటి డిమాండ్ ఉన్న సీట్లను బ్లాక్ చేయడంతో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలు, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతున్నది. ప్రముఖ కాలేజీల్లో వారు సీట్లు పొందలేకపోతున్నారు.

ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్న ఉన్నత విద్యామండలి

కన్వీనర్ కోటాలో సీట్లు బ్లాక్ చేసి అమ్ముకుంటున్న కాలేజీల అంశం ఉన్నత విద్యామండలి దృష్టికి వచ్చింది. దీనిపై అధికారులు ప్రత్యామ్నాయాలను ఆలోచిస్తున్నారు. కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయకుండా ఉంటే ఎలా ఉంటుందన్న దిశగా సమాలోచన చేస్తున్నారు. ఇంకోవైపు ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో ఉన్నట్టుగా యాజమాన్య కోటా సీట్లను కన్వీనర్ ద్వారా భర్తీ చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో ఉన్నారు. అయితే నిపుణులతో సంప్రదించి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తున్నారు. వాటిని క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి ఆ తర్వాత అమలు చేయాలన్న ఆలోచనతో ఉన్నారు.

టీఎస్ ఐసెట్ 2023 ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

మూడో ర్యాంక్ సాధించారు. తర్వాతి స్థానాల్లో వరుసగా.. ఎస్. సాయి ఫణి ధనుష్ (హైదరాబాద్), గోపి మల్లికంటి (సూర్యాపేట), తిరుగుడు సుమంత్ కుమార్ రెడ్డి (నల్లగొండ), ఆయచితుల నితీష్ కుమార్ (వేములవాడ), వేదాంతం సాయి వెంకట కార్తీక్ (సికింద్రాబాద్), శ్రీఖకొలను నాగసాయి కృష్ణవంశీ (గుంటూరు), బైరి సాయి గణేష్ (మంచిర్యాల) నిలిచారు. కాగా, ఐసెట్ 2023 పరీక్షలో.. మొత్తం 75,925 అభ్యర్థులు నమోదు చేసుకోగా, 70,900 మంది ప్రవేశ పరీక్ష రాశారు. వారిలో 61,092 మంది (86.17 శాతం) అర్హత సాధిం చారు. వారిలో బాలురు 29618 మంది, బాలికలు 31473 మంది, ట్రాన్స్ జెండర్ 1 ఒక్కరు ఉన్నారు. మరిన్ని వివరాలు convenor.icet @ tsche. ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య శ్రీని వాసరావు, ఆచార్య ఎస్.నరసింహచారి, ఆచార్య పి.అమరావేణి, ఆచార్య ఎన్.వాసుదేవరెడ్డి, ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య పి.కృష్ణమాచారి, డాక్టర్ ఎం.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలంటూ వినతి

యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రిని కలిసి వినతిపత్రం అందించారు. తెలంగాణ వ్యాప్తంగా 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1356 మందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. లింబాద్రి స్పందిస్తూ.. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల పర్సనల్ డేటాను జూన్ 2023 నాటికి పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులుగా ఉన్న వారందరి సమాచారాన్ని తెప్పించుకొని పరిశీలిస్తామని తెలిపారు. చైర్మెన్‌ను కలిసిన వారిలో.. జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, కో-చైర్మెన్ జరుపుల చందూలాల్, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ సుచరిత పాల్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ ఫట్టేనా?

విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది.

టీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో ఈటల రాజేందర్ నెంబర్ 2గా వెలుగొందారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో పొలిటికల్‌గా తనకు తానుగా రక్షించుకోవాలనుకునే తొందరపాటులో బీజేపీలో చేరారు. తన వ్యక్తిత్వానికి, భావజాలానికి భిన్నమైన పార్టీలో ఇమడలేకపోతున్నారు. నలుగురిలో స్వేచ్ఛగా తిరిగిన ఆయన ఇప్పుడు బీజేపీ బంధంలో చిక్కుకుని అల్లాడిపోతున్నారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడే ఆయన ఇప్పుడు బీజేపీలో మెజార్టీ గ్రూపునకు ప్రధాన శత్రువు అయ్యారు. జాతీయ అధిష్టానం నచ్చజెప్పి పంపినా రాష్ట్ర అధిష్టానంతో ఆయనకు ఇంకా మడత పేచీ ఉంది. జితేందర్‌రెడ్డి ట్వీట్ ఈటలను ఉద్దేశించే అని జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఒకప్పుడు కింగ్‌లా ఉన్న ఈటల రాజేందర్‌ను ఇప్పుడు బీజేపీ నుంచి పొమ్మనలేక పొగపెడుతున్నారనీ, ప్రస్తుత పరిణామాలతో ఆయన కూడా విసిగిపోయి కాంగ్రెస్‌వైపు చూస్తున్నారని ప్రచారం జరుగుతున్నది.

హైదరాబాద్‌లోని బీజేపీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్. ప్రస్తుతం ఆయన ఆ పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన ఏది మాట్లాడినా..ఏం చేసినా వివాదాస్పదమే. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆయన అనుచరులకు టిక్కెట్లు బీజేపీ అగ్రనేతలు దక్కనివ్వలేదు. కిషన్‌రెడ్డి తమ నేతను తొక్కిపడేస్తు న్నారంటూ రాజాసింగ్ అనుచరులు బీజేపీ ఆఫీసులో పెద్ద గలాటే చేశారు. గోసంరక్షణ పేరుతో ఉద్రిక్తతలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి రాజాసింగ్ విమర్శలపాలయ్యాడు. చివరకు బీజేపీ అతన్ని సస్పెండ్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరు నెలలు దాటినా ఆయనపై బహిష్కరణ వేటు ఎత్తేయలేదు. దీంతో బీజేపీ ఆఫీస్‌కు దూరం అయ్యారు. సొంత కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఈ ముగ్గురూ పోనూ మిగిలిన నాలుగో ఆర్...రాజగోపాల్‌రెడ్డి. ఆయనతో రాజీనామా చేయించి మరీ దక్షిణ తెలంగాణలో పట్టుసాధించి రాష్ట్రంలో పాగా వేయాలని బీజేపీ శతవిధాలా ప్రయత్నించింది. రాజగోపాల్‌రెడ్డికి ఉన్న గత పరిచయాలు, కాంగ్రెస్ ఓటింగ్‌తో గెలుపు దాకా వచ్చారు. కానీ, బీజేపీలోని పాతోళ్ల బ్యాచ్ అంతా హ్యాండ్ ఇచ్చి ఆయన్ను రాజకీయ సమాధి చేయాలని చూసిందనే విమర్శ ఉంది. అతడు గెలిస్తే రాష్ట్రంలో తమ పెత్తనం పోతుందనే భయంతో సీనియర్ నేతలు కొందరు ఆయన ఓటమిని కోరుకున్నారనే విమర్శలు కూడా అప్పట్లో బలంగా వచ్చాయి. రాజగోపాల్‌రెడ్డి సైతం పార్టీలోని సీనియర్లు సహకరించలేదని బహిరంగంగానే పలుమార్లు అన్నారు. తన నియోజకవర్గంలోని పరిణామాలు, కవితను అరెస్టు చేయకపోవడం, బీజేపీలో ఉంటే కేసీఆర్‌ను దెబ్బకొట్టాలనే తన లక్ష్యం నెరవేరదే మోనన్న అనుమానం ఆయనలో మొదలైంది. ఈ నేపథ్యంలో మళ్లీ ఆయన హస్తం గూటికి చేరే ప్రయత్నంలో ఉన్నారు. ఆర్..ఆర్..ఆర్..ఆర్..తో తమపార్టీకి మంచి ఊపు వస్తుందని అతిగా ఆశపడ్డ బీజేపీ బొక్కబోర్లా పడింది. ఇప్పుడు ఆ నలుగురితోనే ఆ పార్టీకి తీవ్ర నష్టం జరుగబోతున్నది.

మూడు పంటలకు నీళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

డ్రెయినేజీ, ఆడిటోరియం, మంచినీటి ట్యాంకులు, పైప్‌లైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణ పరిధిలోని ప్రాజెక్టులు నాడు రాళ్లు, ఇసుక తిన్నెలు దర్శనం ఇస్తే.. నేడు మూడు పంటలకు నీరు అందిస్తున్నాయని చెప్పారు.

ఒకప్పుడు కక్షలు, రక్తపాతంతో అట్టుడికిన తుంగతుర్తి నియోజకవర్గం నేడు పచ్చటి పంట పొలాలతో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ నాయ కత్వంలో మంత్రి జగదీశ్ రెడ్డి అండదండలతో రెండు లక్షల 50 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించుకోగలి గామని చెప్పారు. తుంగతుర్తి నియోజక వర్గంలో 12 వేల కుటుంబాలకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ద్వారా సాయం అందించామన్నారు. దళిత సోదరుల జీవితాల్లో దళితబంధు ద్వారా 10 లక్షల రూపాయ లతో నూతన వెలుగు వచ్చిందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ఆసరా పింఛన్ల ద్వారా ముస లవ్వలకు కేసీఆర్ పెద్ద కొడుకుగా ఆకలి తీరుస్తు న్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రూ. 6500 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. దళిత బంధు పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి ఎంపిక కావడంలో గాదరి కిషోర్‌కుమార్ పాత్ర ఉందన్నారు. యాదగిరి గుట్ట పుణ్యక్షేత్రాన్ని నేడు మన ప్రభుత్వ పాలనలో తిరుపతికి ఎంత మాత్రం తీసిపోకుండా అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు.

ఆక్రోషం.. బాధ నుంచి పుట్టిందే బీఆర్ఎస్ : మంత్రి జగదీశ్‌రెడ్డి

సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతం ఎంతో వివక్షకు గురై.. నీళ్లు, నిధులు, నియామకాల్లో తీవ్ర నష్టం కలిగిందని, ఆ ఆక్రోషం, బాధ నుంచి పుట్టిన పార్టీయే బీఆర్ఎస్ పార్టీ అని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలో ఫ్లోరిన్ భూతం ఊర్లకు ఊర్లు కబళిస్తుంటే ఒక్క సమైక్య పాలకుడు కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. నేడు కాళేశ్వరం జలాలతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ పైప్‌లైన్‌తో సురక్షితమైన నీటిని అందిస్తున్నామని, ఫ్లోరిన్ భూతాన్ని తరిమేశామని చెప్పారు. ఇన్ని బాధలకు కారనమైన కాంగ్రెస్, బీజేపీకి ఓటు అడిగే కనీస హక్కు లేదన్నారు.

ఒకప్పుడు బియ్యం కోసం పంజాబ్ వైపు చూసిన మనం.. నేడు తెలంగాణ దేశానికి అన్నం పెట్టే ధాన్యాగారంగా మారిందన్నారు. దేశా నికి అన్నం పెట్టేది తెలంగాణ అయితే.. రాష్ట్రానికి అన్నం పెట్టేది ఉమ్మడి నల్లగొండ జిల్లా అని, ఈ స్వప్నం కేసీఆర్ నాయకత్వంలో సాకారం అయిందని చెప్పారు. గాదరి కిషోర్ కుమార్‌కి ఓటు వేసి మూడో సారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, పైళ్ళ శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత మహేందర్, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, రవీందర్ నాయక్, భాస్కరరావు, నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ గుజ్జ దీపిక యుగేందర్ రావు, జిల్లా రైతుబంధు సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ ఎస్ఎ.రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంజయ్యభవన్ ముట్టడిని జయప్రదం చేయాలి

- వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సెక్యూరిటీ సర్వీసెస్‌కు సంబంధించిన కనీస వేతనాల జీవో 21 విడుదలై రెండేండ్లవుతున్నా అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని అంజయ్య భవన్ (రాష్ట్ర కార్మిక శాఖ ప్రధాన కార్యాలయం)ను ముట్టడించనున్నట్టు వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల యూనియన్(సీఐటీయూ అనుబంధం) తెలిపింది. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల సాంబయ్య, యాటల సోమన్న ఒక ప్రకటన విడుదల చేశారు. 28 ఏండ్ల నుంచి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మార్కెట్ యార్డుల్లో, చెక్‌పోస్టుల్లో సెక్యూరిటీ గార్డులుగా సుమారు 1,200 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కనీస వేతనాల్లేక వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్టు వ్యవస్థ కాకుండా నేరుగా మార్కెట్ కమిటీల నుంచే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికులకు జీతాలు పెంచాలి

- రావాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలి
- వేధింపులు మానుకోవాలి :టీఎస్‌ఆర్టీసీ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులకు జీతాలు పెంచాలని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. వారికి రావాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలనీ, కార్మికులపై వేధిం పులను మానుకోవాలని కోరింది. గురువారం హైదరాబాద్ బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌ఆర్టీసీలోని యూనియన్ల సమావేశం నిర్వహించారు. తక్షణమే ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ, సమస్యల పరిష్కారం, బకాయిలను రాబట్టుకునేందుకు పోరాటం చేసేందుకు వీలుగా ఈ సమావేశంలో జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మెన్‌గా ఇ.అశ్వత్థామ రెడ్డి (టీఎంయూ), కన్వీనర్‌గా కె.హనుమంతు ముది రాజ్ (టీజేఎంయూ), సమాన హోదా అధికారాలను కల్పిస్తూ తీర్మానించి ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా ఎం.నరేందర్ (ఎన్ఎంయూ), ఎర్ర స్వామి కెఎస్ (బీఎంఎస్), కె.అబ్రహం ఎస్ డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ), సుద్దాల సురేష్ బీడబ్ల్యూయూ, బి యాదగిరి కెపీ(టీఎస్ టీయూసీ),పున్న హరికిషన్ ఎస్ టీఎంయూలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్, కన్వీనర్లు అశ్వ ద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు చట్ట ప్రకారం నాలుగేండ్లకోసారి వేతన సవరణ చేయాల్సి ఉండగా ప్రభుత్వం, యాజమాన్యం కలిసి పదేండ్లైనా వేతనాలు పెంచలేదని విమర్శించారు.

ఆర్టీఏ ఆన్‌లైన్ సేవలకు సర్వర్ ఎఫెక్ట్!



59 సేవల్లో 18 ఇంటి నుంచే పూర్తిచేసుకునే అవకాశం

- మరిన్ని సేవలు తెచ్చేందుకు ఇబ్బందులు
- సర్వర్ సామర్థ్యం పెంపుపై రవాణాశాఖ దృష్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆర్టీఏ ఆన్‌లైన్ సేవల పెంపునకు సర్వర్ సామర్థ్యం అంతరాయంగా మారింది. ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందిస్తున్న సేవలకు మరికొన్ని చేర్చాలంటే సర్వర్ సామర్థ్యం సరిపోని పరిస్థితి. దాన్ని అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వినియోగదారులు రవాణాశాఖ కార్యాలయానికి రాకుండానే ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో పూర్తి చేసుకునేలా రవాణాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా మొత్తం 59 పౌరసేవలకుగాను దాదాపు 40 సేవలను ఆన్‌లైన్ చేయాలని రవాణాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రెండేండ్ల కిందట రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా ఎనీవేర్-ఎనీటైం(ఎక్కడైనా, ఎప్పుడైనా) పద్ధతిలో టీ-యాప్ ఫోలియో ద్వారా ఆర్టీఏ పౌర సేవలను ప్రారంభి అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటివరకు దాదాపు 18 రకాల సేవలను ఆన్‌లైన్‌లోకి మార్చారు.

ఈ సేవలపై ప్రజల నుంచి స్పందన బాగున్నప్పటికీ.. కొత్తగా మరికొన్ని సేవలను ప్రవేశపెట్టాలంటే అందుకు అనుగుణంగా ఇప్పుడున్న సర్వర్లను అప్‌డేట్ చేయాలి. అలా అయితేనే, ఆన్‌లైన్ సేవలతోపాటు రోజువారీ సేవలకు ఇబ్బందులు ఉండవు. ఇటీవల ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి పువ్వాడ సైతం మరిన్ని సేవలను ఆన్‌లైన్‌లో ప్రవేశపెడుతామని.. అందుకు అనుగుణంగా సర్వర్ల సామర్థ్యం పెంపుపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రవాణాశాఖకు రాష్ట్రవ్యాప్తంగా 54 కార్యాలయాలు ఉండగా.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 11 ఆఫీసులున్నాయి. వీటి పరిధిలో 1.52 కోట్ల వాహనాలు నమోదు కాగా.. ఇందులో 1.10 కోట్ల ద్విచక్ర వాహనాలున్నాయని ఆర్టీఏ గణాంకాలు చెబుతున్నాయి. 2014లో రాష్ట్రంలో అన్ని రకాల వాహనాలు కలిపి

సర్వర్ సామర్థ్యానికి మించి భారం..!

71లక్షలు ఉండగా.. ఇప్పుడది రెండింతలు పెరిగింది. దానికితోడు రాష్ట్రవ్యాప్తంగా రోజువారీగా సుమారు రూ.12-15వేల లావాదేవీలు జరుగుతుంటాయి. వీటిలో ఎక్కువగా కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు, లెర్నింగ్, పర్మినెంట్ లైసెన్స్, ఫిట్‌నెస్‌ల కోసం స్లాట్ బుక్ చేసుకునే వారే ఎక్కువగా ఉంటారు. ఇలా నిత్యం జరిగే లావాదేవీలను సర్వర్‌లో భద్రపరుస్తుంటారు. ప్రస్తుతం రవాణా శాఖలో ఉన్న సర్వర్లు సుమారు 15 ఏండ్ల కింద ఏర్పాటు చేసినవి. ప్రతి ఐదేండ్లకు ఒకసారి సర్వర్ అప్‌గ్రేడ్ చేయించాల్సి ఉంటుంది. కానీ అది జరగడం లేదని సమాచారం. దానికితోడు 59 సేవల్లో దశలవారీగా 18రకాల సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చారు. దీంతో సర్వర్ సామర్థ్యానికి మించి భారం పడుతుండ టంతో తరచూ ఏదో ఒక సమస్య వస్తోంది. ఆన్‌లైన్ సేవలతో వినియోగదారులకు దళారులు, మధ్యవర్తుల బెడద లేకుండా పోయిందనేది వాస్తవమే. గతంలోలాగా ఎలాంటి ఇబ్బందులూ లేవు. ఆన్‌లైన్‌లోకి మరిన్ని సేవలు మార్చాలంటే సర్వర్ సామర్థ్యం పెంచాలి. ఈ అంశం ప్రభుత్వ పరిధిలో ఉండటంతో అధికారులు సైతం మౌనం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సైతం మరికొన్ని ఆర్టీఏ సేవలను ఆన్‌లైన్‌కి మార్చే యోచనలో ఉన్నట్టు సంకేతాలు ఇచ్చారు. కానీ సర్వర్ల సామర్థ్యం పెంచితేనే ఇది ముందుకు సాగే అవకాశం ఉంటుంది.

18 సర్వీసులు ఇవే..

రవాణాశాఖ మొత్తం 59 రకాల పౌరసేవలను ఆన్‌లైన్‌లో అందిస్తుండగా.. వీటిలో 18 సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో ఎనీవేర్-ఎనీటైం పద్ధతిలో ఇంటి నుంచే పూర్తి చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. అందులో.. డూప్లికేట్ డ్రైవింగ్ లైసెన్స్, డూప్లికేట్ లెర్నింగ్ లెసెన్స్, పాత లెసెన్సుల స్థానంలో స్మార్ట్‌కార్డులు పొందడం, లైసెన్స్ హిస్టరీ షీట్, బ్యాడ్జి మంజూరు, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డ్రైవింగ్ లెసెన్స్‌లో అడ్రస్ మార్పు, ప్రమాదకర లైసెన్స్(హజార్డస్) ఆమోదం, లైసెన్స్ ఎండార్స్‌మెంట్, గడువు తీరిన లర్నర్ లైసెన్స్ స్థానంలో కొత్త ఎల్ఎల్ఆర్, వాహన తరగతి ప్రకారం లర్నర్ లైసెన్స్, ఎక్స్‌పైర్డ్ డ్రైవింగ్ లైసెన్స్ వాళ్లకు లర్నర్ లైసెన్స్, ఆర్సీలో చిరునామా మార్పు, బండి ఓనర్‌షిప్ బదిలీ, రాష్ట్ర పరిధిలో క్లియరెన్స్ సర్టిఫికెట్, కొత్త పర్మిట్, డూప్లికేట్ పర్మిట్, పర్మిట్ రెన్యూవల్, తాత్కాలిక లేదా ప్రత్యేక పర్మిట్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సేవల పట్ల వినియోగదారుల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రెడీ..

- దమ్మూ, ధైర్యం ఉంటే బీఆర్ఎస్ పాలకులు రావాలని భట్టి సవాల్..
- జులై 2న ఖమ్మం బహిరంగ సభకు తరలిరండి



నవతెలంగాణ-కూసుమంచి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేపట్టిన ఇందిర, రాజీవ్ సాగర్ ప్రాజెక్టు పనులు కాంగ్రెస్ హయాంలోనే 80 శాతం పూర్తయ్యాయని, మరో రూ.1500 కోట్లు ఖర్చు చేస్తే మిగతా 20శాతం పనులు పూర్తయి 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని, కానీ ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో రూ.25 వేల కోట్లకు బడ్జెట్ పెంచి పదేండ్లు కావస్తున్నా ఒక్క ఎకరానికి కూడా చుక్క నీరు ఇవ్వని బీఆర్ఎస్ వైఫల్యంపై తాను చర్చకు సిద్ధమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. ఈ అంశంపై మాట్లాడడానికి దమ్ము, ధైర్యం ఉంటే బీఆర్ఎస్ పాలకులు చర్చకు రావాలని సవాల్ చేశారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచికి చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేండ్ల పరిపాలనలో ఖమ్మం జిల్లాకు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. పాలేరు నియోజకవర్గ ప్రజల ఓట్లను కాంట్రాక్టుల కోసం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కేసీఆర్ వద్ద అమ్మేశాడని ఆరోపించారు. గతంలో పాలేరు నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన సంభాని చంద్రశేఖర్, రామ్‌రెడ్డి వెంకట్ రెడ్డి లాంటి నేతలు ఏనాడు ప్రజల ఓట్లను అమ్ముకోలేదన్నారు. కందాల ఉపేందర్ రెడ్డి పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారని, నాలుగు నెలలు ఆగితే తనని, తన పార్టీని పాలేరు ప్రజలు బంగాళాఖాతంలో పడేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాదయాత్రకి ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులను అర్ధరాత్రి అరెస్ట్ చేసిన ఏసీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు పోలీస్ మాన్యువల్ ప్రకారం పనిచేయకుండా సంఘ విద్రోహ శక్తులను అరెస్టు చేసినట్టు కాంగ్రెస్ నాయకుల ఇంటికి వెళ్లి వారిని ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా జులై 2న ఖమ్మంలో నిర్వహించే జనగర్జన సభకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరవుతున్నారని తెలిపారు. ఇదే సభలో ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేరిక ఉంటుందన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి పెద్ద ఎత్తున ప్రజలు కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుర్గా ప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు మాజీ జడ్పీ చైర్మెన్ చందా లింగయ్య, అసీవుద్దిన్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

11.50 లక్షల ఎకరాల పోడుభూములకు హక్కుపత్రాలివ్వాలి

- అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలను కల్పిస్తామంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం 2005, డిసెంబర్ 13కు ముందు గిరిజనులు, ఇతర పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు కల్పించాలని వామపక్ష పార్టీలు, గిరిజన సంఘాలు అనేక ఏండ్లుగా పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. ఫలితంగా శుక్రవారం నుంచి పోడు భూములకు హక్కుపత్రాల పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్రంలో 11.50 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలిస్తామంటూ సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కేవలం నాలుగు లక్షల ఎకరాలను 1.50



లక్షల మంది గిరిజనులకు మాత్రమే హక్కు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడం సరైంది కాదని తెలిపారు. శాటిలైట్ మ్యాపుల పేరుతో కొత్తగా పోడు సాగు చేశారనే కారణాలతో నాలుగు లక్షల ఎకరాలకుపైగా దరఖాస్తులు చేసుకున్న లక్ష మంది గిరిజనుల దరఖాస్తులను కారణాలు తెలపకుండానే తిరస్కరించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ప్రభుత్వ ఆలోచనకు ఇది విరుద్ధమని పేర్కొన్నారు. తిరిగి పోడు భూముల సమస్య ఉత్పన్నం కాకుండా ఉండాలంటే 11.50 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలివ్వడమే పరిష్కారమని సూచించారు. ఒక్క గిరిజనేతరుడికీ హక్కు కల్పించబోమంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని తెలిపారు. గిరిజనేతరులు ఇప్పటికే రెండు లక్షల దరఖాస్తుల ద్వారా నాలుగు లక్షల ఎకరాలకుపైగా హక్కు కల్పించాలంటూ విజ్ఞప్తి చేశారని పేర్కొన్నారు. వాటిని పరిశీలించకుండా గ్రామ సభల్లో చర్చించకుండా ఆయా దరఖాస్తులను తిరస్కరించారని తెలిపారు.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం ప్రకారం మూడు తరాలుగా పోడు భూములను సాగు చేస్తున్న గిరిజనేతరులకు కూడా హక్కు పత్రాలివ్వాలని సూచించారు. అయినా పోడు భూముల పంపిణీలో వారికి అవకాశం లేకుండా చేయడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాజకీయ జోక్యాన్ని నివారించి పారదర్శకంగా జరిగేలా చూడాలని కోరారు. ప్రారంభం రోజు అట్టహాసంగా జరిగినా తర్వాత జరిగే హక్కుల పత్రాలను గ్రామసభల్లోనే పంపిణీ చేయాలని సూచించారు.

షూ వేసుకుని రావొద్దు

- చెప్పులతో హాజరు కావాలి
- రేపే గ్రూప్-4 రాతపరీక్ష

9.51 లక్షల మంది దరఖాస్తు

- 2,846 కేంద్రాల ఏర్పాటు
- సర్వంసిద్ధం చేసిన టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-4 పోస్టులకు రాతపరీక్ష శనివారం జరగనుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) సర్వంసిద్ధం చేసింది. శనివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్-2ను ఓఎంఆర్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అయితే పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేస్తారు. అభ్యర్థులు ఉదయం 9.45 గంటల్లోపు, మధ్యాహ్నం 2.15లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత అభ్యర్థులను అనుమతించరు. పేపర్-1కు ఉదయం ఎనిమిది గంటల నుంచి పేపర్-2కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందు భద్రతా సిబ్బందికి, గదిలోకి వెళ్లాక ఇన్విజిలేటర్‌కు ఫొటో గుర్తింపు కార్డును


(ఫైల్)

చూపించాలి. అభ్యర్థి కాకుండా వేరే వ్యక్తులు పరీక్షకు హాజరైనట్టు గుర్తిస్తే పోలీసు కేసు నమోదు చేయడంతోపాటు ఆ అభ్యర్థిని పరీక్షలకు అనర్హుడిగా ప్రకటిస్తారు. ఈ పరీక్షకు అభ్యర్థులు భారీగా హాజరు కానుండడంతో వేలిముద్రను తప్పనిసరి చేశారు. అయితే బయోమెట్రిక్ ద్వారా హాజరును తీసుకోవడం లేదు. ఓఎంఆర్ పత్రంలో బ్లూ/బ్లాక్ పెన్‌తో పేరు, కేంద్రం కోడ్, హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ రాయాలి. హాల్‌టికెట్, ప్రశ్నాపత్రం నెంబర్ సరిగా రాయకున్నా, బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ కాకుండా ఇంక్‌పెన్, జెల్‌పెన్, పెన్సిల్ ఉపయోగించినా ఓఎంఆర్ పత్రం చెల్లుబాటు కానిదిగా గుర్తిస్తారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమోట్‌తో కూడిన కారు తాళాలు, విలువైన, నిషేధిత వస్తువులను అభ్యర్థులు తీసుకెళ్లకూడదు. అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి. షూ వేసుకుని రావొద్దంటూ టీఎస్‌పీఎస్సీ సూచించింది. అయితే శనివారం గ్రూప్-4 రాతపరీక్ష నిర్వహించే పరీక్షా కేంద్రాలున్న విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవును ప్రకటించింది. వచ్చేనెల ఎనిమిదిన రెండు శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 8,180 గ్రూప్-4 పోస్టుల భర్తీ కోసం గతేడాది డిసెంబర్ ఒకటిన నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-4కు రాష్ట్ర వ్యాప్తంగా 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2,846 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్‌టికెట్లను **https://www.tspsc.gov.in** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

విద్యాపరమైన ఆలోచనలే విధాన నిర్ణయాలు కావాలి

- బీఈడీ కోర్సుకు ఆదరణ తగ్గటం బాధాకరం
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. ఆర్.లింబాద్రి




నవతెలంగాణ-ఓయూ

విద్యాపరమైన ఆలోచనలన్నీ విధాన నిర్ణయాలకు దిశా నిర్దేశం ఇవ్వాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. ఆర్.లింబాద్రి అన్నారు. ఓయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన "ఎమర్జింగ్ పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యూకేషన్" అంశంపై జాతీయ సెమినార్ ముగింపు కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. ముఖ్యంగా బీఈడీ కోర్సుకు ఆదరణ తగ్గడంపై ఆందోళన చెందారు. విద్యావ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను సిద్ధం చేసే బాధ్యత విశ్వవిద్యాలయ విద్యా విభాగానికి ఉంటుందని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 విద్యా విభాగం, దాని పనితీరుపై విపులంగా చర్చించిందని తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యలో తీసుకొచ్చిన మార్పులు రానున్న రోజుల్లో మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఓయూ వీసీ ప్రొ. డి.రవీందర్ మాట్లాడుతూ.. బాధ్యతాయుతంగా పనిచేసే ఉపాధ్యాయులపై విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఓయూ ర్యాకింగ్‌లో స్వల్ప శాతంలో మార్పు రావడానికి అధ్యాపకుల కొరత కారణమని చెప్పారు. జాతీయ విధానాలకు దీటుగా ఓయూ పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సెమినార్‌లో దేశం నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు 295 పరిశోధన పత్రాలు సమర్పించారని, ప్రఖ్యాత సంస్థల నుంచి విషయ నిపుణుల ఆధ్వర్యంలో విద్యాపరమైన నూతన ఆలోచనలతో చర్చ జరిగిందని సెమినార్ కన్వీనర్ డాక్టర్ పారిపెల్లి శంకర్ తెలిపారు. సెమినార్ కో-కన్వీనర్ డాక్టర్ దుర్గేశం ఆధ్వర్యంలో ప్రతినిధులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ.రామ కృష్ణ, ప్రొ.మృణాళిని, ప్రిన్సిపల్ ప్రొ.రవీంద్రనాథ్, కె.మూర్తి, డీన్ ప్రొ.రాజేశ్ కుమార్, డాక్టర్, లలిత, డాక్టర్ బి.సుజాత, డాక్టర్ సునీత, డాక్టర్ దుర్గేశం, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ మధుకర్, డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

శేజల్ మరోసారి ఆత్మహత్యాయత్నం

- జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వద్ద అపస్మారక స్థితిలో..
- బెల్లంపల్లి ఎమ్మెల్యే వేధించారని పోరాడుతున్న శేజల్



నవతెలంగాణ-సిటీబ్యూరో

బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను లైంగికంగా వేధించడాంటూ కొన్ని రోజులుగా ఆరోపణలు చేస్తున్న శేజల్ అనే యువతి మరోసారి ఆత్మహత్యకు యత్నించింది. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మగుడి వద్ద ఆమె అపస్మారక స్థితిలో పడిపోయి కనిపించింది. ట్రాఫిక్ పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. శేజల్ బ్యాగులో నిద్రమాత్రలు లభ్యమైనట్టు సమాచారం. దాంతో ఆమె నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్టు తెలుస్తోంది. పోలీసులు సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఆత్మహత్యకు యత్నించడం మూడోసారి.

సూసైడ్‌నోట్‌లో కీలక అంశాలు..

శేజల్ రాసిన సూసైడ్‌నోట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. తనకు ఎవరూ న్యాయం చేయలేకపోయారని.. పెద్దమ్మతల్లి అయినా న్యాయం చేయాలని ఆ సూసైడ్ లెటర్‌లో రాసి ఉంది. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తనను కొన్ని నెలలుగా లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ న్యాయపోరాటం చేస్తున్నట్టు పేర్కొంది. అయితే ఎన్నాళ్లకైనా మంత్రులు తన ఆవేదనను అర్థం చేసుకుంటారని భావించినప్పటికీ అది జరగలేదని వెల్లడించింది. తాను ఇదివరకు ఢిల్లీలోని సీఎం కేసీఆర్ ఇంటి ముందు నిరసన తెలిపిన సమయంలో మంత్రి కేటీఆర్ పిలిచి మాట్లాడారని పేర్కొంది. అక్కడే ఉన్న ముగ్గురు అధికార పార్టీ పెద్దలు తనకు న్యాయం చేస్తారని చెప్పారని, దుర్గం చిన్నయ్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపింది. అంతేకాదు తనపై, తన కుటుంబ సభ్యులపై పెట్టిన అక్రమ కేసులను కూడా ఎత్తేయిస్తామని చెప్పినట్టు లేఖలో ఉంది. తమకు భూమి ఇచ్చి.. తమ వద్ద నుంచి తీసుకున్న డబ్బులు కూడా తిరిగి ఇప్పిస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొంది.

అవేమీ వారు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ పేర్కొంది. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడుతున్నారని రాసింది. ఎవరు వచ్చి ఎప్పుడు చంపుతారో అనే భయం తనను వెంటాడుతోందని.. తనకు ఇక న్యాయం జరగదని.. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు లేఖలో పేర్కొంది. తాను చనిపోయిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని.. అందుకే సూసైడ్ లెటర్ రాస్తున్నట్టు వివరించింది.

సాయిచంద్ మృతికి సీపీఐ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మలిదశ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ హఠాన్మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిచిన్న వయస్సులోనే మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలతో ప్రజలను ఉత్తేజపరిచారని తెలిపారు.

ప్రజాపంథా నివాళి

తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ గుండెపోటుతో మరణించడం బాధకరమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. చిన్న వయస్సులో ఇలా అకాల మరణం పొందడం ఆయన కుటుంబానికి, సాంస్కృతిక రంగానికి తీరనిలోటని పేర్కొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనిది : న్యూడెమోక్రసీ

తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్ ప్రజలను జాగృతం చేసిన తీరు, సామాజికంగా రాసి పాడిన పాటలు మరువలేనివని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె గోవర్ధన్ తెలిపారు. 39 ఏండ్లకే గుండెపోటుతో అకాల మరణానికి గురికావడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం, కుటుంబ సభ్యులైన భార్య రజని, ఇద్దరు పిల్లలు, తండ్రి వెంకట్రాములుకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

సాయిచంద్ అకాల మరణం సామాజికోద్యమాలకు తీరని లోటు

- కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ ప్రఘాడ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సామాజిక ఉద్యమ గాయకుడు సాయిచంద్ అకాల మరణం సామాజికోద్యమాలకు తీరని లోటని కేవీపీఎస్ రాష్ట్ర కమిటి పేర్కొన్నది ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు ఒక ప్రకటనలో ఆయన మతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. సాయిచంద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సామాజికంగా వెనుకబడిన తరగతులను చైతన్యం చేయటానికి సాయిచంద్ మధురమైన గొంతు ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే గొప్ప కళాకారుడుగా ఎదిగాడని తెలిపారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభల్లో ఆయన గొంతుతో ఆలపించిన పాటలు అనేకమందికి ఉత్సాహాన్ని,ఉత్తేజాన్ని నింపాయన్నారు. కుల వివక్షకు, అంటరానితనానికి వ్యతిరేకంగా సాయిచంద్ అనేక పాటలు పాడారని చెప్పారు. భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన ఆలపించిన గీతాలు సామాజిక మాధ్యమాల్లో, పేదల హదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తెలిపారు.

పాటల శిఖరం కూలిపోయింది

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్,

'నాలుగు కోట్ల మంది ప్రజల హదయాలలోకి తెలంగాణ అస్తిత్వ పాటను తీసుకెళ్ళిన ప్రజల గొంతుక సాయిచంద్ అనే పాటల శిఖరం కూలిపోయింది. ఇది పూడ్చలేని లోటు. మూడు దశాబ్దాలుగా ప్రజల పాటను తన కంఠంలో పెట్టుకుని పాటే ప్రాణప్రదంగా జీవించిన సాయిచంద్ తెలంగాణ సాహిత్య, సాంస్కతిక లోకంలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. అతని కంఠం ఒక యుద్ధగీతికగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో మారుమోగింది' అని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరీశంకర్ సంతాపం తెలిపారు.

విప్లవ జోహార్లు.

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకష్ణ

పీడీఎస్‌యూ విద్యార్థి నాయకునిగా విద్యార్థుల సమస్యలపై, ప్రయివేట్ విద్యపై తన పాట, ఆటలతో గ్రామాల్లో ప్రజలు, హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులను చైతన్యం చేశారు. ఆయనకు విప్లవ జోహార్లు. పాలమూరు జిల్లా వెనుకబాటుకు, వివక్షతకు గురైన ప్రాంత ప్రజల కరువును కన్నీళ్లను, కష్టాలను తనపాటతో, ఆటలతో, మాటలతో బతుకు గోసను ప్రపంచానికి వినిపించిన అద్భుతమైన కళాకారుడు. 'రాతిగుండెల్లోనా కొలువైన శివుడా రక్తబంధం విలువ నీకువతెలువదురా' అని తెలంగాణ కోసం అమరులైన బిడ్డలను స్మరిస్తూ పాడిన పాటకు యావత్ రాష్ట్రమే కన్నీరు పెట్టుకుంది' అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

తెలంగాణ బిడ్డ మరణం పెను శూన్యతను మిగిల్చింది

- దక్కన్ ల్యాండ్ చీఫ్ ఎడిటర్ వేదకుమార్

'తెలంగాణ బిడ్డ సాయిచంద్ ఆకస్మిక మరణం పెను శూన్యతను మిగిల్చింది. తెలంగాణ ఉద్యమ సమయంలో సాయిచంద్ తన పాటలతో క్రియాశీలక పాత్ర పోషించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు నిరంతరాయంగా తన ఆటపాటలను కొనసాగిస్తూ తన గాత్రంతో తెలంగాణ అస్తిత్వాన్ని ప్రచారం చేశారు. తెలంగాణ సమాజం ఒక గొప్ప గాయకుడు, కళాకారుడిని కోల్పోయింది' అని దక్కన్ ల్యాండ్ చీఫ్ ఎడిటర్ మణికొండ వేదకుమార్ తన సంతాపాన్ని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


గొప్ప గాయకుడిని కోల్పోయాం

- సాయిచంద్ మృతికి కాసాని సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ ఆకాల మరణంపట్ల తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే సాయిచంద్ మరణవార్త తీవ్రంగా కలచి వేసిందన్నారు. రాజకీయంగా మంచి భవిష్యత్తు ఉన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన గొప్ప గాయకుడిని, నాయకుడిని కోల్పోయామని అన్నారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలనీ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

నాగర్ కర్నూలు జడ్పీ వైస్ చైర్మెన్ నివాళి



హైదరాబాద్ : సాయిచంద్ మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అని నాగర్ కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ ఠాగూర్ తెలిపారు. సాయి చందు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొనుగోటి రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు బస్సు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ- బీబీనగర్



ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఆటోను తప్పించబోయి ప్రమాదవ శాత్తు బోల్తా పడింది. 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి వరంగల్ వెళ్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఉదయం బీబీనగర్ ప్రాంతంలో ఎదురుగా వెళ్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది, డ్రైవర్ చాకచక్యంతో పెన్ను ప్రమాదాన్ని తప్పించారు. సుమారు 30 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అద్దాలు పగలగొట్టి ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ఎస్ఐ యుగేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం


చైనా రుణాలపై అబద్ధపు ప్రచారం

ఫలానా చోట మహా సరస్సు ఉందని కొందరు చెప్పిన చోట చూస్తే అక్కడ నీటి జాడలేని ఎడారి ఉంటుంది. చైనా గురించి కూడా అనేక ప్రచారాలు అలాగే ఉన్నాయి. అక్కడ ఉన్న సోషలిస్టు సమాజ వృద్ధి రేటు అంకెల గారడీ అని, ఎప్పుడైనా కుప్పకూలిపోతుందని అనేక మంది

నికీ ఆసియా పేర్కొన్న సమాచారం ప్రకారం ఆఫ్రికాలో మొత్తం పశ్చిమ దేశాల పెట్టుబడుల కంటే ఒక్క చైనా రెండున్నర రెట్లు ఎక్కువగా పెట్టింది. అందువలన సహజంగానే దాని పలుకుబడి కూడా అదే విధంగా ఉంటుంది. పచ్చి నిజం ఏమిటంటే ప్రపంచ బాంకు సమాచారాన్ని విశ్లేషించి ఆఫ్రికా పొందిన రుణాల్లో చైనా వాటా పన్నెండు శాతం కాగా పశ్చిమ దేశాల ప్రయివేటు రుణాలు 35శాతం ఉన్నట్లు గతేడాది ఒక నివేదిక వెల్లడించింది.

ముహూర్తాలు కూడా పెట్టారు. అలాంటిదేమీ జరగలేదు. ఇటీవలి కాలంలో పేద దేశాలను అప్పుల ఊబిలోకి లాగి వాటిని వనరులను ఆక్రమిస్తున్నదని, తన పలుకుబడిని పెంచుకుంటున్నదనే ప్రచారం నిరంతరం సాగుతూనే ఉంది. పోనీ అందుకు ఎలాంటి రుజువులనైనా చూపారా అంటే ఇంతవరకు ఒక్కటంటే ఒక్క ఉదంతాన్ని కూడా ఎవరూ చెప్పలేదు. అమెరికా విత్తమంత్రి జానెట్ ఎలెన్ చైనా రుణ ఊబి గురించి అనేక సార్లు గోబెల్స్ ప్రచారం చేశారు. చైనాను ఎదుర్కోవా లంటే అమెరికా కూడా అప్పులు ఇవ్వాలని ఆమె కొద్దిరోజుల క్రితం చెప్పారు. ఇతర దేశాలన్నీ చైనాతో విడగొట్టుకొని దానికి బుద్ధి చెప్పాలని ప్రబోధించే అమెరికా తన వరకు వచ్చే సరికి చైనాతో విడగొట్టుకొనే పరిస్థితిలో తాము లేమని ఎలెన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

అమెరికా, ఐరోపా ధనిక దేశాలు, వాటి కనుసన్నలలో కథలు అల్లే మీడియా చైనా రుణాల గురించి వాటిని తీసుకున్న దేశాల గురించి కార్చిన మొసలి కన్నీరు గురించి చెప్పనవసరం లేదు. ఆధారాల గురించి గట్టిగా నిలదీస్తే ఊబిలో దింపిందని కాదు, ఊబిని తయారు చేస్తున్నదని సన్నాయి నొక్కులు నొక్కుతారు. నిజానికి పేద దేశాలు విపరీతంగా అప్పులు తీసుకొని అవి తీర్చలేకపోతే నష్టపడేది చైనా అన్నది స్పష్టం. శతాబ్దాల తరబడి ఆఫ్రికాను ఆక్రమించి అక్కడ ఎలాంటి అభివృద్ధి జరపకుండా చీకటి ఖండంగా ఉంచి సహజ సంపదలను దోపిడీ చేసింది పశ్చిమ దేశాలే అన్నది జగమెరిగిన సత్యం. అందుకే ఒక రైలు మార్గం, ఒక రేవు నిర్మాణం, ఒక విద్యా సంస్థ ఇలా కనీస మౌలిక వసతుల కోసం ముఖం వాచిన ఆఫ్రికా దేశాలు స్వాతంత్య్రం పొందిన తరువాత పశ్చిమ దేశాలు లేదా అవి ఏర్పాటు చేసిన బ్రెట్టన్ ఉడ్ కవలలు రుణాలు ఇచ్చి ఉంటే ఈ రోజు చైనా




అడుగుపెట్టే అవకాశమే ఉండేది కాదు. జాంబియా ప్రభుత్వం మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చైనాతో అనేక ఒప్పందాలు చేసుకుంది. ఇటీవలి కాలంలో అక్కడ జరిగిన పరిణామాల పూర్వరంగంలో వాటిలో అనేక ప్రాజెక్టులను రద్దు చేసుకుంది. కొన్నింటిని చైనా వారే రద్దు చేశారు. ఇటీవల ఐఎంఎఫ్ నుంచి 130 కోట్ల డాలర్ల రుణం తీసుకుంది. రోడ్లు, వంతెనల వంటి మౌలిక సదుపాయాల నుంచి తగినంత రాబడి రావటం లేదు కనుక మిగిలిన ప్రాజెక్టులను రద్దు చేసుకున్నట్లు ఐఎంఎఫ్ నిపుణులు చెప్పారు. దీనికి ఎలాంటి రుజువులను వారు చూపలేదు.

అమెరికా, ఐరోపా దేశాలు కబుర్లు తప్ప ఇప్పటికీ 'ఆ ఒక్కటి అడక్కు' అన్నట్లుగా ఉన్నాయి. ఆఫ్రికాలో ప్రస్తుతం చైనాతో పోటీ పడే స్థితిలో అమెరికా, మరొక దేశమూ లేదు.2021లో ఆఫ్రికాతో చైనా వాణిజ్య లావాదేవీల విలువ 254బిలియన్ డాలర్లు కాగా, 2022 అమెరికా జరిపిన లావాదేవీలు 40బి.డాలర్లు మాత్రమే. నికీ ఆసియా పేర్కొన్న సమాచారం ప్రకారం ఆఫ్రికాలో మొత్తం పశ్చిమ దేశాల పెట్టుబడుల కంటే ఒక్క చైనా రెండున్నర రెట్లు ఎక్కువగా పెట్టింది. అందువలన సహజంగానే దాని పలుకుబడి కూడా అదే విధంగా ఉంటుంది. పచ్చి నిజం ఏమిటంటే ప్రపంచ బాంకు సమాచారాన్ని విశ్లేషించి ఆఫ్రికా పొందిన రుణాల్లో చైనా వాటా పన్నెండు శాతం కాగా పశ్చిమ దేశాల ప్రయివేటు రుణాలు 35శాతం ఉన్నట్లు గతేడాది ఒక నివేదిక వెల్లడించింది. ప్రపంచబాంకు, ఐఎంఎఫ్ ఇచ్చే రుణాల మీద 1.3, చైనా ఇచ్చే వాటి మీద 2.7శాతం వడ్డీ విధిస్తుండగా పశ్చిమ దేశాల సంస్థలు ఐదుశాతం వసూలు చేస్తాయి. ఇరవై నాలుగు దేశా వివరాలను చూస్తే వాటి రాబడిలో రుణం-వడ్డీలకు 15శాతం ఖర్చు చేస్తున్నట్లు, చైనాకు 11, పశ్చిమ దేశాల సంస్థలకు 32శాతం చెల్లిస్తున్నట్లు తేలింది. వాస్తవాలు ఇలా ఉన్నా ఆఫ్రికాను చైనా రుణ ఊబిలోకి దించుతుందని ఎవరైనా ఎలా చెప్పగలరు? చైనా కరోనా సమయంలో జి20 కూటమి నిర్ణయం మేరకు రుణాల చెల్లింపును వాయిదా వేసింది తప్ప పశ్చిమ దేశాల ప్రయివేటు సంస్థలు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదు. మరోవైపు ఐఎంఎఫ్ 2021లో ఇచ్చిన రుణాలకు గాను ఆహారం, ఇంధనం వంటి వాటి మీద ఇస్తున్న రాయితీల కోత లేదా కొత్తగా పన్నుల విధింపు వంటి షరతులను రుద్దింది. రుణాలను తగ్గించుకొనేందుకు అదే ఏడాది పశ్చిమ ఆఫ్రికా దేశాలు 2,680కోట్ల డాలర్ల మేర బడ్జెట్లు తగ్గించుకోవాలని అదేశించింది. చైనా ఇలాంటి షరతులను రుద్దటం లేదు. ఎవరు ఆఫ్రికాకు హాని చేస్తున్నట్లు, ఎవరు మేలు చేస్తున్నట్లు?

మనకు తెలిసిన బుద్ధుడు-తెలియని బౌద్ధం!

ప్రపంచానికి భౌతికవాదం, బౌద్ధం, హేతువాదం గురించి చెప్పిన మన భారతదేశం ఎప్పుడో విశ్వగురువు అయ్యింది. వాటిని నాశనం చేసి మనుషుల్ని విభజించి, తమ కల్పిత గాథలు, అబద్ధాలు ప్రచారం చేసుకున్న వైదిక ధర్మ మనువాదులు - ఇప్పుడు తాము విశ్వగురువులమై పోయామని చెప్పుకుంటూ అపహాస్యానికి గురవుతున్నారు. బుద్ధుడు చెప్పిన 'వేదన' అనే పదం నుండే మనువాదులు 'వేదాలు' అనే పదం సృష్టించుకున్నారు. ప్రపంచంలో మతాలు పుట్టకముందే, ఈ దేశంలో బౌద్ధం విలసిల్లింది. అందువల్ల పురాతన లేదా సనాతన ధర్మం అంటే ఏదవుతుందీ? బౌద్ధమే అవుతుంది! ప్రపంచంలో అత్యధికంగా తయారవుతున్నవీ, అనేక రకాలుగా దేశ విదేశాలకు వ్యాప్తిస్తున్నవీ బుద్ధ విగ్రహాలే. ఈ రోజుల్లో ప్రతి ఇంట్లో బుద్ధుడి విగ్రహాలు పెట్టుకుంటున్నారు. అది మంచి పరిణామం. అయితే, ఆయన బోధనల్లోంచి కొన్నయినా స్వీకరించి ఆచరిస్తూ ఉంటే సమాజాన్ని కొంత బాగు చేసినవార మవుతాం. ఇక, మన దేశ నాయకుల్ని చూస్తే నవ్వొస్తుంది. విదేశాల నుండి ఏదేశ నాయకుడు వచ్చినా, ఓ బుద్ధ విగ్రహం బహుమతిగా ఇచ్చి సాగనంపుతుంటారు. ఆ పద్ధతి బావుంది కానీ, బుద్ధుడు ఏం చెప్పాడో తెలుసుకునే ప్రయత్నం మాత్రం చేయరు. పైగా దేశం 'విశ్వగురువు' అయిపోవాలని కలలు కంటుంటారు.



డాక్టర్ దేవరాజు మహారాజు

బౌద్ధం భారతదేశాన్ని ఎన్నో విధాలుగా సంస్కరించింది. వైదిక మతస్థులు యాగాలు, బలులు వంటి హింసాత్మక కార్యాలు చేస్తున్నప్పుడు బౌద్ధం తీవ్రంగా వ్యతిరేకించింది. ఫలితంగా 'అహింస' ఈ దేశంలో తొలిసారి ప్రవేశించింది.

సాధారణ శకానికి ముందు భారతదేశంలో అత్యధికులు మాట్లాడేభాష పాలి. బౌద్ధ ప్రచారమంతా ఆ భాషలోనే సాగింది. స్వయంగా బుద్ధుడే తన బోధనలన్నీ నాటి ప్రజల భాషలో కొనసాగించాడు. అయితే సాధారణ శకం రెండవ శతాబ్దం కనిష్కుని పాలనాకాలంలో కొన్ని మార్పులు జరిగాయి. ఆయన కాలంలో జరిగిన నాలుగవ బుద్ధ మండలిలో మెల్లగా సంస్కృతం ప్రవేశించింది. వైదిక మత ప్రచారకుల ప్రభావం వల్ల, సంస్కృతం ఆనాటి పండితుల మధ్య బాగా వ్యాపించి ఉంది. అందువల్ల, ఆ భాషను మొత్తానికి మొత్తంగా పక్కన పెట్టలేక పోయారు.

జీవహింస గురించి ఆలోచింపజేసింది, దాన్ని ప్రతిష్టాత్మకమైన విలువగా మార్చింది. జీవ కారుణ్యం గురించి చెప్పిందీ బౌద్ధమే! వైదిక ధర్మం కాదు. దేశంలో మూఢనమ్మకాల్ని చాలా వరకు తొలగించగలిగిందీ బౌద్ధమే! పాలి భాష, ఇంకా ఇతర స్థానిక భాషలు బౌద్ధ ప్రచారం వల్ల అభివృద్ధి చెందాయి. వ్యాప్తి కూడా చెందాయి. సంస్కృతం ఎప్పుడూ జనభాషగా లేదు. ఇవన్నీ కాకుండా బౌద్ధుల శిల్పకళ, వైజ్ఞానిక విషయాలు, బౌద్ధ విశ్వవిద్యాలయాలు దేశాన్ని ప్రగతి పథాన నడిపించాయి. సాంచి, బర్హుత్ వంటి చోట్ల అవశేషాలుగా పడి ఉన్న శిల్పాలన్నీ బౌద్ధులు చెక్కినవే. వేల వేల స్థూపాలు దేశ వ్యాప్తంగా అద్భుత శిల్పకళతో విరాజిల్లుతున్నాయంటే అందుకు కారకులు ఆనాటి బౌద్ధ శిల్పులే కదా? వాటి రూపురేఖలు మార్చి, విగ్రహాలు మార్చి, బౌద్ధారామాలు మార్చి హిందూ దేవీ దేవతలుగా దేవాలయాలుగా మార్చుకున్నది - వైదిక ధర్మ ప్రభోధకులన్నది చరిత్ర రుజువు చేసిన సత్యం. నాటి నలంద, విక్రమశిల విశ్వవిద్యాలయాలు ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థులను ఆకర్షించాయి. జ్ఞాన దీపాలు వెలిగించాయి. ఆ రోజుల్లోనే అవి రెసిడెన్షియల్ యూనివర్సిటీలు. అందువల్ల దేశంలో తొలి విద్యా సంస్థలు ఏవీ అంటే... అవి బౌద్ధులవే! అంతే కాదు, తొలినాటి భారతీయ వైజ్ఞానికులంతా బౌద్ధులే. ఆర్యభట్టు లాంటి వైజ్ఞానికుల చిత్రాలకు నామాలు పెట్టి, వారంతా బ్రాహ్మణ వాదులయినట్లు ప్రచారం చేసుకోవడం... తర్వాత కాలాలలో జరిగింది. ఆ రకంగా భారతదేశం ప్రగతిపథంలోకి రావడానికి బౌద్ధం పాత్ర ఎంతో ఉంది. ఈ దిశగా విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉంది.

బుద్ధుని మరణం తర్వాత, బౌద్ధ భిక్కులు, సన్యాసులు, బౌద్ధం పట్ల ఆసక్తి గల వారు అంతా కలిసి నాలుగు సార్లు సమావేశమయ్యారు. అంటే నాలుగు మహాసభలు జరిపారు. మహాసభను వారు 'మండలి' అని వ్యవహరించేవారు. అక్కడ వారు తీసుకున్న నిర్ణయాలు బౌద్ధం మీద చాలా ప్రభావం చూపాయి.

ఒకటవ బౌద్ధ మండలి: సాధారణ శకానికి పూర్వం 483 (బిసిఈ)లో రాజగృహలోని సప్తపర్ణి గుహలో మహాకశ్యప అధ్యక్షతన జరిగింది. ఈ మండలిలో బుద్ధుని బోధనల్ని రెండు పిటకాలుగా విభజించారు. 1. వినయ పిటక - దీన్ని ఉపాలి చదివి వినిపిస్తే 2. సుత్త పిటకను ఆనందుడు పఠించాడు. వీరిద్దరూ బుద్ధుడిప్రియ శిష్యులు. వినయ పిటకలో సన్యాసుల, సన్యాసినుల జీవితానికి సంబంధించిన ప్రవర్తనా నియమావళి-క్రమశిక్షణ గురించి ఉంది. ఇక బుద్ధుని ప్రధాన బోధన (ధమ్మం) సుత్తపిటకలో ఉంది. ఇది 5నికాయలుగా విభజింపబడింది. 1. దిఘనికాయ 2. మజ్ఝిమ నికాయ 3. సంయుత్త నికాయ 4. అంగుత్తర నికాయ 5.ఖుద్దక నికాయ. ఈ తొలి బౌద్ధ మండలి జరిగినప్పుడు అక్కడ రాజు - హర్యాంక వంశపువాడైన ఆజాత శత్రు.

రెండో బౌద్ధమండలి: మొదటి బౌద్ధమండలి జరిగిన తర్వాత వంద సంవత్సరాలకు రెండో బౌద్ధమండలి జరిగింది. ఇది వైశాలిలోని చుల్లవంగలో సాధారణ శకానికి ముందు 383(బిసిఈ)లో సబకామి అధ్యక్షతన జరిగింది. అప్పుడే బౌద్ధ అనుచరులు 1. స్థవిరవాద 2. మహా సాంఘికులుగా విభజింపబడ్డారు. ఆ కాలానికి రాజ్యమేలుతున్నది శిశునాగ వంశానికి చెందిన కాలశోకుడు. మూడో బౌద్ధ మండలి: రెండవ బౌద్ధ మండలి తర్వాత 133 ఏళ్ళకు అంటే సాధారణశకానికి ముందు 250(బిసిఈ)లో జరిగింది. పాటలీపుత్రలోని అశోకరామ విహార్లో - అశోక చక్రవర్తి రాజ్యమేలుతున్న కాలంలో జరిగింది. మొదటి బౌద్ధ మండలి తర్వాత 233ఏళ్ళకు ఈ మూడవ బౌద్ధమండలి జరిగింది. అంటే వినయపిటక, సుత్త పిటకల తర్వాత మూడవదైన అభిదమ్మ పిటక వెలుగు చూడడానికి అన్నేళ్ళు పట్టింది. ఇందులో తాత్విక విశ్లేషణ, పండిత కార్యకలాపాలు, సన్యాసుల బోధన మొదలైన అంశాలున్నాయి. వీటిని అశోకుడి కాలంలోనే సంకలనం చేశారు.

నాలుగవ బౌద్ధమండలి: మూడవ మండలి తర్వాత, నాలుగవది జరగడానికి 322 సంవత్సరాలు పట్టింది. ఇది సాధారణ శకం 72(సి.ఈ)లో కాశ్మీర్‌లోని కుండలవాన్‌లో వసుమిత్ర అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడు. ఆ సమయంలో కుషాణ వంశానికి చెందిన కనిష్కుడు రాజు. ఈ నాలుగు బౌద్ధ మండలులు జరగడానికి సుమారు 555ఏళ్ళు పట్టింది. బౌద్ధానికి సంబంధించి మూడుపిటకలతో పాటు ముఖ్యమైనవి మరికొన్ని ఉన్నాయి. అవి దివ్యవదన, దీపవంశ, మహావంశ, మిలింద్‌పన్హా మొదలయినవి.

సాధారణ శకానికి ముందు భారతదేశంలో అత్యధికులు మాట్లాడేభాష పాలి. బౌద్ధ ప్రచారమంతా ఆ భాషలోనే సాగింది. స్వయంగా బుద్ధుడే తన బోధనలన్నీ నాటి ప్రజల భాషలో కొనసాగించాడు. అయితే సాధారణ శకం రెండవ శతాబ్దం కనిష్కుని పాలనాకాలంలో కొన్ని మార్పులు జరిగాయి. ఆయన కాలంలో జరిగిన నాలుగవ బుద్ధ మండలిలో మెల్లగా సంస్కృతం ప్రవేశించింది. వైదిక మత ప్రచారకుల ప్రభావం వల్ల, సంస్కృతం ఆనాటి పండితుల మధ్య బాగా వ్యాపించి ఉంది. అందువల్ల, ఆ భాషను మొత్తానికి మొత్తంగా పక్కన పెట్టలేక పోయారు. క్రమంగా సంస్కృతం దాని ప్రభావాన్ని చూపుతూ, బౌద్ధంలోని మహాయాన శాఖలో తిష్టవేసింది. ఫలితంగానే బుద్ధ ప్రతిమను పూజించడం, ఇతర చిత్రపటాలకు పూజలు చేయడం ప్రారంభమైంది. బౌద్ధం హిందూ మతం వైపు మొగ్గు చూపుతోందని సామాన్య ప్రజలు కూడా



విశ్వసించసాగారు. బ్రాహ్మణుల ఆరాధన, సంక్లిష్టమైన ఆచారాలు బౌద్ధంలో ప్రవేశించాయి. అసలైతే, పూజల్ని ఆరాధనల్ని, భజనల్ని బౌద్ధులు తీవ్రంగా వ్యతిరేకించాలి. కానీ, ఆ పని జరగక పోవడం వల్ల - బౌద్ధంలోని ఒక శాఖ బ్రాహ్మణవాద ప్రభావానికి గురైంది. ఫలితంగానే, దశవతారాలలో బుద్ధుణ్ణి చేర్చుకోవడం, బుద్ధుడి జీవిత కథను అభూత కల్పనలతో తిరగరాయడం జరిగి ఉంటుంది. ఏమైనా బౌద్ధపతనానికి గల కారణాలల్లో సంస్కృతం కూడా ఒకటి - అని చెప్పాలి! కాలక్రమంలో బౌద్ధంలో అనేక శాఖలు ఏర్పడ్డాయి. అవి ఈ విధంగా ఉన్నాయి...

1. హీనయానం: అంటే తక్కువ వాహనం. ఈ శాఖ కేవలం బుద్ధుని బోధనల్ని మాత్రమే నమ్ముతుంది. ఇతర ప్రభావాలకు లోనుకాదు. విగ్రహారాధనను నమ్మదు. స్వీయ క్రమశిక్షణతో, ధ్యానంతో వ్యక్తిగత 'నిర్వాణ'ను సాధించవచ్చని చెపుతుంది. హీనయానంలోని మరో శాఖ తేరవాడ. ఇది బుద్ధుని బోధనలకు మరీ దగ్గరగా ఉంటుంది. ప్రస్తుతం ఎక్కువగా ఉన్నది తేరవాడనే. శ్రీలంక, కంబోడియా, లావోస్, మయన్మార్, థాయ్‌లాండ్‌లలో ఇది ఎక్కువగా ఉంది. బౌద్ధంలో అత్యంత పురాతన శాఖ.

ఆధునిక భారతదేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆరులక్షల మందితో బౌద్ధం స్వీకరించారు. ఈ దేశానికి ఒక దిశా నిర్దేశం చేశారు. ఆయన 132వ జన్మదినం సందర్భంగా 14 ఏప్రిల్ 2023 నాడు గుజరాత్‌లో యాభైవేల మంది బౌద్ధం స్వీకరించారు. స్వయం సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి) కృషి వల్ల ఒకకోటి మంది బౌద్ధం స్వీకరించే అవకాశం ఉంది. దీన్ని అంబేద్కర్ 'నవయానం' అన్నారు. ఇందులో ముఖ్యమైన సూత్రాలు ఏవంటే... 1. మనుషులందరిదీ ఒకే స్థాయి. 2. నైతికతే మనిషి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది.

2. మహాయానం: ఈ పదం సంస్కృతం నుండి ఉద్భవించింది. మహాఅంటే గొప్ప. యానం అంటే వాహనం / ప్రయాణం. ఈ శాఖ బుద్ధుని విగ్రహారాధనను నమ్ముతుంది. స్వర్గాన్ని కూడా నమ్ముతుంది. వైదిక మత ప్రభావం వల్ల అందులోని ఎన్నో అంశాలు ఈ శాఖ స్వీకరించింది. మహాయానం ఉత్తర భారతదేశంలోని కశ్మీర్‌లో ఉద్భవించింది. మధ్య, తూర్పు, ఆగ్నేయాసియా ప్రాంతాలలో ఇది బాగా వ్యాపించింది.

3. వజ్రయానం: దీన్ని తాంత్రిక బౌద్ధం అంటారు. THE VEHICLE OF THUNDER BOLT. భారతదేశంలోనే సాధారణ శకం 900(సి.ఈ)లో ఇది అభివృద్ధి చెందింది. ఇందులో రహస్య అంశాలు, క్లిష్టమైన ఆచారాలు ఉంటాయి. కాలానుగుణంగా వైదిక మత ప్రభావం, సంస్కృత భాషా ప్రభావం వల్ల అనేక మార్పులకు గురైంది. పన్నెండవ శతాబ్దం ఆరంభంలో బౌద్ధసంఘాలలో అవినీతి చొరబడింది. విలువైన బహుమతులు స్వీకరించడం, సుఖలాలసకు అలవాటు పడటం జరిగింది. బుద్ధుడి బోధనలు మరిచిపోయిన సన్యాసులు అధోకరణానికి, ప్రభోదాలకూ అలవాటు పడ్డారు. హీనయాన, మహాయాన, వజ్రయాన శాఖలు మాత్రమే కాకుండా తంత్రయాన, సహజయాన వంటిశాఖలు కూడా ఏర్పడ్డాయి. ఆనందాలవైపు ఆకర్షించబడి, నైతికతను వదిలేసి, బౌద్ధంలోని కొన్ని శాఖలు వాస్తవికతకు దూరంగా వెళ్ళిపోయాయి. ఇలాంటి ఎన్నో కారణాలు బౌద్ధం పతనం కావడానికి కారణాలయ్యాయి.

4. నవయానం: ఆధునిక భారతదేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆరులక్షల మందితో బౌద్ధం స్వీకరించారు. ఈ దేశానికి ఒక దిశా నిర్దేశం చేశారు. ఆయన 132వ జన్మదినం సందర్భంగా 14 ఏప్రిల్ 2023 నాడు గుజరాత్‌లో యాభైవేల మంది బౌద్ధం స్వీకరించారు. స్వయం సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి) కృషి వల్ల ఒకకోటి మంది బౌద్ధం స్వీకరించే అవకాశం ఉంది. దీన్ని అంబేద్కర్ 'నవయానం' అన్నారు. ఇందులో ముఖ్యమైన సూత్రాలు ఏవంటే... 1. మనుషులందరిదీ ఒకే స్థాయి. 2. నైతికతే మనిషి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. ఇలాంటి విషయాల వల్ల వారి వారి మతాల, కులాల అడ్డుగోడల్ని కూల్చుకుని జనం బౌద్ధం స్వీకరించడానికి ముందుకొస్తున్నారు. వీరిలో ముస్లింలు కూడా ఉన్నారు. మత విద్వేషాలు రేపి, జనాన్ని విడగొట్టి, అధికారంలో కొనసాగుదామనుకునే వారికి - దేశంలో క్రమంగా వస్తున్న ఈ మార్పు, గట్టిగా బుద్ధి చెపుతుంది - సందేహం లేదు.

(బుద్ధుడు తొలి ఉపదేశం ఇచ్చిన రోజే గురుపూర్ణిమ. అదే ఆషాడ పూర్ణిమ-3 జులై)

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



'కృత్రిమ మేధస్సు'- యువతపై ప్రభావం!

చాలా కాలం నుండి కృత్రిమ మేధస్సు గురించి చర్చ జరుగుతున్నప్పటికీ ఇటీవల కాలంలో దీని గురించి ఎక్కువగా వింటున్నాం. అనేక సంస్థలు తమ కృత్రిమ మేధస్సు గురించి మాట్లాడటం, అలాగే చాట్ జిపిటి వంటివి అందుబాటులోకి రావటం ఈ చర్చ వేడిని పెంచింది. గత వారం మైక్రోసాఫ్ట్ కూడా ఓపెన్ పైలెట్ అని తన కృత్రిమ మేధ గురించి ప్రపంచానికి చెప్పింది. అలాగే గూగుల్, మెటా వంటి అనేక దిగ్గజాలు కూడా కృత్రిమ మేధస్సు అభివృద్ధిపరచటంలో చాలా కాలం నుంచి పని చేస్తున్నాయి. తొందరలో అవి కూడా తమ వాటిని మార్కెట్‌లోకి విడుదల చేయవచ్చు. కృత్రిమ మేధస్సు (ఏ.ఐ) వేగవంతమైన అభివృద్ధి ఉపాధి మార్కెట్‌పై, ముఖ్యంగా యువతరంపై దాని ప్రభావం గురించి ఆందోళనలను పెరుగుతున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఇటీవల జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 2025 నాటికి అన్ని పనులలో సగానికిపైగా యంత్రాల ద్వారా నిర్వహించబడతాయని, చాలా మంది కార్మికులకు ఉద్యోగాలు లేకుండా పోతాయని అంచనా వేసింది. నేటి పోటీ ఉద్యోగ విపణిలో ఇప్పటికే పని దొరక్క ఇబ్బందులు పడుతున్న యువతకు ఇది ఆందోళన కలిగించే అంశం. రిటైల్, హాస్పిటాలిటీ, తయారీ రంగాలలో జాబ్ మార్కెట్‌పై కృత్రిమ మేధస్సు ప్రభావం అధికంగా ఉండవచ్చు. తక్కువ నైపుణ్యం ఉన్న స్థానాల్లోని కార్మికులు ఈ మార్పు వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఏ.ఐ పెరుగుదల కొత్త ఉద్యోగ అవకాశాలను సష్టించగలదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయినప్పటికీ, భవిష్యత్తులో ఉద్యోగాలకు ప్రస్తుతం చాలా మంది యువకులకు లేని సాంకేతిక నైపుణ్యం అవసరం అవ్వవచ్చు. అందుచేత, ఏ.ఐ ప్రయోజనాలు అధిక నైపుణ్యం కలిగిన కొద్దిమంది కార్మికుల సమూహంలో కేంద్రీకృతమై... మెజారిటీ కార్మికులు ఉపాధి కోల్పోవటానికి అవకాశం ఉంది.

కృత్రిమ మేధస్సు వలన ఇప్పుడున్న చాలామంది కార్మికుల జీతాలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది (ఉత్పత్తి ఖర్చు కూడా తగ్గుతుంది). ఎందుకంటే ఒక పని చేయటానికి కార్మికుడికి కావలసిన నైపుణ్యం యంత్రానికి మరింత బదలాయించబడుతుంది గనుక. ఒక కార్మికుడికి ఇప్పుడు కావాల్సింది కృత్రిమ మేధను ఎలా ఉపయోగించాలనేది తెలియటమే. ఉదాహరణకు ఒక సాఫ్ట్‌వేర్ నిపుణుడు ఇప్పుడు తన పనిలో భాగంగా కోడ్ రాస్తాడు. కృత్రిమ మేధ వచ్చిన తరువాత ఈ బాధ్యత చాలా వరకు యంత్రానికి బదలాయించబడుతుంది. కార్మికుడు చేయవలసిందల్లా ఏ.ఐ ఇచ్చిన కోడ్‌ను కొంత పరిశీలించటం, వాడుకొనటం. ఇలా అన్ని రంగాలలో కార్మికుల విధులు ఇదే విధంగా యంత్రానికి మరింత బదలాయించబడతాయి. ఈ ప్రక్రియ ప్రతి పారిశ్రామిక విప్లవం జరిగినప్పుడు జరిగేదే కానీ ఈ కృత్రిమ మేధస్సు ప్రయోజనాలు అంతిమంగా మెజారిటీ ప్రజలయిన కార్మికులకు బదలాయించపడ తాయా లేదా గుప్పెడు కార్పొరేట్లకా అనేదే ప్రశ్న. ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు తగ్గి, ప్రయివేటు యాజమాన్యం ప్రతి రంగంలో బలీయమయిన శక్తిగా మారిన ఈ రోజుల్లో ఏ.ఐ పెరుగుదల పని పరిస్థితులపై కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. యంత్రాలు ఎక్కువగా ప్రబలంగా మారడంతో, కార్మికుల భద్రత, శ్రేయస్సు కంటే కంపెనీలు వారి ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఈ సవాళ్లకు ప్రతిస్పందనగా, అనేక సంస్థలు, ప్రభుత్వం భవిష్యత్తులో ఉద్యోగాల కోసం కార్మికులను సిద్ధం చేయడానికి విద్య, శిక్షణ కార్యక్రమాలలో ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంది. యంత్రాల ఆధిపత్యం ఉన్న ప్రపంచంలో యువత అభివృద్ధి చెందడానికి అవసరమైన నైపుణ్యాలను సమకూర్చడం ద్వారా, ఏ.ఐ ప్రయోజనాలు సమాజం అంతటా సమానంగా పంపిణీ చేయబడాలంటే ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉంది.

అలాగే ప్రయివేటురంగ పరిశ్రమలపై ప్రభుత్వం గణనీయమైన పట్టు కలిగి ఉండాలి. అప్పుడు మాత్రమే సాంకేతికత వల్ల చేకూరే ప్రయోజనాలు సమానంగా పంపిణీ చేయబడతాయి. లేనిపక్షంలో ఇప్పుడున్న అసమానతలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. యంత్రాల పెరుగుదల అనేక ప్రయోజనాలను తెచ్చిపెట్టినప్పటికీ కార్మికులపై, ముఖ్యంగా యువకులపై ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవడం, వారు వెనుకబడిపోకుండా చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. విద్య, శిక్షణ కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడం ద్వారా, భవిష్యత్ సవాళ్ళ, అవకాశాల కోసం తరువాతి తరాన్ని సిద్ధం చేయవచ్చు. అంతిమంగా పారిశ్రామిక, సాంకేతిక విప్లవాలు మానవులను ఒక సంతోష కరమైన సమసమాజం వైపు నడిపించాలి. అంతేకానీ మరింత అసమానతలు, దోపిడీ పెంచకూడదు. చరిత్ర చూసుకున్నట్లైతే ఇప్పుడున్న వ్యవస్థ సాంకేతిక విప్లవ ప్రయోజనాలను సాధారణ ప్రజలకంటే కొంతమంది పరిశ్రమాధి పతులకు, పాలకులకు మాత్రమే ఎక్కువగా బదలాయించింది. తదనుగుణంగా సమాజంలో అసమానతలు, పేదరికం, దుఃఖం తీవ్రమైంది. ఈ కృత్రిమ మేధస్సు అయినా మెజారిటీ ప్రజల ప్రయోజనాల వైపు బదలాయించ బడాలంటే ఇప్పుడున్న అసమాన న్యాయంతో కూడిన వ్యవస్థ స్థానంలో మరింత మెరుగైన సామ్యవాద వ్యవస్థ స్థాపన దిశగా ప్రయాణం సాగించాలి.

- ఆంజనేయరాజు

దేశానికి దారిదీపం... ప్రతిపక్షాల ఐక్యమత్యం

"ప్రకృతి, సమాజం వెనక్కు వెళ్లవు, సదా ముందుకే పరిణమిస్తుంటాయ్!" రుజువైన పరిణామ సిద్ధాంత మిది. అమీబా నుండి ఆధునిక మానవుని దాకా ప్రకృతి, ఆదిమ సమాజం నుండి, ఆధునిక ప్రజాస్వామ్యం! దాకా సమాజం పరిణమించినయ్, ఇంకా ముందుకు పరిణమిస్తూనే ఉంటాయ్! ఎంతటి మేధావి, బలవంతుడు, నిరంకుశుడైనా, ప్రచార సాధనాలను తనలో బంధించుకున్నా సరే, సమాజాన్ని వెనక్కునెట్టలేడని, హిట్లర్ ద్వారా గ్రహించింది ప్రపంచం! రేపు మోడీ ద్వారా గ్రహించబోతున్నది భారత దేశం! పాట్నాలో రూపొందిన ప్రతిపక్షాల ఐక్యవేదిక అందుకొక సంకేతం! గత తొమ్మిదేండ్లుగా దేశాన్ని కమ్ముకున్న కారుమబ్బుల్లో, వెలిసిన ఆశల హరివిల్లుగా, ప్రతిపక్షాల ఐక్య వేదికను భావిస్తున్నారు ప్రజలు! అయితే "ప్రతిపక్షాల ఐక్యత అసాధ్యం! మళ్ళీ 300సీట్లతో మోడీ ప్రధాని కావటం తథ్యం!!" అని సవాలు విసిరారు అమిత్‌షా. ఓవైపు మణిపూర్ మండుతున్నా, మరోవైపు రెజ్లర్లు ఆక్రోశిస్తున్నా నోరు విప్పరు నరేంద్రమోడీ! అదీ వాళ్ళ ధీమా! ఎందుకంటే? ప్రజల ప్రగతి కోసం పరిశ్రమించి వాళ్ళ అభిమానాన్ని, విశ్వాసాన్ని పొందటం కన్నా, వాళ్ళ మెజారిటీ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఎన్నికల ఎత్తుగడలనే నమ్ముకున్నది బీజేపీ! అవే రెండుసార్లు వాళ్ళకధికారాన్ని కట్టబెట్టినయ్! అందుకే ఆ ఎత్తుగడలనే మరింత పటిష్టంగా అమలు చేసే దిశగా పయనిస్తున్నది బీజేపీ! అందులో కొన్నింటిని పరిశీలించాల్సిన అవసరం ఉన్నది.



పాతూరి వెంకటేశ్వరరావు
9849081889

ఆశాజనక వాగ్దానాలతో, దేశభక్తి, దేశరక్షణ, సుస్థిర ప్రభుత్వ నినాదాలతో ప్రజలను సమ్మోహితులను చేయటం. నిరంతరం మత, జాతీయ భావోద్వేగాలకు ఆజ్యం పోస్తుండటం!, తరచూ పాకిస్థాన్-చైనాలను బూచీలుగా చూపించటం! మీడియా, సోషల్ మీడియాల ద్వారా మోడీ ఇమేజ్‌ని పెంచే దృశ్యాల, ప్రసంగాల మన్‌కీ బాత్‌ల వర్షాన్ని కురిపించటం! ఆయా రాష్ట్రాలలో హిందూ- ముస్లిం విద్వేషాలను సృష్టిస్తూ, మెజారిటీ ఓటర్లను తమ వైపు పోలరైజ్ చేసుకోవటం! దేశ సంపదను ఆశ్రిత కార్పొరేట్లకు కట్టబెట్టి, బాండ్ల రూపంతో వాళ్ళిచ్చే నిధులతో ఓటర్లను, బీజేపీయేతర ప్రజా ప్రతినిధులను ఆకర్షించటం! ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చటం! షిండేలను సృష్టించి, ఆయా పార్టీలను చీల్చి చెండాడటం! ఇవి బీజేపీ-ఆరెస్సెస్ వ్యూహాల్లో ప్రధానం. సమర్థవంతమైన బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్ల ద్వారా ఆటంకాలు సృష్టించటం! బీజేపీకి సానుకూల తీర్పులిచ్చిన విశ్రాంత న్యాయమూర్తులకు పదవులు కట్టబెట్టటం ద్వారా, న్యాయ వ్యవస్థను కూడా ప్రభావితం చేయటం! తమను నిలదీసిన వారిని 'ఉపా' చట్టంతో నిర్బంధించటం. ఇలాంటి విధానాలు అనుసరిస్తూ, ఎత్తుగడల ద్వారా దశాబ్ద కాలంగా బీజేపీ అప్రతిహతంగా కొనసాగటం అందరికీ తెలిసిందే! ఇవన్నీ కూడా ప్రతిపక్షాలకు ప్రతికూలమైన అంశాలు. ఎందుకంటే ఇవి చేయడం బీజేపీకి వెన్నెతో పెట్టిన విద్య. అయితే ప్రతిపక్షాల సమైక్య పోరాటం విజయవంతం కావాలంటే, బీజేపీ బలాలు, బలహీనతల గూర్చి స్పష్టమైన అవగాహన అవసరం. ప్రజలకు బీజేపీ ఎత్తుగడలను గుర్తుచేయటం ఆ పార్టీవల్ల దేశానికి ఉన ముప్పును వివరించడం నేడు అనివార్యం. వామపక్షాలు మినహా బీజేపీని నిలదీయగలిగిన రాజకీయ నైతికత్వం పార్టీల్లో లోపించకుండా చూడటం, ఎప్పటికప్పుడు రాజకీయ పరిణామాలను గమనిస్తూ బీజేపీ-ఆరెస్సెస్ విధానాలను గట్టిగా వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ విధానాలతో సలహాలు, సూచనలు చేయగలగాలి.

బీజేపీకి ప్రత్యామ్నాయం ఉందన్న భరోసాను ప్రజలకు కలిగించగలిగిన ప్రతిపక్షాల ఐక్యవేదిక



లేకపోవటం వలన దేశం ఇప్పటికే చాలా మూల్యం చెల్లించుకున్నది! ఈ నిరాశా నిస్పృహల కారుమబ్బులు కమ్ముకున్న భారతంలో, ఆశల హరివిల్లులా ప్రతిపక్షాల ఐక్యవేదిక 'పాట్నా'లో ప్రత్యక్షమైంది! దీన్ని దేశానికి శుభసూచకంగా భావిస్తున్నారు ప్రజలు! ఎందుకంటే? ఐదు దశాబ్దాల క్రితం అలముకొన్న ఎమర్జెన్సీ చీకట్లలో జయప్రకాష్ నారాయణ నాయకత్వాన అదే 'పాట్నా'లో రూపొందిన ప్రతి పక్షాల ఐక్య సంఘటన ఉప్పెనలా విజృంభించి, ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ఊడ్చేసింది. ఇప్పుడది మోడీ ప్రభుత్వాన్ని మార్చుతుందనే నమ్మకం ప్రజలకు కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం. ఇన్నాళ్ళకు తిరిగి 'పాట్నా' లోనే వెలిసిన ప్రతిపక్షాల ఐక్యవేదిక, నేటి అప్రకటిత ఎమర్జెన్సీ గాఢాంధకారం నుండి దేశానికి విముక్తి కలిగించగలదన్న ఆశను చిగురింపజేసింది! 'పాట్నా'లో సమావేశమైన ప్రతిపక్ష నేతల ఒక్కోమాట ప్రతి భారతీయుని హృదయంలో ఒక్కో ఆశాదీపాన్ని వెలిగించిందనే చెప్పాలి. 'రాహుల్ గాంధీ': 'భారతీయుల సమైక్యత! భారతీయుల విభజన!' అనే రెండు విధానాల మధ్య జరుగుతున్న పోరాటంగా రాహుల్ చెప్పారు బీజేపీ విభజన వ్యతిరేక పోరాటానికి ప్రతిపక్షాలన్నీ చేతులు కలపడం వల్ల రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించబోతున్నామని సంకేతాలిచ్చారు. రాజ్యాంగ మూల స్తంభాలపై జరుగుతున్న దాడిని ప్రతిఘటించి, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడు కోవటమే లక్ష్యంగా ఉండాలని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యదర్శి డి రాజా బీజేపీది తొమ్మిదేండ్ల తిరోగమన పాలనగా వర్ణించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన పార్టీల నాయకత్వాన విపక్షాల ఐక్య కూటమి ఈ ఫాసిస్టు ప్రభుత్వంపై రణభేరి మోగిస్తుందన్నారు.

పాట్నా సమావేశంలో విపక్షాల ఐక్య కార్యాచరణ ప్రజలకు కొండంత సంతోషాన్ని, భరోసాను కల్పించాయి. జూలైలో నిర్వహించ నున్న 'సిమ్లా' సమావేశంలో ఐక్యకూటమి కన్వీనర్‌ను, ఉమ్మడి ప్రణాళికను రూపొందించు కోనున్నట్లు వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పోటీగా, ప్రతి రాష్ట్రంలోనూ ప్రతిపక్ష కూటమి ఒకే అభ్యర్థిని పోటీకి నిలపాలని నిర్ణయించుకోవడం మంచి అంశం. సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ విశాల దృక్పథంతో వ్యవహ రించాలన్నారు లాలూప్రసాద్! ఢిల్లీ ఆర్డినెన్స్‌ను ఖండిస్తేనే కాంగ్రెస్‌తో కలిసి నడుస్తామన్నారు కేజ్రీవాల్! వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఢిల్లీ ఆర్డినెన్స్‌తో సహా ఆయా అంశాలను ప్రతిపక్షాలన్నీ ఉమ్మడిగా ప్రవేశపెడతా యన్నారు ఖర్గే! ఇలా 'ప్రతి పక్షాల ఐక్య వేదిక'

బీజేపీకి ప్రత్యామ్నాయం ఉందన్న భరోసాను ప్రజలకు కలిగించగలిగిన ప్రతిపక్షాల ఐక్యవేదిక లేకపోవటం వలన దేశం ఇప్పటికే చాలా మూల్యం చెల్లించుకున్నది! ఈ నిరాశా నిస్పృహల కారుమబ్బులు కమ్ముకున్న భారతంలో, ఆశల హరివిల్లులా ప్రతిపక్షాల ఐక్యవేదిక 'పాట్నా'లో ప్రత్యక్షమైంది! దీన్ని దేశానికి శుభసూచకంగా భావిస్తున్నారు ప్రజలు! ఎందుకంటే? ఐదు దశా బ్దాల క్రితం అలముకొన్న ఎమర్జెన్సీ చీకట్లలో జయప్రకాష్ నారాయణ నాయకత్వాన అదే 'పాట్నా'లో రూపొందిన ప్రతి పక్షాల ఐక్య సంఘటన ఉప్పెనలా విజృంభించి, ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని ఊడ్చేసింది. ఇప్పుడది మోడీ ప్రభుత్వాన్ని మార్చుతుందనే నమ్మకం ప్రజలకు కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం.

భారతీయులకు సంతృప్తిని కలిగించింది! అయితే మరింత భరోసా కోసం 'బీజేపీ 'తిరోగమన విధానాలకు' ప్రత్యామ్నాయంగా 'ప్రగతి విధానాల' ఎజెండాను కూడా ఆకాంక్షిస్తున్నారు ప్రజలు! అంతే కాదు, ఆగ్రహా వేశాలతో, 'మోడీని గద్దె దించుతాం! బీజేపీని మట్టి గరిపిస్తాం!' వంటి వ్యర్థ నినాదాలు, వ్యక్తిగత దూషణల కన్నా 'బీజేపీ తిరోగమన విధానాలను, వాటి దుష్ఫలితాలను వివరించి, వాటికి ప్రత్యామ్నాయంగా తాము చేపట్టనున్న ప్రగతి విధానాల ప్రకటన ద్వారా, ప్రతిపక్ష కూటమి, ప్రజలను శక్తివంతంగా ప్రభావితం చేయగలుగుతుందని, అను భవజ్ఞులు సూచిస్తున్నారు! 'ఈ ఐక్యవేదికను దేశభక్తి మహాపోరాటంగా భావించి ప్రతిపక్షాల ఐక్యవేదిక చిత్తశుద్ధితో కృషి చేస్తే మనల్ని విపక్షాలుగా గాక దేశభక్తులుగా భావిస్తారు ప్రజలు' అని మమతా బెనర్జీ విశ్లేషించినట్టు, నిజంగానే ప్రజలు ఐక్యవేదిక వెంటే ఉంటారు. మతవిద్వేషాలతో పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దింపుతారు. ఇది తథ్యం!

ఏసీపీగా పదోన్నతి పొందిన సీఐ జానయ్య



నవతెలంగాణ -సంతోషనగర్

యాకుత్‌పురా నియోజకవర్గం కుర్మగూడ డివిజన్ మాదన్నపేట్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ బి. జానయ్య ఏసీపీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనను హైదరాబాద్ సంతోష్ నగర్ మదన్నపేట్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్ అభినందనలు తెలిపారు. అనంతరం ఆయనకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, అభిమానులు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయి పెండ్లికి అండగా ఉప్పల ఫౌండేషన్



నవతెలంగాణ - నాగోల్

ఓ పేదింటి అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. కర్నాటక గుల్బర్గాకు చెందిన ఓ పేద కుటుంబంలో పుట్టిన భవాని వివాహానికి సహాయం చేయాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు హైదరాబాద్ నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తను కలిశారు. తర్వాత వారికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త చేతుల మీదుగా పుస్తె, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెండ్లి కూతురు, వారి కుటుంబ సభ్యులు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

సాయి నగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ- నాగోల్

నాగోల్ డివిజన్‌లోని సాయి నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. గురువారం ఎమ్మెల్యే సాయి నగర్ గుడిసెల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చందు నాయకత్వంలో కాలనీవాసులకు ఘన స్వాగతం పలికి..గజమాలతో సన్మానించారు. అనంతరం కాలనీలో నెలకొన్న త్రాగునీరు, డ్రైనేజీ, ఇండ్లలోని విద్యుత్ మీటర్లు, వీధి దీపాలు, దోమల నివారణ చర్యలు, దళిత బంధు, బీసీ బంధు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లు, గృహలక్ష్మి పథకాల కింద మూడు లక్షలు అందించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కోరారు. తర్వాత మిగిలిపోయిన వారికి కూడా జీవో 58 కింద ఇళ్ల పట్టాలను ఇప్పించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ..తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి వీధి దీపాలు, చెత్త బండిని, దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాగోలు డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, సతీష్ యాదవ్, యాదగిరి, యాకూబ్ భాషా, రాములు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'రద్దు చేసిన సైన్స్ అవార్డులను పునరుద్ధరించాలి'



నవతెలంగాణ- సంతోష్‌నగర్

గతేడాది కేంద్రం రద్దు చేసిన 300కు పైగా సైన్స్ అవార్డులను, తాజాగా రద్దు చేసిన మరో తొంభై.. ఈ రెండింటిని వెంటనే పునరుద్ధరించాలని ప్రజా సైన్స్ ఉద్యమ నేత, కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సీ.సీ.జీ.జీ.ఓ.ఓ) జాతీయ ఉపాధ్యక్షులు వి. కృష్ణ మోహన్ శాస్త్ర, సాంకేతిక మంత్రికి రాసిన లేఖలో కోరారు. సైన్స్, హెల్త్ రంగాల్లో అవార్డులను నిలిపేయాలని శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ఈ అవార్డులను నిలిపేసినట్టు ప్రకటించిందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు, యువ శాస్త్ర వేత్తలు, సైన్స్ టీచర్లు, అంతర్జాతీయ హోదా కలిగిన శాస్త్రవేత్తలకు ఇవ్వడానికి ఉద్దేశించిన 72 అవార్డులను రద్దు చేసిం దని చెప్పారు. నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా కూడా 20కి పైగా అవార్డులను కూడా పక్కకు పెట్టింది. శాస్త్రవేత్తల కోసం శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన అవార్డులను అర్థంతరంగా హఠాత్తుగా రద్దు చేయడాన్ని ఆయన తప్పు పట్టారు.

ఇది మన శాస్త్రీయ సంస్థల స్వయం ప్రతిపత్తిని లాక్కునేందుకు చేపట్టిన ప్రక్రియని, యువ శాస్త్రవేత్తలకు, సైన్స్ టీచర్లకు అవార్డులు రద్దు చేయడాన్ని కేవలం వారి కెరీర్‌లోని అవకాశాలను గుంజుకోవడం కాకుండా వారిలో శాస్త్ర విజ్ఞానం పట్ల గల తృష్ణను చంపేయాలన్న దుర్బుద్ధితో సర్కార్ ఈ పని చేసిందని ఆరోపించారు. శాస్త్రీయ దృక్పథాన్ని (సైంటిఫిక్ టెంపర్) అభివృద్ధి చేయడం భారత పౌరుల ప్రాథమిక బాధ్యతగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ (హెచ్) పేర్కొంది. అందుకు భారతీయ పౌరులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలి, అలా ఉండేలా ప్రోత్సహించాలి. కానీ కేంద్రమే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణమన్నారు.

రాజ్యాంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రాథమిక బాధ్యతగా పేర్కొనటం జాతీయోద్యమ భావ నని, స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడ్డాక శాస్త్ర విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేందుకు, ప్రోత్సహించేందుకూ సీఎస్ఐఆర్, ఎన్‌సీఎస్‌టీసీ, డీఆర్ డీఓ, ఇస్రో, బార్క్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలను స్థాపించారు. సమకాలీన ప్రపంచంలో సైతం మన శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, డాక్టర్లు అగ్రభాగాన ఉన్నారంటే అటువంటి అవగాహనతో ఎంతో ముందు చూపుతో స్థాపించిన వివిధ ఐఐటీలు, ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటివీ కారణం. విజ్ఞాన్ ప్రసార్ వంటి సంస్థలను మూసి వేయటం, ఇతర శాస్త్ర సాంకేతిక సంస్థలకు నిధులలో కోత విధించటం ఆపాలని కోరారు. ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, శాస్త్రీయ దృక్పథానికి తూట్లు పొడవాలని చేస్తున్న కుయత్నాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. భారత దేశ చరిత్ర, భారతీయ తత్వశాస్త్రంలో చార్వాకులు, లోకాయతులు, సాంఖ్యులు వంటి వారి పాత్ర ఎంతో గొప్పదని, వారి వారసత్వంగా సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని నిలబెట్టడానికి, మరింతగా ప్రోత్సహించడానికి భారతీయులందరమూ కృషి చేయాలని వి. కృష్ణ మోహన్ విజ్ఞప్తి చేశారు. భౌతికంగా అనేకమందిని మట్టుబెట్టినా, బెదిరించినా హేతువును అడ్డుకోవడం సాధ్యం కాదని, ఛాందసత్వానికి, మౌఢ్యానికీ వ్యతిరేకంగా బుద్ధిజీవులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు అందరూ ఒక్కటై ఎదిరించాలని ఆయన పిలుపునిచ్చారు.

కర్రీ పాయింట్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్ 1లో ఏర్పాటు చేసిన నూతన శ్రీ కన్య కావేరి కర్రీ పాయింట్ ను గురువారం డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యజమాని కృష్ణ, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేవైఎం ఉపాధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలయం ప్రారంభం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ ఫేజ్ 4 లో ప్రియాంక కలెక్షన్స్ నూతన వస్త్రాలయాన్ని గురువారం కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యజమాని రాణి, వెంకట్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్ రెడ్డి, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, కాలనీ సభ్యులు వెంకట్, చిన్న రావు, వికాస్, అశోక్, శ్రీనివాస్ రావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



'త్వరలో పార్క్‌ను అభివృద్ధి చేస్తా'



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్ కే డీ నగర్ పార్క్‌ను అతి త్వరలోనే అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం కార్పొరేటర్ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కాలనీ వాసులు కోరినట్లు తెలిపారు. అందుకే వారి కోరిక మేరకు పార్క్ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేనేత మోర్చా కన్వీనర్ రఘురాం నేత, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్దన్ రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, కృష్ణ రావు, శ్రీనివాస్ రావు, శ్రీధర్ రావు, రమేష్ బాబు, పవన్ పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధి కోసం

కృత నిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంత కండ్ల జగదీశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

పాడి రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంత కండ్ల జగ దీశ్వర్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో 3 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, విస్తరించిన పెరుగు ప్లాంట్, విజయ నల్గొండ- రంగారెడ్డి నూతన బ్రాండ్ పాల ప్యాకెట్ ను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేస్తూ.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. పాలతో పాటు బై ప్రొడక్ట్స్ మార్కెటింగ్ పెంచుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.కృష్ణ, డైరెక్టర్లు అరుకాల గాల్ రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, చింతలపురి వెంకట్రామిరెడ్డి, కర్నాటి జయశ్రీ, చల్లా సురేందర్ రెడ్డి, రచ్చ లక్ష్మి నర్సింహారెడ్డి, కోట్ల జలెందర్ రెడ్డి, కందాల అలివేలు, గూడూరు శ్రీధర్ రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకే నాపై ఆరోపణలు

- బీఆర్ఎస్ నేత బైటింటి ఈశ్వర్ రెడ్డి



నవతెలంగాణ - బోడుప్పల్

రాజకీయాల్లో నా ఎదుగుదలను చూసి ఓర్వలేకే తనపై ఆరోపణలు చేస్తున్నారని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నేత బైటింటి ఈశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్వతాపూర్ సర్వే నెంబరు 20లోని ప్లాట్ నెంబరు ఈ 211 నెంబర్ ప్లాట్ 320 గజాల స్థలాన్ని శ్రీ రమణ కో ఆపరేటివ్ సొసైటీ డాక్యుమెంట్ 1989 ద్వారా న్యాయ బద్ధంగానే కొనుగోలు చేశానని తెలిపారు. దానికి 1992లో గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోగా.. 2014లో శ్రీనివాస్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడని తెలిపారు. అనంతరం అతని నుండి నేను 2016 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని 2019 నుండి విద్యుత్ బిల్లులు చెల్లించానని తెలిపారు. 2016లో బోరు వేసినప్పుడు ఎలాంటి అభ్యంతరం లేదని 2020లో మున్సిపల్ నుండి ఇంటి నెంబరు కూడా పొందానని చెప్పారు. ఇప్పుడు సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రోద్బలంతో తన ప్లాట్ అంటూ కొందరు కావాలని రాద్ధాంతం చేస్తూ తనను బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తన భార్య కార్పొరేటర్ కావడాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టానుసారంగా తనపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరో బలవంతం చేస్తే తనపై కేసు నమోదు చేశారని, దానిని న్యాయపరంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

సొసైటీ పేరునా జరిగే అక్రమాలను త్వరలోనే బయట పెడ్తా...

శ్రీ రమణ కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో సొసైటీ అధ్యక్షుడు చేసే అక్రమాలను త్వరలోనే బయట పెడతానని ఈశ్వర్ రెడ్డి అన్నారు. సొసైటీలో లేని ప్లాట్ ను లే అవుట్ చేసిన వ్యక్తి కొడుకు పేరునా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. తన ప్లాట్ విషయంలో రాజీకి వచ్చి సగం సగం చేయాలని సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడిన మాటలు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మీకు నచ్చితే ఒకలా నచ్చకుంటే మరోలా ప్రచారం చేస్తారా అని మండిపడ్డారు. ఎలాంటి అర్హతలు లేకున్నా సొసైటీ పేరుతో మల్లారెడ్డి చేసిన అక్రమాలను బయటకు తీసి బాధితులకు న్యాయం చేసే వరకూ పోరాటం చేస్తానని హెచ్చరించారు.

పీర్జాదిగూడ కాంగ్రెస్ మహిళా

అధ్యక్షురాలిగా శ్రీలతా బద్రు నాయక్



నవతెలంగాణ - బోడుప్పల్

పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా శ్రీలతా బద్రు నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో రెండో సారి ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించారని..కానీ నేడు బీఆర్ఎస్ పాలనలో రుణాల కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. సర్కార్ నడిచేందుకు గల్లీకో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి తాగుబోతుల తెలంగాణగా మర్చిండ్రని విమర్శించారు. అనంతరం తన పదవికి సహకరించిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవి, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

'అవమానాలు భరించలేకనే బీఆర్ఎస్‌ను వీడుతున్నాం'



నవతెలంగాణ - మీర్‌పేట్

బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమకారులకు జరుగుతున్న అవమానాలను భరించలేకనే పార్టీని విడుతున్నామని తెలంగాణ ఉద్యమకారులు మహేశ్వరం నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కొత్త మనోహర్ రెడ్డి, మాజీ రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పాండు రంగారెడ్డి, వెంకట్ రాం రెడ్డిలు అన్నారు. గురువారం కొత్త మనోహర్ రెడ్డి ఇంట్లో ఉద్యమకారులు, తన అనుచరులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్త మనోహర్ రెడ్డి, పాండు రంగారెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం కోసం మొదటి నుంచి జరిగిన ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు నుండి పనిచేస్తున్నామని తెలిపారు. ఉద్యమ సమయంలో ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని కేసీఆర్‌తో కలిసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశామన్నారు. తెలంగాణ ద్రోహులుగా ఉన్నవారు ఈరోజు సీఎం కేసీఆర్ పక్కన చేరాలని చెప్పారు. మొదటి నుండి ఉన్న ఉద్యమకారులకు నేడు మొండిచేయి చూపిస్తూ అవమానాలకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకుల ప్రాణాలను బలిగొన్న నాయకురాలు సబితా ఇంద్రారెడ్డి అని ఆరోపించారు. ప్రజలు కట్టిన పన్నులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ తన సొంత డబ్బులతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొప్పలు చెప్పుకుంటుందని వివరించారు. అభివృద్ధి పేరుతో చెరువులను కబ్జా చేస్తూ తన అనుచరులకు ప్రభుత్వ భూములను కట్టబెడుతున్నారని ఆరోపించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేస్తున్న అవినీతి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని..వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పి చేవెళ్లకు పంపిస్తారని జోస్యం చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుల పోరాటం గమనించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియాగాంధీని, కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. జులై 2న రాహుల్ గాంధీ సమక్షంలో దాదాపు 5 వేల మందితో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అనంతరం తన సొంత భూమిని పేదలకు పంచి పాస్ బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు వెంకట్రాంరెడ్డి, గుళ్ల సంతోష్ ముదిరాజ్, వేద భవాని, దుశకంటీ రవి, అశోక్ శెట్టి, నరేందర్ గౌడ్, కామోజీ తిరుపతయ్య, ఎర్ర శంకరయ్య, కుమార్ ముదిరాజ్, రాజు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ కౌశిక్ అజేయ సెంచరీ



నవతెలంగాణ - చైతన్యపురి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ క్రికెట్ గ్రౌండ్ అరెన నందు నిర్వహించిన 2 రోజుల లీగ్ మ్యాచ్‌లో పీకేఎంసీసీ , గ్రీన్ టర్ఫ్ సీసీ మధ్య జరిగిన మ్యాచ్ లో గ్రీన్ టర్ఫ్ ఆటగాడు సిరికొండ కౌశిక్ 160 బంతుల్లో 16 ఫోర్స్, 6 సిక్సర్లలతో 130 పరుగులు సాధించి నాటౌట్ గా నిలిచాడు. ఈ మ్యాచ్ లో గ్రీన్ టర్ఫ్ జట్టు 9 వికెట్లు కోల్పోయి 68.2 ఓవర్ లలో 238 పరుగులు సాధించింది.

డివిజన్‌లో ఎలాంటి అభివృద్ధి చేశారో చూపించండి..?

- బీఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి



నవతెలంగాణ - ఉప్పల్

ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకునైతానంటూ ప్రజల మద్దతుతో గెలిచిన మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డిలు డివిజన్ లో ఎలాంటి అభివృద్ధి చేశారో చూపించాలని బీఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుభాష్ రెడ్డిని విమర్శించే స్థాయి మీకు లేదని అన్నారు. ఉప్పల్ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ చేసిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బగాయత్ సమస్యలను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది అని అన్నారు. ఉప్పల్‌లో మినీ శిల్పారామం, స్కై వాక్ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఉప్పల్ లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు లోపాయి కారి ఒప్పందంతో రెండు పార్టీలు పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మస్కా సుధాకర్, ఉపాధ్యక్షుడు అన్నే వెంకటేష్, కార్యదర్శి సురవి సత్యపాల్ రెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి వెంకటేశ్వర రెడ్డి, డివిజన్ సోషల్ మీడియా అధ్యక్షుడు వేముల వెంకట్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు గౌరిగే ఐలేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుగూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'త్యాగానికి ప్రతీక బక్రీద్ '



నవతెలంగాణ- సంతోష్ నగర్

త్యాగానికి ప్రతీకగా ఇస్లాం మతస్తులు జరుపుకునే పవిత్ర పండుగ బక్రీద్ అని ఏసీపీ సుబ్బిరామిరెడ్డి అన్నారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ చాటి చెప్పిందని అన్నారు. తమకు కలిగిన దాంట్లో నుంచి ఇతరులకు పంచి పెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదని.. ఈ స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటు



నవతెలంగాణ - బోడుప్పల్

తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. బోడుప్పల్ అంబేద్కర్ సర్కిల్ వద్ద బుధవారం నిర్వహించిన సంతాప సభలో సాయిచంద్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీమాంధ్ర పాలనలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు అర్థమయ్యేలా తన పాట ద్వారా ఉత్తేజ పరిచి ఉద్యమానికి ఊపిరి పోశాడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, కార్పొరేటర్లు సుమన్ నాయక్, చీరాల నరసింహ, బీఆర్ఎస్ నేతలు కొత్త రవి గౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, జె.రాములు, బొమ్మకు విశ్వనాథ్, కొత్త చక్రపాణి గౌడ్, చంటి శ్రీనివాస్, తాల్క శత్రజ్ఞ, మోతే రాజు, ఉప్పరి విజయ్, జె.ప్రవీణ్, చినంగిల వినయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి :



తెలంగాణ ఉద్యమ కారుడు, తెలంగాణ గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం ఎంతో బాధించిందని ఎస్సీ సెల్ మాజీ ప్రధాన కార్యదర్శి కొండ్ర శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం సాయి చంద్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బీరెల్లి వెంకట్ రెడ్డి, మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

నాగోల్ :



ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయి చందు మరణం బాధాకరమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన గుర్రంగూడలోని సాయి నివాసానికి చేరుకుని సాయి చందు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గుప్త మాట్లాడుతూ సాయి చందు స్వరానికి మరణం లేదు.. పాట ఉన్నంత వరకు తను మనతోనే ఉంటారని అన్నారు.

'ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ అన్నారు. ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో ఆయన మాట్లాడారు. త్యాగానికి మారుపేరుగా నిలిచే బక్రీద్ పండుగ రోజుల అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా మసలుకోవాలని సూచించారు. ఖుర్బానీ చేసిన జంతువుల వ్యర్థాలను వీధుల్లో పడవేయకూడదని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు 59 జీవో పట్టాల పంపిణీ

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

మండలంలోని వివిధ గ్రామాలతో పాటు తుర్కయాంజల్, పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో 59 జీవో కింద అర్హులైన 605 మందికి రిజిస్టర్ కన్వేయన్స్ డీడ్‌లను నేడు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి..ఇబ్రహీంపట్నం ఆర్డీవో వెంకటాచారితో కలిసి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అనితా రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్ద అంబర్‌పేట కావేరి పంక్షన్ హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి 59 జీవో కింద అర్హులైన వారందరూ హాజరు కావాలని కోరారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

రూ.2,16,580, రెండు కార్లు, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం



నవతెలంగాణ - వనస్థలిపురం

గుట్టు చప్పుడు కాకుండా అపార్ట్మెంట్ లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని గురువారం వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.2,16,580తో పాటు, రెండు కార్లు, పది మొబైల్ ఫోన్లు, నాలుగు సెట్లు ప్లేన్ కార్డ్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పనామా గూడెమ్స్ చౌరస్తా డబల్ త్రిబై కేవీపీ రెండో అంతస్తులో రూమ్ నెంబర్ 211 పేకాట ఆడుతున్నట్టు విశ్వసనీయమైన సమాచారం అందడంతో పోలీసులు వల పన్ని వారిని పట్టుకున్నట్టు తెలిపారు. నల్లగొండ జిల్లా మర్రిగూడకు చెందిన అఖిల రమేష్, హయత్ నగర్ బొమ్మల గుడికి చెందిన వర్మాల శంకర్, బీఎస్ రెడ్డి నగర్‌కు చెందిన అల్లపాల నవీన్, నాగోల్ సాయి నగర్ కాలనీకి చెందిన కనుకుల సాయికుమార్, సరూర్ నగర్ గౌతమీ నగర్ కు చెందిన శంకర్, మనసురాబాద్ సాయి నగర్ కాలనీకి చెందిన మధుసూదన్, సైదాబాద్ కాలనీకి చెందిన మల్లికార్జున్, నాగోల్ అజయ్ నగర్ కాలనీకి చెందిన ప్రసాద్, నల్లగొండకు చెందిన విజయ్ కుమార్ లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నా సాయి నాకు కావాలి సాయి లేచి మాట్లాడు..



నవతెలంగాణ -నాగోల్

గాయకుడు, తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయి చంద్ హఠాన్మరణం చెందిన సంగతి తెలిసిందే. అయితే భార్య రజిని సాయి చంద్ భౌతిక కాయాన్ని చూసి.. నా సాయి నాకు కావాలి లే లేచి మాట్లాడు అంటూ ఒక్కసారి గుండెలు పగిలేలా విలపించడం తో అక్కడున్న వారందరినీ కలచివేసింది. ఎప్పుడు ఆట, పాట ప్రజలే తన కుటుంబం అంటూ ఉండేవాడని నీకోసం నీ ఇంటికి అందరూ వచ్చారు సాయి లేవయ్యా అంటూ కన్నీటి పర్యంతం కావడంతో పలువురు కంటతడి పెట్టారు. బంధువులతో పాటు వచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే బాల్క సుమన్, చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఆమెను ఎంత ఓదార్చిన ఆమె బాధను ఆపుకోలేక పోయింది. ఎప్పుడు చిరునవ్వుతో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే సాయి చంద్ ఇక లేడు అనే దాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని బంధువులు స్నేహి తులు అభిమానులు కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు.

మృతుని కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాప్రా

మంగాపురంకి చెందిన శ్రీను ముదిరాజ్ తండ్రి హనుమంత్ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగాపురం కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, పూస రమేశ్, నరేశ్ ముదిరాజ్, నాదెండ్ల నవీన్, శ్రీనాథ్‌గౌడ్ గొల్లూరి మనీష్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ రాఘవేంద్ర టిఫిన్స్, మీల్స్ వెజ్ హోటల్ ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివిజన్ మెయిన్ రోడ్డు సమీపంలో శ్రీ రాఘవేంద్ర టిఫిన్స్, మీల్స్ వెజ్ హోటల్‌ను స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, నిర్వాహకులు వెంకటేష్, మల్లేష్. బీఆర్ఎస్ నాయకులు సుఖేందర్ రెడ్డి, మల్లారెడ్డి, బాలరాజు, మల్లేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, రమేష్, వినోద్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా బక్రీద్ వేడుకలు

నవతెలంగాణ-జవహర్‌నగర్

త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందనీ, కార్పొరేషన్‌లోని ముస్లీం సోదరులు పండుగను ఘనంగా జరుపుకుని ఆత్మీయతను చాటుకున్నారని ముస్లీం మతపెద్దలు అన్నారు. గురువారం ఉదయాన్నే ముస్లీం సోదరులందరూ ఈద్గాకు వెళ్ళి నమాజ్ చేసుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలను నిర్వహించుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా ఒకరికొకరు అలింగనం చేసుకుని సోదరాభావాన్ని చాటుకుని పెద్దవారిని స్మరించుకున్నారు.

మేడ్చల్‌కలెక్టరేట్ : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జామియా మసీదులో ముస్లింలు బక్రీద్ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, మత పెద్దలు, జలాల్ పాషా, లాలాబాయి, జాంగీర్, జలీల్, ఫెరోజ్, ఫయాజ్ పాల్గొన్నారు .

నేరేడ్‌మెట్ : బక్రీద్ సందర్భంగా శుక్రవారం మచ్చ బొల్లారం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అతిక్ పాష, అక్రమ్ పాష, షేక్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కాప్రా : బక్రీద్ (ఈద్ ఉల్ జూహ) సందర్భంగా కాప్రా ఈద్గాలో ప్రార్థనలు జరిగాయి. ఈద్గా అధ్యక్షుడు మహమ్మద్ బద్రుద్దీన్, వెంకట్ రెడ్డి ప్రసంగిస్తూ బక్రీద్ త్యాగానికి ప్రతీక అన్నారు. ఈ ప్రార్థనలో ఈద్గా ఉపాధ్యక్షుడు యస్.ఎ.రహీమ్, ప్రధాన కార్యదర్శి తాజుద్దీన్, మెంబర్లు సలీం, రఫీక్, బబ్లూ, తాహెర్, మొహమ్మద్ గౌస్, కరీం, సమద్, ఖాదర్ వలీ, సర్వర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.









రేపటి నుంచి విఖ్యాత సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం

నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత సాహితీవేత్త శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85 వ జన్మదిన సందర్భంగా శ్రీ త్యాగరాయ గాన సభ నిర్వహణ లో ఆయన సాహితీ సప్తాహం రేపటి నుంచి 7 వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కళా సుబ్బారావు కళా వేదిక పై జరుగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను గాన సభ సమావేశ మందిరంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశం లో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి వివరించారు. ఇనాక్ త్యాగరాయ గాన సభతో ఎంతో అనుబంధం ఉందని, ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టత దష్టి లో వుంచుకొని సాహిత్య సప్తాహం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు రోజుకొకటి ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం, వలస, దిక్కులేనోడు శూన్యం, విమర్శిని, పాలి,ఆల్మ్ ఆఫ్ పార్డన్ సంపుటిలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ సాహితీవేత్త నందిని సిద్ధ రెడ్డి, శాసన సభ తొలి సభాపతి సిరికొండ మధు సూదనాచారి, మాజీ మంత్రి మండలి బుధ ప్రసాద్, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరి గౌరి శంకర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఆవిష్కరిస్తారని తెలిపారు. వివిధ రంగ ప్రముఖులు అతిథులుగా ప్రతి రోజూ హాజరయ్యే కార్యక్రమాలకు తొలుత సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. సమావేశంలో గుండవరపు గీతా దేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏరిన క్రికెట్ అకాడమీ ప్రారంభం

నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీలో 18 స్పోర్ట్స్ ఏరిన క్రికెట్ అకాడమీ బాక్స్ క్రికెట్‌ను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆరోగ్యానికి శారీరక ధృఢత్వానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. క్రీడల్లో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న క్రికెట్‌లో ప్రతిభ నైపుణ్యత ద్వారానే గుర్తింపు లభిస్తుందన్నారు. స్థానిక యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభకు పదును పెట్టి క్రికెట్‌లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అకాడమీ నిర్వాహకులు యాసీన్, హరీష్, ప్రతాప్, కార్తీక్, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, దయాకర్ రెడ్డి, గణేష్, కటార్ల శేఖర్, భానుచంద్రారెడ్డి, రఘు పాల్గొన్నారు.



నేడు నాచారం డీపీఎస్‌లో విద్యార్థుల స్వయం పాలనా దినోత్సవం

నవతెలంగాణ-నాచారం

నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థుల స్వయం పాలనా దినోత్సవం ఇన్వెస్టచర్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ సీఓఓ మల్కా యశస్వి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో డీపీఎస్ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహం అందిస్తుందన్నారు. 2023-24 విద్యా సంవత్సర ఇన్వెస్టచర్ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ కమిషనర్ సర్ఫరాస్ అహ్మద్, రాష్ట్ర డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ సెక్రెటరీ రోనాల్డ్‌రోజ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ చైర్మెన్ మల్కా కొమరయ్య హాజరవుతున్నట్టు తెలిపారు.

నాచారంలో జలమండలి మేనేజర్ పని చేస్తున్నారా..? లేదా..?



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్‌లో డ్రయినేజీ మురుగు రోడ్లపై ఏరులై పారుతుంటే జలమండలి మేనేజర్ సందీప్ ఏం చేస్తున్నారని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రయినేజీలు పొంగిపొర్లుతూ నిత్యకృత్యంగా ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి ఎదురవుతుందన్నారు. ప్రజలు వారి గోడును తమతో వెల్లబుచ్చుకుని ఇంట్లో ఉండలేం.. బయట తిరగలేం.. మురికి కూపంలో మగ్గిపోతున్నామని స్థానిక ప్రజలు గోడు వెల్లడిస్తున్నారు. సివరేజ్ సూపర్‌వైజర్ రాకేష్ సెలవుపై వెళ్లడంతో డివిజన్‌లోని డ్రయినేజీ సమస్యలను వదిలేసి బాధ్యత గల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై సామాన్య ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఉన్నత అధికారులు ఇప్పటికైనా డివిజన్‌లోని మురుగు సమస్యపై దృష్టి పెట్టి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి జలమండలి, సివరేజ్ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. వెంటనే జలమండలి మేనేజర్ సందీప్ తన విధులను సక్రమంగా నిర్వహించకుంటే నాచారం నుంచి వెళ్లిపోవాలని సలహా ఇచ్చారు. ప్రజల కోసం పనిచేసే అధికారిని నాచారానికి పంపించాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు.

సాయిచంద్ అకాల మరణం ఎంతగానో కలిచి వేసింది

- నిమ్స్ అనుసంధానాధికారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రజలను చైతన్య పరుస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రజలను మమేకం చేస్తూ, సీఎం కేసీఆర్ ప్రతీ కార్యక్రమంలో, ప్రతి పల్లెలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ, తాను ఒక్కడే 100 మంది గాయకులతో సమానంగా పాటలు పాడి ప్రతి సమావేశంలో తనదైన ముద్ర వేసుకున్న సహజ గాయకుడు సాయి చందు అకాల మరణం తనను ఎంతగానో కలిచి వేసింది అని నిమ్స్ అనుసంధానాధికారి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మార్త రమేష్ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఉద్యమాన్ని ఉదృతం చేయడం, విద్యార్థి నాయకులను ఉద్యమంలో నడిపించడం, ఎవరూ ఉద్యమంలో ప్రాణాలు తీసుకోవద్దు అని పాటలు పాడుతూ, ఉద్యమకారుడుగా సేవలందించిన సాయిచంద్ ఇక లేడు అంటే నమ్మలేక పోతున్నట్టు తెలిపారు. సాయి చందుతో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందనీ, నిమ్స్‌లో నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలకు వచ్చి పాటలు పాడి కార్యక్రమాల విజయవంతంలో సహకరించిన మిత్రుడు ఇక లేడు అన్న విషయం తనను ఎంతో బాధిస్తుందని తెలిపారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబ సభ్యులకు తను లేని లోటు తట్టుకునే ఆత్మస్థైర్యం చేకూరాలని కోరుకుంటున్నట్టు మార్త రమేశ్ తెలిపారు.

మంత్రి తలసానిని కలిసిన నల్లపోచమ్మ మహంకాళి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సబ్జిమండి, నటరాజ్‌నగర్ శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ మహంకాళి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులందరూ పూజ కమిటీ అధ్యక్షుడు ప్యాట నందకిశోర్ ఆధ్వర్యంలో ఈ ఏడాది 101వ వార్షిక బోనాల సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి బోనాల అభివృద్ధి కార్యక్రమాల కోసం వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, కోశాధికారి కట్ట శ్రీనివాస్, సలహాదారులు సేనాపతి చంద్రశేఖర్, కట్ట కుమార స్వామి, చింత జైరాం, అల్లె దినేష్, తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సమీక్షా సమావేశం



నవతెలంగాణ-కాప్రా

రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని వర్షాల వల్ల ఏర్పడే కర్రెంట్ సమస్యలు, ట్రైమర్లు సరిగా పని చేయకపోవడం, పవర్ ఫ్లెక్చువేషన్స్ గురించి సంబంధిత అధికారులతో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు సమస్యలను పరిష్కరిస్తామనీ, వర్షాకాలంకి సంబంధించి ఆరు టీంలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కొత్తగా కావాల్సిన 20 లైట్లు, 120 ఎలక్ట్రికల్ పోల్స్‌కు సంబంధించి రీ టెండర్ పిలిచి 15 రోజుల్లో ఏర్పాటు చేస్తామని పుణ్య నాయక్ తెలిపారు. 20 కాలనీల్లో లైట్ ఏర్పాటు చేయాలని పుణ్యానాయక్‌కి కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉప్పల్ ఎలక్ట్రికల్ ఆఫీసర్ రవికుమార్, చర్లపల్లి ప్రత్యూష, కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్, విద్యుత్ అధికారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి క్యాసాని అన్నారు. వర్షాకాలం మొదలైనందున సీజనల్, విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో నివాసిత ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ నీరు ఇంటి ఆవరణలో ఉండటం వల్ల దోమలు ఎక్కువ అవ్వడం, వాటి వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. కొద్ది మందికి ప్రాణాంతకంగా మారతాయన్నారు. కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వస్తుందన్నారు. ఇంటి ఆవరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా, వీటి బారి నుంచి తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగు నీటిని వేడి చేసి, చల్లార్చిన తర్వాత తీసుకోవడం మంచిదని తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు, దోమ తెరలను వాడటం శ్రేయస్కరమన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, డీహైడ్రేషన్ ఎక్కువ ఉంటే దగ్గరలోని హాస్పిటల్‌కు వెళ్ళాలని ఆమె సూచించారు.

ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వినతి

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి ఏఎస్ రావు నగర్ డివిజన్ శ్రీనివాసనగర్ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు వారి కాలనీలో పురాతన పైపులైను మార్చాలనీ, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలనీ, సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకి విన్నవించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మోహన్, సాంబయ్య, ఉపేంద్రచారి, సత్యనారాయణ, కృష్ణారెడ్డి, ఓం ప్రకాష్, నరసింహగౌడ్ పాల్గొన్నారు.





రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ సాయిచంద్ అకాల మరణం కలిచి వేసిందని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. గురువారం సాయిచంద్ అంతిమ యాత్రలో పాల్గొన్న సీపీ.. సాయిచంద్ భౌతిక కాయానికి నివాళ్ళు అర్పించారు. మృతుడి కుటుంబానికి సీపీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

సాయిచంద్ మృతి పట్ల మంత్రి మల్లారెడ్డి దిగ్భ్రాంతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఉద్యమకారులు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ అకాల మృతి పట్ల రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఒక గొప్ప కళాకారుడిని కోల్పోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పునర్నిర్మాణంలో సాయి చంద్ ఎంతో కీలకమన్నారు. తన పాటలతో ఎంతో మంది అభిమానులను పొందారని పేర్కొన్నారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలనీ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని మల్లారెడ్డి ఆకాంక్షించారు.



తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనీ, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలనీ, కనీస వేతనం నెలకు రూ.26 వేల అమలు చేయాలనీ, ఈఎస్ఐ పెన్షన్స్ ఉద్యోగ భద్రత కల్పించాలనీ, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలనీ, రాష్ట్రంలో ఉన్న పెండింగ్ సమస్యలన్నిటినీ పరిష్కరించాలనీ, జీబు జాతాకు స్వాగతం పలుకుతూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ సభను సీఐటీయూ ఆఫీస్ కమలానగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, కోశాధికారి సునీత, జిల్లా కార్యదర్శి శోభారాణి, శివరాణి, బాలమణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, యూనియన్ నాయకులు హరిప్రియ, రామ అంజమ్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

- **మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి**



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని తెలుగు తల్లి నగర్, రాజీవ్ గృహకల్ప, సూరారం కాలనీ, డివిజన్ గల వివిధ మసీదులలో బక్రీద్‌ను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలలో గురువారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు సురేష్ రెడ్డి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, ఆర్‌జీకే అధ్యక్షుడు శివ గౌడ్, జహంగీర్, తిరుపతి , రాజు గౌడ్ , ప్రభాకర్ , సలీం , జలాల్ , మజీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిర్మాపూర్ వార్డు ప్రజల నమ్మకాన్ని నిలబెడతా

- **కౌన్సిలర్ లావణ్య హన్మంత్ రెడ్డి**



నవతెలంగాణ-మేడ్చల్

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వార్డు పరిధిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తానని కౌన్సిలర్ వంగేటి లావణ్య హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డితో కలిసి వార్డు పరిధిలో రూ. 7లక్షల వ్యయంతో రాగంయాదయ్య ఇంటి దగ్గర నుంచి కూరగాయల మార్కెట్ వరకు నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ లావణ్య హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ఓట్లు వేసి గెలిపించిన వార్డు ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఉప సర్పంచ్ నర్సింహ రెడ్డి, నాయకులు హన్మంత్ రెడ్డి, రాజీ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్మానం



- **విద్యార్థుల ప్రతిభకు ఎల్లలు లేవు**
- **ఏసీపీ అల్లం సుభాష్ చంద్రబోస్**

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతిభకు ఎల్లలు లేవని నిరూపించేది విద్యార్థులేనని ఏసీపీ అల్లం సుభాష్ చంద్రబోస్ అన్నారు. గత రెండు సంవత్సరాల క్రితం కరోనాతో మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సంఘ సేవకులు, జింకల రవితేజ ముదిరాజ్ రెండో వర్ధంతి సందర్భంగా గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధి రంగారెడ్డి నగర్ డివిజన్ పంచశీల కాలనీలో రవితేజ ఫౌండేషన్ అధ్యక్షులు జింకల వెంకటేశ్ ముదిరాజ్, అభినవ కవి వాకిటి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పంచశీల కాలనీలోని ఆయన నివాసం వద్ద రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు బాచుపల్లి కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, కుత్బుల్లాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సారా శంకర్ ముదిరాజ్, గాంధీనగర్ జిల్లా పరిష త్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు ,ముఖ్య అతిథులుగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు దివ్య ప్రశాంతి, దాక్షాయణితోపాటు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని హన్సిక రాష్ట్ర ర్యాం కు సాధించగా వారికి ఏసీపీ అల్లం సుభాష్ చంద్రబోస్, ప్రధానోపాధ్యాయులు వెంకట రాములు, పలువురు అతిథుల చేతులమీదుగా నగదు పారితోషికంతో పాటు మెమెంటో, శాలువతో ఘన సన్మానం చేసారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లడుతూ రవితేజ యాదిలో విద్యార్థులను ప్రతిభ పుర స్కారాలు అందించటం అభినందనీయం అన్నారు. కరోనా కాలంలో కన్నుమూసిన కుమారుని పేరుమీద ఫౌండషన్ స్థాపించి సమాజసేవలో భాగస్వాములైన జింకల వెంకటేశం ముదిరాజ్ సేవలను కొనియాడారు. భవిష్యత్తులో కూడా రవితేజ ఫౌండేషన్ నేతత్వంలో సేవలు విస్తృతం చేయాలని కార్యనిర్వహకులకు తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షులు జింకల వెంకటేశం ముదిరాజ్ మాట్లాడుతూ రవితేజ ఫౌండేషన్ ఏర్పాటు చేసి కొంతకాలంగా పేద ప్రజలకు, పేద విద్యార్థుల కు, తోచినంతలో సేవలందిస్తున్నానన్నారు. ప్రతిభకనబరి చిన విద్యార్థుల్లో తన కుమారుడిని చూసుకుంటున్నానని తెలిపారు. చెన్నరెడ్డి నగర్ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి తందూరి భాషయ్య పది కుర్చీలు ఉపాధ్యాయురాలు పార్వతికి అందజేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించి ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల తోపాటు శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్, సూర్యనారాయణ, పంచశీల కాలనీ వాసులు కేఎల్ రమణ రెడ్డి, రవిందర్ రెడ్డి, సతీష్, ముదిరాజ్ సంఘ సభ్యులు ప్రకాష్ ముదిరాజ్, సుంకరి సాయి ప్రతాప్ ముదిరాజ్, రామకృష్ణ, ఆవుల కృష్ణ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్‌పై అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్‌స్పైర్ అవార్డు మనక్-2023కు సంబంధించిన నామినేషన్ ప్రక్రియపై ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో టీ-సాట్ ఛానెల్ ద్వారా తాజాగా టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఈ అవగాహనా కార్యక్రమాన్ని వీక్షించారు. బ్రిగేడియర్ గణేశం, పల్లె సృజన, ప్రొఫెసర్ సురేష్ బాబు విద్యార్థులకు ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ప్రాజెక్టులు ఎంపిక చేసుకోవాలి అనే అంశాలను వివరించారు. జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్ జీబీహెచ్ఎస్ సుల్తాన్‌షాహీ పాఠశాలలో టీ-సాట్ నిపుణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీలో విద్యార్థుల వీడ్కోలు సమావేశం



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మ గూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల గురువారం వీడ్కోలు తెలిపే సమావేశం విద్యార్థుల ఆటపాటల కేరింతల మధ్య జూనియర్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అందరూ కలిసి ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంతోషంతో వీడ్కోలు తెలిపారు. సీనియర్ విద్యార్థులు మాట్లాడుతూ తమ అనుభవాలను తెలుపుతూ ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. తమ కళాశాల అనుభవాలను జూనియర్ విద్యార్థులతో పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్ లోకనాథం మాట్లాడుతూ జీవితంలో అత్యున్నత స్థితికి ఎదగాలంటే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా పట్టుదలతో సాధించాలన్నారు. ప్రతి ఒక్కరితో సమాజ హితంగా మెలగాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొ.టీ ఎల్ రామదాసు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే ఇంజనీర్లుగా తయారు కావాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెట్టుకున్న లక్ష్యసాధనలో ఉన్నత స్థానం అధిరోహించాలని, అభివద్ధి పథంలో నడవాలన్నారు. అనంతరం విద్యార్థులు అందరూ కలిసి తమ తమ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె .త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జే త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపల్, వివిధ విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాల ప్రతీక బక్రీద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మతసామరస్యాల ప్రతీకగా బక్రీద్ పండగ నిలుస్తుందని హిందూ ముస్లింలు ఐక్యత చాటునప్పుడే శాంతి సామరస్యం పెంపొందుతుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం బక్రీద్ పండగ పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ లోని మసీదు వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ నాయకులు సయ్యద్ రషీద్, ఎండి .మహమూద్, ఆజాం అలీ, ఎండి. హాజీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లో వెంకటరామిరెడ్డి నగర్‌లోని మజీద్ వద్ద మైనార్టీ నాయకులు, మజీద్ కమిటీ సభ్యులు ఎండి. షాబుద్దీన్, ఎండి.రషీద్ ల ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గాజుల రామారం డివిజన్‌లో.. లెనిన్ నగర్‌లోని మజీద్ వద్ద మైనారిటీ సోదరులు ఏర్పాటుచేసిన బక్రీద్ వేడుకలకు గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



సాయిచంద్ మరణం బాధాకరం



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ మరణం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ మేడ్చల్ నాయకులు అన్నారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సాయిచంద్ మరణం తెలంగాణ సాహితీ లోకానికి, బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. ఆయన మరణించినా వారి పాటలు ఎప్పుడూ ప్రజల హదయాల్లోనే ఉంటాయని అన్నారు. నాడు తెలంగాణ ఉద్యమంలో లక్షలాది మందిని ఉర్రూతలూగించి నేడు స్వరాష్ట్ర అభివృద్ధికి ప్రజలకు పాట రూపంలో చెబుతున్న గొంతుక మూగబోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహ రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాల్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మండల అధ్యక్షులు చీర్ల దయానంద్ యాదవ్, వైస్ ఎంపీపీ వెంకటేష్, మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్‌లు కొడే మహేష్, తుడుం గణేష్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, నడికొప్పు నాగరాజు ముదిరాజ్, బత్తుల మధుకర్ యాదవ్,బీఆర్ఎస్ నాయకులు వీర్లపల్లి రాజ మల్లారెడ్డి, బబూల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్-సీబీఎస్ మెట్రో రైళ్ల వేళల్లో మార్పులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా జేబీఎస్ నుంచి సీబీఎస్ వెళ్లే మార్గంలో మెట్రో రాకపోకలలో మార్పులు చేసినట్టు ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీహెచ్ఎంసీ అభ్యర్థన మేరకు వచ్చేనెల 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మెట్రో రైలు ఉదయం 6:30 నుంచి రాత్రి 11గంటల వరకు నడుస్తాయని తెలిపారు. సాధారణంగా ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన రైలు సేవలు ఆరున్నర గంటల నుంచి జేబీఎస్, సీబీఎస్ మార్గంలో ప్రారంభం కానున్నాయి.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తొలి ఏకాదశి మహోత్సవం సందర్భంగా గురువారం బాలాజీనగర్ డివిజన్ ఆంజనేయనగర్ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ఘనంగా నిర్వహించా రు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మూసాపేట్ జనతనగర్‌లో శ్రీ పాండురంగా స్వామి వారిని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, పాండు, ఉమకాంత్, విఠల్, మున్నా, కష్ణంరాజు, రాము, ఏళ్ళేశ్, వెంకటేష్, ధనలక్ష్మి, రాజేశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు

నవరస నాట్య పురస్కారాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

త్యాగరాయ గాన సభలో గురువారం నవరస నాట్య పురస్కారాలు 2023 సంవత్స రానికి గాను నాట్యంలో ప్రావీణ్యం కలిగిన బాల, బాలికల ప్రదానం చేశారు. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి రియా ఇషి మారెన్‌తోపాటు ఇతర కళాకారులను ఘనంగా సత్కరించా రు. వారికి మెమెంటోతోపాటు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ చిన్నారులకు సముద్రా ల వేణుగోపాల్, సోమ విజయ ప్రకాష్, రామావత్ తేజవతి, అడిషనల్ డీసీపీ పద్మిని నాగులపల్లి, తెలుగు ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ అను ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారాలను ప్రదానం చేశారు.

అఖిలను అభినందించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని బీజేఆర్‌నగర్ ప్రాంతానికి చెందిన వనమా ల అఖిల ఇటీవలే జరిగిన రాష్ట్ర స్థాయి 10 మీటర్ల రైఫిల్ ఛాంపియన్ షిప్, సీఎం కప్‌లలో బంగారు పతకాలను సాధించింది. ఈ మేరకు ఎమ్మెల్యే కేపీ వివేకాన ంద్‌ను చింతల్‌లోని తన కార్యాలయంలో గురువారం కుటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అఖిలను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. రానున్న రోజుల్లో క్రీడా పోటీలలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జల్ద లక్ష్మీనాథ్ ,అఖిల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ముజీబ్‌కు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన టీఎన్జీవో నాయకులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బక్రీద్ పండుగ సందర్భంగా టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని(ముజీబ్)ను గురువారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. విక్రమ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, పబ్లిక్ సిటీ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్ శంకర్, శ్రీధర్‌లు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి శాలువాతో సత్కారించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రప్రథమంగా ముందుకు వెళ్తుతుందని, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో జాంగీర్, ఏపీఆర్వో వహీద్, మహ్మద్, బాలాజీ గోస్వామి, బి.పరశురామ్, మహేష్ గౌడ్, జి.వెంకటేష్, చౌష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ముస్లిం సోదరుల బక్రీద్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బక్రీద్ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం సోదరులు చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాల యం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్, గాయకుడు సాయి చంద్ భౌతిక ఖాయానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-దుండిగల్



వ్యక్తి అవయవదానం





నవతెలంగాణ-సిటీబ్యూరో

బ్రెయిన్ డెడ్ అయి మరణించినా.. అవయవ దానం చేసి పునర్జన్మ ఎత్తాడు ఓ యువకుడు. కరీంనగర్ జిల్లా ఆర్నాకొండ గ్రామానికి చెందిన ఆవుల రవి చనిపోగా.. అతని అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. ఆవుల రవి (46) ఆటో నడుపుతూ జీవనం గడిపేవారు. అతడికి హై బీపీ కావడంతో కండ్లు తిరిగి కింద పడ్డాడు. దీంతో కరీంనగర్ జిల్లాలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చేర్పించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం సోమాజిగూడ యశోదా హాస్పిటల్‌కు తరలించారు. రవి శరీరం చికిత్సకు సహకరించలేదు. మెదడులో తీవ్ర రక్తస్రావం కావడం వల్ల బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ధృవీకరించి కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇలాంటి సమయంలో కూడా రవి కుటుంబ సభ్యులు ఉదారతను చాటుకున్నారు. జీవన్‌ధార్ ప్రొటోకాల్ ప్రకారం నలుగురు వ్యక్తులకు అవయవాలను కేటాయించారు. రవి భౌతికకాయానికి సోమాజిగూడ యశోదా హాస్పిటల్ సిబ్బంది, జీవన్‌ధాన్, కుటుంబ సభ్యులు నివాళి అర్పించి మృతునికి వీడ్కోలు పలికారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిజాంపేట్‌లోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బిఆర్ ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి. అనంతరం బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరు లు తమ అభిమాన నాయకుడిని ఆయన నివాసంలో కలిసి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ప్రజలందరికీ ఏకాదశి, బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-దుండిగల్



వండర్ కిడ్ అన్య గార్గ్ హైదరాబాద్‌లో సందడి

- **అతి పిన్న వయస్సులో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏడేండ్లకే అద్భుతమైన రచయిత్రిగా పేరుగాంచిన అన్య గార్గ్, తన అసాధారణమైన రచనా ప్రతిభతో సాహిత్య ప్రపంచం మనసులను గెలుచుకుని ఎన్నో ప్రశంసలను అందుకుంది. అన్య జూబ్లీహిల్స్ లోని రోడ్డు నెంబర్ 45లోని చట్నీ చో రెస్టారెంట్‌లో విలేకరుల సమావేశంలో తన ఆలోచనలను పంచుకుంది. ఈ సమావేశంలో అన్య గార్గ్‌తో పాటు తన తల్లి పూజ గార్గ్, తాత అజయ్ కుమార్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు. ఫాంటసీ నవలలు చదవాలనే తన ప్రేమే పుస్తకాలు రాయడానికి ప్రేరేపించిందని వెల్లడించింది. తనకంటూ ఆదర్శం ఎవరూ లేరన్నారు. పుస్తక పఠనాన్ని చాలా ఇష్టపడుతాననీ, నా దినచర్య కూడా అందిరి లాగే ఉంటుందనీ, కాకపోతే పుస్తకాలపై ఎక్కువ సమయం వెచ్చిస్తానని తెలిపారు. ఎక్కువగా ఊహాజనితమైన పుస్తకాలని ఇష్టపడుతానని తెలిపారు. అన్య తల్లి పూజ గార్గ్ మాట్లాడుతూ తొమ్మిదేండ్ల తన కూతురు ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతుందనీ, కొవిడ్ సమయంలో అలవాటైన పుస్తక పఠనం తనకు ఒక ఎడిక్షన్‌గా మారిందని అనుకున్నామే కానీ ఇదొక మంచి అభిరుచిగా పుస్తకాలు రాసే దిశగా వెళ్తుందని అనుకోలేదన్నారు. ఈ జోనర్‌లో 80కి పైగా పుస్తకాలను చదివిన ఆమె, తన స్వంత కథలను ఊహించుకుని రాయాలని భావించింది. అన్య వారానికోసారి లైబ్రరీని సందర్శించడం, అక్కడ పుస్తకాలను ఎంపిక చేసుకోవడం, సృజనాత్మకత, రచన పట్ల అభిరుచిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించింది.

నవతెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 30 జూన్ 2023

నాకు ప్రాణ హాని ఉంది



నవతెలంగాణ -బంజారా హిల్స్..

తనకు ఎంఎ కరీం అనే వ్యక్తితో ప్రాణహని ఉందని బాధితుడు మహ్మద్ అఫ్జల్ ఆరోపిం చారు. తనకు రక్షణ కల్పిస్తూ న్యా యం చేయాలని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ..ఆల్విన్ కాలనీ ఎల్లమ్మబండకు చెందిన ఎం.ఎ.కరీం అనే వ్యక్తికి 2019 సంవత్సరంలో ఒక ఇల్లు కొనుగోలు విషయంలో రూ.2.50లక్షలు చెల్లించానని చెప్పాడు. అయితే అంతకుముందే ఆ ఇంటిని మరో వ్యక్తికి అమ్మినట్టు సమాచారం రావడంతో తన డబ్బు తిరిగి ఇవ్వమని కోరగా 'ఏం చేసుకుంటావో చేసుకో నాకు చాలా పలుకుబడి ఉంది. నిన్ను చంపేస్తా' అంటూ బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై అతనిపై జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎఫ్ఐఆర్ నమోదై ఉందన్నారు.

కార్పొరేటర్ పూజలు



నవతెలంగాణ-ఓయూ

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్ సామల హేమ గురువారం పద్మారావు నగర్ లోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నామాలగుండులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు తొలి ఏకాదశి, బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తాన్ బజార్ : ఆషాడ మాస పూజా మహెూత్సవాల్లో భాగంగా గురువారం ఉస్మాన్ షాహీలోని జంగల్ విఠోబ దేవాలయంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బీసీ కమిషన్ చైర్మన్ వక్లాభరణం కృష్ణ మోహన్ రావు.మాజీ ఎంపీ ఎం.అంజన్ కుమార్ యాదవ్‌లు విఠలేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ కమిటీ చైర్మెన్ జి.శంకర్ యాదవ్ అధ్యక్షులు వి.కిషన్ యాదవ్, సత్యంయాదవ్, నిర్మల్‌కుమార్ యాదవ్‌లతో విఠలేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్నారు.

కార్మికులకు 'డబుల్' ఇండ్లు ఇవ్వాలి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసఫ్ గూడా సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్మికులకు డబల్ బెడ్రూం ఇండ్లు వెంటనే ఇవ్వాలని జీహెచ్ఎంసీ సీఐటీయూ నాయకులు కామ్రేడ్ నగేష్, తులసి బాయిలు డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ జోన్ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో బోరబండ సైట్‌టూలోని కమిటీ హాల్ ఎదురుగా గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ యూసుఫ్ గూడా సర్కిల్ పరిధిలో 600 మంది రోడ్లు ఊడ్చి శుభ్రం చేసే కార్మికులు, ఇంకొక 100 మంది ఇతరత్రా కార్మికులు సూపర్వైజర్లు ఉంటారని, వీరిలో 90 శాతం మందికి ఇల్లు లేవని తెలిపారు. వచ్చిన రూ. 14000 వేతనంలో సగం డబ్బులు ఇంట కిరాయికే వెళుతున్నాయని, మిగిలిన డబ్బులతోటి తాము, తమ కుటుంబాలు ఎలా బతకాలని ఆవేదన వెలిబుచ్చారు. వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామని అలాగే మొట్టమొదటిగా మున్సిపల్ కార్మికులకే డబల్ బెడ్రూమ్ ఇండ్లు ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు అది అందని ద్రాక్ష లాగనే ఉందన్నారు. ప్రజా సంఘాల నాయకులు టీ సాయి శేషగిరిరావు మాట్లాడుతూ, నగరంలో పది లక్షలకు పైగా మీ సేవలో అలాగే కలెక్టర్ ఆఫీసులో పేదలు ఇండ్ల కోసం దరఖాస్తులు పెట్టుకొని ఆఫీసులు చుట్టూ, నాయకులు చుట్టూ తిరుగుతున్నారని, వీరందరికీ వెంటనే ఇండ్లు కేటాయించాలని, ఇంటి స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజే యాలని డిమాండ్ చేశారు. కొత్తవారికి కూడా దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకునేందుకు అనుమతించాలని కోరారు. వచ్చే నెల 3న జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ఎదుట మహాధర్నాలో ఇల్లు లేని పేదలందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమలి బాయి, అనిత ,హనుమంతు, రాధా, మున్నిబాయి, శ్రీలక్ష్మి ,శాంతమ్మ, వినోద్ కుమార్ ,బాలయ్య, రికీ బాయి, నాగులు, లక్ష్మీ ,రేనా కష్ణ, గోపాల్, వరలక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో వసతి గృహాల నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయింపు



నవతెలంగాణ-ఓయూ

గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరస్పర అవగాహన ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా గిరిజన విద్యార్థుల వసతి గృహాల నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ రూ.20 కోట్లు కేటాయించింది. 300 మంది విద్యార్థినిల వసతి గృహం కోసం పది కోట్లు, మరో 300 మంది విద్యార్థుల వసతి గృహం కోసం మరో పది కోట్ల రూపాయలు విడుదల చేయనున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సుమారు 600 మందికి సరిపడే రెండు వసతి గృహాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ఒక్కో ఎకరం చొప్పున భూమిని ఓయూ కేటాయించింది.నిర్మాణ బాధ్యతలు పూర్తిగా గిరిజన సంక్షేమ శాఖనే చూసు కుం టుందని,ఈ మేరకు ఒప్పంద పత్రాలపై ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీనారాయణ, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిష్టినా జె.చోంగ్తు సంతకాలు చేసినట్లు తెలిపారు. యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ. మల్లేశం, ఎస్టీసెల్ డైరెక్టర్ ప్రొ. మంగు, ప్రొ. గోపాల్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

క్వాడ్రాఫుల్ కరోనరీ బైపాస్ సర్జరీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో క్వాడ్రాఫుల్ కరోనరీ బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మీడియా వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. కేర్‌ఆస్పత్రి కార్డియాక్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ నేతృత్వంలో వైద్య బృందం 50 ఏళ్ల రోగి హేమంత్‌కు కేవలం ధమని అంటుకట్టులను ఉపయోగించి నాలుగు రెట్ల కరోనరీ బైపాస్ సర్జరీని విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ... ద్వైపాక్షిక అంతర్గత క్షీరథ ధమని (బీఐఎంఎ) సాంకేతికత ఉపయోగించి చేసే మొత్తం ధమనుల కరోనరీ బైపాస్ శస్త్ర చికిత్స కరోనరీ ఆర్టరీ అడ్డంకులు ఉన్న రోగులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు. ప్రామాణిక కరోనరీ బైపాస్ సర్జరీలో బీఐఎంఎ సాంకేతికతతో నిర్వహించే ఈ విధానం వల్ల ప్రమాదం-1 శాతం కంటే తక్కువ అన్నారు.రోగులు భయపడకుండా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. అనంతరం హేమంత్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రస్తుత ఆరోగ్య స్థితి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి వైద్యుల బృందం రోగి సహాయకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్

ప్రొఫెసర్ కోదండరాం కు వినతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, స్కై ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్ తెలిపారు. గురువారం తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంను తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా నెలకొన్న గురునానక్, శ్రీనిధి యూనివర్సిటీలకు గవర్నర్ ఆమోదం లభించలేకపోవడం వల్ల యూనివర్సిటీలలో చేరిన ఐదు వేల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. అనుమతులు ఆలస్యమైతే ప్రతేక జీఓ ద్వారా విద్యార్థులను ఇతర కాలేజీలలో ఇతర యూనివర్సిటీలలో సర్దుబాటు చేసి, చదువు నష్టపోకుండా చర్యలు తీసుకునేలా గవర్నర్, ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకరావాలని విజ్ఞప్తి చేశారు.

వైద్య శిరోమణి అవార్డు-2023కు డాక్టర్ బి.జగన్మోహన్ ఎంపిక



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రముఖ వైద్య నిపుణులు గత 30 సంవత్సరాలుగా వైద్య రంగంలో పేద ప్రజలకు రోగులకు అపారమైన సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ బి.జగన్మోహన్‌కు జాతీ య వైద్యుల దినోత్సవం సందర్భంగా భార తరత్న డాక్టర్ బిసి.రాయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడాదికి రాష్ట్రం నుంచి ఒకే ఒక్కరికి ఇచ్చే వైద్య శిరోమణి అవార్డు 2023కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.రాజ్ నారాయణ్ ముదిరాజ్ నేడు ఒక పత్రికా ప్రకటనలు తెలిపారు. నిరు పేదల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించి వివిధ సంస్థల నుండి ఎన్నో అవార్డులను అందు కున్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవాన్ని బర్కత్‌పుర చౌరస్తాలో న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు నివాసంలో న్యాయ చాంబర్ ఆఫీసులో జులై,1న ఈ అవార్డును ప్రదానం చేస్తామన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు





నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఒక రోల్ మోడల్‌గా చేయడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అదం సంతోష్ కుమార్ అన్నారు. తన పుట్టినరోజు నేపథ్యంలో సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనానికి స్థానికులు, కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా టీపీసీసీ మాజీ అధ్యక్షులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీలు, టీపీసీసీ ప్రతినిధులుహాజరయ్యారు. ఉత్తమ్ కు మార్ మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రానున్న ఐదు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఉద్ఘాటించారు. కష్టపడి పనిచేసేవారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుంది, వచ్చే ఎన్నికల్లో సంతోష్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి బీజేపీ నుంచి సారంగపాని, వెంకటేష్ గౌడ్, కన్నబిరామ్, తెలుగుదేశం నుండి మహేందర్ యాదవ్, వైస్సార్ తెలం గాణ పార్టీ నుండి శిల్పా చారి, దక్షణ మధ్య రైల్వే ఎం ప్లాంస్ సంఘ్ భరణి, అరుణ్, నరేష్, బాబు నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు





నవతెలంగాణ-అంబర్ పేట

బక్రీద్ పర్వదినం సందర్భంగా అంబర్‌పేట ఎంసీఏ గ్రౌండ్‌లో ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థలతో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రార్థనలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్‌గౌడ్ ముస్లిం మత పెద్దలకు, ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దావూద్, షేక్ రఫీక్ ,షానూర్, యూసుఫ్‌బాబా, హైమద్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలకు తొలి ఏకాదశి, బక్రీద్ శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఓయూ

తొలి ఏకాదశి పర్వదినాన్ని పుర స్కరించుకుని కార్పొరేటర్ సా మల హేమ గురు వా రం పద్మారావు నగర్‌లోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నామాలగుండు లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. గురువారం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని మూడవసారి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఐక్యతకు ప్రతీక బక్రీద్

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్

మోతే శ్రీలత శోభన్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ ఈ పండుగ సమస్త మానవాళికి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్న ముస్లిం సోదర సోదరీమణులందరికి బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగ నిరతికి, ధర్మ నిబద్ధతకి ప్రతీక బక్రీద్ అన్నారు. అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆనం దోత్సాహాలతో బక్రీద్ జరుపుకోవాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి కోరుకున్నారు. తార్నాక డివిజన్ మైనారిటీ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, బి.ఆర్.ఎస్ కార్మిక విభాగ అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి గర్లను తమ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాజాపాషా, యాకూబ్ షరీఫ్, అలీ, ఫయాజ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-హిమాయత్ నగర్

బక్రీద్ (ఈద్ ఉల్ జూహ) పర్వ దినం సందర్భంగా ఎంఐఎం పార్టీ అధినేత ఓవైసీ అసదుద్దీన్‌కు కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ మం దగిరి స్వామి యా దవ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి గొంటి విక్రమ్ కుమార్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



బక్రీద్ వేడు కలను అంబర్‌పేటలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పులిజగన్, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజి తరెడ్డి ఉద్యమ నాయ కులు జీవన్‌గౌడ్ సీనియర్ నాయ కులు అంబర్ పేట ఈద్గాను సందర్శించి ముస్లిం మైనారిటీ లకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు.

ఐక్యతకు ప్రతీకగా నిలిచేవి పండగలు

- ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

అన్ని సాంప్రదాయాలు సంస్కృతులకు ఐక్యతే మూలమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం లోని అన్ని డివిజన్ల పరిధిలో బక్రీద్ పండుగ ప్రశాంతంగా ముగిసింది. జీహెచ్ ఎంసీ అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు వలన పండగ అద్భుతంగా జరిగిందని తెలిపారు. పూట బంజర హిల్స్ జూబ్లీహిల్స్ సోమాజిగూడ ఖైరతాబాద్ వెంకటేశ్వర కాలనీ డివిజన్ల పరిధిలో రహదారులపై బహిరంగంగానే తల కాయలు కాళ్లు కట్టెల పొయిలపై సిలిండర్లపై కాల్చడంతో పొగలతో వాహన చోధకులు కొంత ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఎదుర్కొన్నారు.

పార్ట్ టైమ్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పార్ట్ టైమ్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని పార్ట్ టైమ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వరలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి మహిళా విశ్వ విద్యాలయంలో ఎన్నో ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పార్ట్ టైమ్ అధ్యాప కులుగా పనిచేస్తున్నామ న్నారు. అన్ని అర్హతలు ఉన్న తమను జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకుల తరహాలోనే క్రమబద్ధీక రించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి వినతి పత్రం అందిం చారు. కవిత సాను కూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ కవిత, డాక్టర్ మోహన్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ సైదులు, దివ్య, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ లా కాలేజ్‌లో పార్కింగ్ సమస్య



నవతెలంగాణ-ముషీరాబాద్

బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల యాజమాన్యం కళాశాల ఆవరణలో పార్కింగ్ కల్పించాలని పలువురు విద్యార్థులు న్యాయవిభాగం ప్రిన్సిపల్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కళాశాలలో పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ తమ వాహనాలను అనుమతించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల యాజమాన్యం కార్లను కాలేజీ గ్రౌండ్‌లోకి అనుమతించక పోవడంతో ప్రధాన రోడ్డుపై పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, దాని మూలానా టాఫిక్ పోలీసులు చలాన విధిస్తున్నారన్నారు. కళాశాల సీట్ల కోసం అద్భుతమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ అని విశాలమైన పార్కింగ్ స్థలం అంటూ పబ్లిసిటీ చేస్తారు. కార్ పార్కింగ్ కోసం అడిగితే అది కేవలం డైరెక్టర్ల కోసమంటూ చెబుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉస్మానియా యూనివర్సిటీ లా డీన్, నూతన విద్యా మండలి చైర్మెన్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు.

ఆర్టీసీ జేఏసీ చైర్మెన్‌గా అశ్వద్ధామరెడ్డి, కన్వీనర్‌గా కె.హనుమంతు ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మెన్‌గా ఇ.అశ్వధామరెడ్డి, కన్వీనర్‌గా కే.హ నుమంతు ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మజ్దూర్ యూనియన్ టీఎంయూ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ టీజేఎంయు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఎన్ఎంయు బీఎంఎస్, ఐఎన్టీ యూ సీ, బహుజన వర్కర్స్ యూనియన్, టీఎస్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు.కో-కన్వీనర్‌గా ఎం.నరేం దర్, ఎర్ర స్వామి, కే.అబ్రహం, సుద్దాల సురేష్, బి.యాదగిరి, పున్న హరికిషన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు యాజ మాన్యం తక్ష ణమే వేతన సవరణ చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాల న్నారు. అధికారులు చట్ట వ్యతిరేక డ్యూటీలతో వేధింపులను మానుకొని వారికి రావాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

40 సంవత్సరాల శ్రమకు ఫలితం

- శ్రీకృష్ణ పెరల్స్ జ్యువెలరీస్

నవతెలంగాణ-బంజారా హిల్స్

గురువారం నగరంలోని ప్రముఖ నగల వ్యాపార సంస్థ శ్రీకృష్ణ పెరల్స్ జ్యువెలరీస్ కు సౌత్ ఇండియా లెజెండ్స్ అవార్డ్స్ అందజేశారు. 40 సంవత్సరాల శ్రమకు ఫలితం దక్కిందని మరింత మెరుగైన వ్యాపార వాణిజ్య కార్యక్రమాలు చేసుకోవడానికి ఇటువంటి అవార్డులు దోహదపడతాయని శ్రీకృష్ణ పెరల్స్ జువెలరీస్‌అధినేత దేవేంద్ర అగర్వాల్ తెలి పారు. సౌత్ ఇండియా లెజెండ్స్ అవార్డ్స్ సొంతం చేసుకోవడం ఆనందంగా ఉం దని తమ ప్రతిభాకు గుర్తిగా మీ అవార్డు లభించడం ఎంపిక చేయడం హర్షనీయమని అన్నారు.

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి



- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె వెంకట్, ఏం అడివయ్య
- ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న ఛల ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే వికలాంగుల మహాధర్నను జయప్రదం చేయా లని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జాతీయ వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె వెం కట్, ఏం అడి వయ్య మాట్లాడుతూ... దేశంలో వికలాంగు లకు రక్షణ లేకుండా ఉందని, మహిళా వికలాంగులు, బాలి కలు, మూగ, చెవిటి, మానసిక మహిళా వికలాం గులపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు జరుగుతున్నయన్నారు. వీటన్నింటినీ అరికట్టి వికలాంగులకు వారి కుటుంబ సభ్యు లకు భరోసా కలిపించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వికలాంగుల భద్రత కోసం ప్రత్యేక చట్టం చేయాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న ఇందిరా గాంధీ జాతీయ వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెం చాలని, 40శాతం వైకల్యం కలిగిన వికలాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఢిల్లీలో జూలై 10న జరుగుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికళ, ఏ రంగారెడ్డి,రాష్ట్ర నాయకులు రేమడల క్రాంతి కుమార్, శంకర్, రాజు పాల్గొన్నారు.

టీఎక్స్ హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

- ఏడు నెలల బాబుకు కొలిసిస్టేక్టమీ సర్జరీ విజయవంతం'
- డాక్టర్ డి.వి.ఎల్.నారాయణరావు



నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్‌లోని టీఎక్స్ ఆస్పత్రిలో జస్విక్ అనే ఓ ఏడు నెలల పసిబిడ్డకు 'కొలిసిస్టెక్టమీ సర్జరీ'ని డాక్టర్ డి.వి.ఎల్.నారాయణరావు విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏడు నెలల పసి పిల్లలకు చాలా అరుదుగా గాల్‌బ్లాడర్ రాళ్ళు తయారు అవుతాయని, అలాంటి సర్జరీని చేయడం ప్రపంచస్థాయి రికార్డుగా భావిం చాలన్నారు. వైద్య బృందం పిడియాట్రిక్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అర్జున్ రెడ్డి, డాక్టర్ నిఖిల్, అనస్తీషియన్ పోస్ట్ ఆపరేటివ్ క్రిటికల్ కేర్ వైద్య బృందం డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సందీప్ వైద్య బృందం సహాయంతో ఈ సర్జరీని విజయవంతం చేశామని ఆయన పేర్కొ న్నారు. ఈ సందర్భంగా టీఎక్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ రాజు, డాక్టర్ కీర్తికర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మేనేజ్మెంట్ టీం శ్రీకాంత్, కిషోర్‌కుమార్ తమ హాస్పిటల్‌లో ప్రపంచస్థాయి రికార్డుగా భావించాలని, ఇటువంటి సర్జరీని విజయ వంతంగా పూర్తి చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

'సేవల్లో నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ముందుంటుంది'



- ఇండోర్ స్టేడియంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

నవతెలంగాణ-ముషీరాబాద్

సేవా కార్యక్రమాలలో నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు వి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని జీహెచ్ ఎంసీ ఇండోర్ స్టేడియంలో ప్లేయర్ల విజ్ఞప్తి మేరకు నాయిని నరసింహారెడ్డి జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దివంగత నేత నాయిని నరసిం హారెడ్డిజీవితాంతం కార్మికులు, అణగారిన వర్గాల కోసం పని చేశారని గుర్తు చేశారు.నరసింహారెడ్డి ఆశయాల కోసం పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు బిక్షపతి యాదవ్, నేత శ్రీని వాస్, రేషంమల్లేష్,సిరిగిరి శ్యామ్ కుమార్, కార్తీక్ యాదవ్, అజ్జు వాలీబాల్ ప్లేయర్లు బొల్లం శ్రీనివాస్, సిహెచ్ వీరారెడ్డి పాల్గొన్నారు.

సాయి చంద్‌కు డిప్యూటీ మేయర్ నివాళులు



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఉద్యమ కారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్ మరణ వార్త తెలుసుకున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి హుటాహుటిన గుర్రం గుడలోని సాయి చంద్ నివాసానికి చేరుకొని ఆయన పార్థివ దేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించారు. తెలం గాణ ఉద్యమ సమయంలో తన ఆటపాటలతో ఉద్యమానికి ఊపిరి పోసిన సాయిచంద్ మతి కల్చివేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అతడి కుటు ంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రక టిస్తున్నట్టు పేర్కొన్నారు.

సాయిచంద్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ భౌతికకాయానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పూలమాలలు వేసి నివాళులర్పి ంచి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలంగాణ పీసీసీ అధికార ప్రతినిధిగా గౌరి సతీష్



నవతెలంగాణ-ధూల్‌పేట్

తెలంగాణ పీసీసీ అధికార ప్రతినిధిగా విద్యావేత్త సీనియర్ కాంగ్రెస్ నేత గౌరి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి ఉత్తర్వులు వెలు వరించారు. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా పాలన చేస్తోందన్నారు. ప్రజాసమస్యల పరిష్కార దిశగా నిరంతర ప్రక్రియగా తన గళాన్ని ప్రసార మాధ్యమాలు ద్వారా ప్రజలకు సమర్థంగా వినిపించడమే తన ధ్యేయమని పేర్కొన్నారు.



పిల్లల్ని పెంచండిలా...!

పెరుగుతున్న విజ్ఞానం వల్ల ప్రతి ఒక్కరికీ పిల్లలకి ఏం పెట్టాలి? ఎలా పెంచాలి? అనే విషయాల మీద స్పష్టమైన అభిప్రాయాలున్నాయి. అయితే అవి సరైనవేనా? పిల్లల్ని పెంచుతున్న తీరులో ఏమన్నా లోపాలున్నాయా? అని తరచి చూసుకుంటే.. ఉన్నాయనే అంటున్నారు పరిశోధకులు. అమెరికాకు చెందిన కొందరు సైకాలజిస్టులు చేపట్టిన పరిశోధనలో చాలా ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. ఒక అర్ధ శతాబ్దం కిందటితో పోలిస్తే ఇప్పటి పిల్లల్ని పెంచే తీరులో వచ్చిన మార్పులేంటి? అవి వారి వ్యక్తిత్వం మీద ఏ విధమైన ప్రభావం చూపుతున్నాయి? అనేవి ఇందులోని అంశాలు...

1970ల కాలంతో పోల్చుకుంటే ఉమ్మడి కుటుంబాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పిల్లలు ఏడ్చిన వెంటనే వారిని బుజ్జగించడం అంత మంచిది కాదన్న అభిప్రాయం బలపడిపోయింది. పిల్లల్ని ఎత్తుకుని కాకుండా ఏదొక చోట ఊయలలోనో, కారు సీట్ల మీదో పిల్లల్ని గంటల తరబడి ఒంటరిగా వదిలేస్తున్నారు. ఒకవేళ తమతో పాటు తీసుకువెళ్లినా కూడా 'బేబీ కేరియర్ల' సాయంతో కట్టేసి తీసుకువెళ్తున్నారు.

పిల్లల పెంపకంలో ఇలాంటి మానవీయ కోణాలు చెదిరిపోవడం వల్ల ఇప్పటి తరం దూకుడుగా, క్రూరంగా, జాలిదయ వంటి లక్షణాలకు అతీతంగా పెరుగుతున్నారని వాపోతున్నారు. పైగా చిన్నవయసులోనే ఉద్వేగం, కుంగుబాటు వంటి మానసిక సమస్యలతో సతమతమవుతున్నారని హెచ్చరిస్తున్నారు.

పిల్లలకు పెద్దల స్పర్శ తగులుతూ ఉండటం, తల్లిపాలను అందించడం, నలుగురైదురు చేతుల్లో పెరగడం, వారు ఏడ్చిన వెంటనే ఎత్తుకుని లాలించడం... వంటివి వారి మానసిక, శారీరక వికాసానికి అవసరం అంటున్నారు. పిల్లలు ఏడ్చిన వెంటనే వారిని లాలించడం అనేది వారి వివేకం మీద ప్రభావం చూపుతుందట. స్పర్శ, లాలనల వల్ల వారిలో ఒత్తిడి తగ్గి, భావోద్వేగాలను నియంత్రించుకునే నేర్పు అలవడుతుందట. ఇక బందీగా ఉంచకుండా స్వేచ్ఛగా మెలగనివ్వడం వల్ల చొరవ, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని చెబుతున్నారు. నలుగురి చేతుల్లో పెరగడం వల్ల విచక్షణ, వినయం, సహానుభూతి ఏర్పడతాయట.

మనలోని సహానుభూతి, విచక్షణ, స్వీయనియంత్రణ వంటి లక్షణాలను కుడివైపు ఉన్న మెదడు నియంత్రిస్తుందనీ... అది నిరంతరం మారుతూనే ఉంటుందనీ నిపుణులు చెబుతున్నారు. కాబట్టి జీవితంలో ఏ క్షణంలో అయినా సరే తల్లిదండ్రులు తమ పెంపకంలోని లోటుని గమనించి వారితో అనుబంధాన్ని దృఢపరచుకునే ప్రయత్నం చేస్తే పిల్లల్లో అనూహ్యమైన మార్పులు వస్తాయని సూచిస్తున్నారు.

తన బిడ్డ కోసం అన్వేషిస్తూ...



వందన కలగర, పానుగోటి స్మృతీరావు...

తన బిడ్డ సున్నితమైన చర్మాన్ని కాపాడుకోవడం కోసం ఒకరి అన్వేషన మొదలయ్యింది. ఆ ప్రయాణంలో మరో స్నేహహస్తం తోడయ్యింది. వెరసి కీబీ ఆర్గానిక్స్ బట్టల సంస్థ మరింత విస్తరించింది. అనేక ఆటుపోట్లను ఎదుర్కొని పదిమందికి ఉపాధి కలిగించే స్థాయికి ఆ సంస్థ ఎదిగింది. ఆ విజయ ప్రస్థానంలో వారు ఎదుర్కొన్న ఆటుపోట్లు, సాధించిన విజయాల గురించి మానవితో ఇలా పంచుకున్నారు...

వందన, స్మృతి... ఇద్దరూ హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో కలిసి చదువుకున్నారు. తర్వాత వందన అమెరికాలో ఫ్యాషన్ డిజైనింగ్‌లోనే పై చదువులు చదివారు. ఇండియా వచ్చాక పిల్లలకోసం ఫ్రీలాన్స్ డిజైనర్‌గా పనిచేసేవారు. అలా చేస్తున్నప్పుడు తన కూతురుకి అలర్జీలు రాకుండా మన దగ్గర సేంద్రీయనూలుతో చేసిన దుస్తులకోసం అన్వేషించారు. కానీ ఆమెకి నిరాశే ఎదురయింది. దాంతో ఇండియాలో పిల్లలకి ఎంతవరకు ఆర్గానిక్ దుస్తులు అందుతున్నాయోనని పరిశోధన చేసారు. ఈ పరిశోధనే 2016లో కీబీ ఆర్గానిక్స్ (KeeBee Organics) సంస్థ స్థాపించేందుకు దోహద పడింది.

రోల్ మోడల్‌గా నిలబడాలని

వందన పెండ్లయి, తన పాపను నర్సరీలో చేర్చేవరకూ ఇంటిపట్టునే ఉన్నారు. ఒకసారి పాపని "నువ్వు పెద్దయ్యాక ఏం చేస్తావూ!" అడిగితే వెంటనే "నీలాగా, నాన్నమ్మలాగా ఇంట్లోనే ఉంటాను" అంది. పాప సమాధానం విన్న వందన ఒక్కసారిగా షాక్ తిన్నారు. కేవలం ఇంట్లో ఉండే ఇల్లాలిగా కాకుండా ఏదైనా సాధించే గొప్పవ్యక్తిగా, తన పాపకు ఓ రోల్ మోడల్‌గా కనపడాలని నిర్ణయించుకున్నారు. అప్పుడే పిల్లల దుస్తులు తయారుచేసే సంస్థ ప్రారంభించాలనుకున్నారు. నిర్ణయమైతే తీసుకున్నారు కానీ అది అంత తేలిక కాదని అందులో దిగితే కానీ తెలీలేదు. అసలే వ్యాపారం కొత్త, ఎలాంటి అవగాహన లేదు. అయినా కుంగిపోకుండా ఆన్‌లైన్‌లో మొత్తం సమాచారం సేకరించుకున్నారు. బ్యాంక్ లోన్ తీసుకుని 2016లో కీబీ ఆర్గానిక్స్ సంస్థను రిజిస్టర్ చేసుకున్నారు. అలా మొదటి ఉత్పత్తి 2017లో బయట కొచ్చింది.

స్నేహితులిద్దరూ కలిసి

2018లో స్మృతి కూడా ఈ సంస్థతో కలిసారు. స్మృతి ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు పూర్తి చేసి క్యాంపస్ ప్లేస్ మెంట్‌లో ఉద్యోగం సాధించి చెన్నై వెళ్ళారు. ఆ తర్వాత బెంగుళూరులో ఉద్యోగం చేసారు. ఇలా ప్రొడక్షన్‌పై మంచి పట్టు సాధించారు. 2017లో స్నేహితులిద్దరూ అనుకోకుండా ఒకే సంస్థలో పనిచేశారు. అప్పటికే వందన కీబీ స్థాపించారు. అయితే ఒక్కరే చూసుకోవడం కొంచెం ఇబ్బందిగా అనిపించేది. ఆ సమయంలో స్మృతితో కలిసి కీబీని విస్తరింపజేయాలని అనుకున్నారు. వందన దుస్తుల డిజైనింగ్ చూసుకుంటే స్మృతి కంపెనీ ఉత్పత్తి, మార్కెటింగ్ వంటివి చూస్తారు. వీరి ఉత్పత్తులు గుజరాత్‌లోని గ్లోబల్ ఆర్గానిక్ టెక్స్ టైల్ స్టాండర్డ్ యూనిట్స్‌లో తయారుచేస్తారు. మామూలు దుస్తులకన్నా ఈ ఆర్గానిక్ దుస్తుల ధర మూడురెట్లు ఎక్కువ. ఈ సంస్థ కోసం ఇద్దరూ పెట్టుబడి పెట్టారు. ఎప్పటికప్పుడు మార్కెట్‌ని పరిశీలిస్తూ, అమ్మకాలను పెంచుకుంటూ, ఇంకా ఎటువంటి విధానాలతో తమ సంస్థను అభివృద్ధి చేయవచ్చో పరిశోధన చేస్తూనే ఉన్నారు.

చర్మానికి హాని లేకుండా...

కీబీ ఆర్గానిక్స్‌లో అప్పుడే పుట్టిన బిడ్డలనుంచి పదేండ్లలోపు బాలబాలికలకు సేంద్రీయ పద్ధతితో పండించిన పత్తి నుండి నేసిన బట్టతో కుట్టిన దుస్తులు తయారుచేస్తారు. ఈ బట్టలు ఎవరు ధరించినా హాని ఉండదు. ముఖ్యంగా పిల్లల చర్మం చాలా సున్నితం. రసాయ నాలతో పెంచిన నూలుతో చేసిన దుస్తులు వేస్తే ఒంటిమీద అలర్జీ వచ్చే అవకాశం ఎక్కువ. అందుకే వీరు పిల్లల కోసం ఈ ఆర్గానిక్ దుస్తులను ఉత్పత్తి చేస్తున్నారు.

అవగాహన కల్పించేందుకు

ఏ సంస్థ స్థాపించినా మొదట్లో కొన్ని సమస్యలు తప్పవు. అలాగే స్మృతీ, వందనా కూడా మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. మొదట్లో సేంద్రీక బట్ట సేకరించడం వీరికి చాలా కష్టంగా మారింది. చాలా ప్రయత్నం చేయగా ఆఖరికి గుజరాత్‌లోని ఓ యూనిట్ బట్ట పంపేందుకు ముందుకు వచ్చింది. మన దేశంలో పండించిన



ఆర్గానిక్ నూలు 80శాతం వేరే దేశాలకి ఎగుమతవుతుంది. మిగిలిన 20శాతంలో చాలా భాగం ఉత్తర భారతదేశంలో దుస్తులు తయారు చేయడానికి తీసుకుంటారు. దక్షిణ భారతదేశంలో అయితే ఇలాంటి సేంద్రీయనూలు అనేది ఒకటి ఉంటుందనీ, దానితో దుస్తులు తయారుచేస్తారనే అవగాహనే లేదు. దాంతో ఆర్గానిక్ కూరలూ, పండ్లతో పాటు ఆర్గానిక్ బట్టపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించే బాధ్యత వీరిద్దరూ తీసుకున్నారు. ఈ దుస్తులతో ఎగ్జిబిషన్లు పెట్టేవారు.

ఆన్‌లైన్‌తో లాభాలు

అప్పటివరకు వందన ఈ ఉత్పత్తులను బైటనుంచి తెచ్చి అమ్మేవారు. స్మృతీ ఈ కీబీ ఆర్గానిక్స్ సంస్థలో చేరాక 2019లో మియాపూర్, హైదరాబాదులో ఓ ఉత్పత్తి సంస్థను నెలకొల్పారు. దీనికి GOTS సర్టిఫికేట్ కోసం స్మృతి అలుపులేని కృషి చేస్తున్నారు. మొదట్లో వీరు కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే ఆర్డర్లు తీసుకునే వారు. చుట్టూ చీకటి అలుముకున్నప్పుడు గోరంతదీపం కొండంత వెలుగిస్తుందన్నట్టు 2019లో ప్రపంచాన్ని తలకిందులు చేసిన కోవిడ్ మహమ్మారి ఈ ఆన్‌లైన్ వ్యాపార సంస్థకి మంచి అవకాశాలను ఇచ్చింది. ఆ సమయంలో మంచి లాభాలు అందుకుంది. ఇప్పుడు పెద్ద పెద్ద షాప్‌లలో వీరి ఉత్పత్తులను పెట్టి ఆఫ్‌లైన్ మార్కెటింగ్ కూడా చేస్తున్నారు.

ఉమెన్స్ ఎంటర్ ప్రెన్యూయర్స్ ప్రోగ్రామ్‌లో

మొదట వీరు మియాపూర్‌లో కేవలం నలుగురు టైలర్స్‌తో మాత్రమే పని ప్రారంభించారు. ఇప్పుడు అందులో పన్నెండుమందికి ఉపాధి కల్పిస్తున్నామని గర్వంగా చెప్పారు. ఇలా వ్యాపారం చేస్తూ మరికొన్ని కుటుంబాలకి ఉపాధి అందించడం ఎంతో సంతోషంగా ఉందనీ, అందుకోసం ఎంత కష్టపడినా శ్రమ అనిపించదని అన్నారు. వీరు ఐ.ఐ.ఎమ్. బెంగుళూరులో జరిగే గోల్డ్ మెన్ సాచెస్ ఉమెన్స్ ఎంటర్ ప్రెన్యూయర్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొనడానికి ఎన్నుకోబడ్డారు.

నిర్ణయాధికారం కోసం

తమ మీద తమకు గల నమ్మకం, కష్టపడి పనిచేయడం, పని పట్ల ఆసక్తి, అభిరుచే వ్యాపారంలో తమ విజయానికి కారణమని ఇద్దరూ గర్వంగా చెబుతున్నారు. ఏ వ్యాపారానికైనా ఒడిదుడుకులు సాధారణం. కుంగిపో కుండా ఓర్పుతో అధిగమించాలని అంటున్నారు. కాలం తమ చేతిలోనే ఉందనీ, ఇంట్లోంచి పని చేసినా, ఆఫీస్‌కి వెళ్ళినా అంతా తమ నిర్ణయమేననీ, అలా నిర్ణ యాధికారం కోసం ఎంతో కష్టపడవలసుంటుం దనీ, దానిని ఆనందంగా స్వీకరిస్తామనీ ఆత్మ విశ్వాసంతో చెప్పిన వందన, స్మృతీరావుల విజయ గాథ భావి వ్యాపారవేత్తలకు ఆదర్శప్రాయం.

- జి.ఎస్.లక్ష్మి

మహిళ సాధించాలంటే...



ఒక మహిళ ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే ఒక్క భర్త సహకారమే సరిపోదు. మొత్తం కుటుంబమంతా ఆమెకు వెన్నుదన్నుగా ఉండాలి. అప్పుడే ఆ స్త్రీ ఏ పనైనా చేయగలదు. అందులోనూ ఉద్యోగం వేరూ, వ్యాపారం వేరూ. అటువంటి మహిళ లకు ఇంట్లో అందరి మద్దతు చాలా అవసరం. వందన పిల్లలిద్దరినీ ఆమె అత్తగారు ప్రేమగా చూసుకుంటున్నారు కనుకే ఆమె వ్యాపారం మీద దృష్టి పెట్టగలిగారు. అలాగే తన ఇంట్లోవారి పూర్తి సహకారంతో తన ఎనిమిదేండ్ల బాబుతో ఈ సాహసం చెయ్యగలుగుతున్నాని స్మృతి అంటున్నారు.



రాహుల్ కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

(మొదటిపేజీ తరువాయి)

కలవటం కోసం గురువారం ఉదయం ఆయన ఇక్కడకు వచ్చారు. 50 రోజులకు పైగా హింసతో అట్టుడుకున్న మణిపూర్‌లో పర్యటించిన తొలి ప్రతిపక్ష నేత రాహుల్ కావటం గమనార్హం.

అయితే రాహుల్ పర్యటనలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్ నుంచి అల్లర్లకు కేంద్రమైన చురాచాంద్‌పూర్‌కు ఆయన తన వాహన శ్రేణితో బయలు దేరారు. అయితే, పోలీసులు ఆయన కాన్వాయ్‌ను బిష్ణుపూర్ ప్రాంతంలో అడ్డుకున్నారు. దాడులు జరిగే అవకాశం ఉన్నదన్న కారణంతోనే ఆయన కాన్వాయ్‌ను అడ్డుకున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు. రాహుల్ కాన్వాయ్‌ను అడ్డుకోవటం తీవ్ర అలజడికి దారి తీసింది. పోలీసు చర్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు అక్కడ రోడ్డుపై కూర్చొని నినాదాలు చేశారు. రాహుల్ గంటల తరబడి బిష్ణుపూర్ ప్రాంతంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని అక్కడి వర్గాలు తెలిపాయి. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు లాఠీచార్జీ చేశారు. గ్రెనేడ్ దాడి జరిగే అవకాశం ఉన్నదని రాహుల్ కాన్వాయ్‌ను అడ్డుకున్నామని బిష్ణుపూర్ ఎస్పీ హీస్నం బలరామ్ సింగ్ తెలిపారు.

పోలీసు చర్యతో రాహుల్ కాన్వాయ్ ఆగిపోయింది. దీంతో ఆయన తిరిగి ఇంఫాల్‌లోని విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లతో సహాయశిబిరాల్లో తలదాచుకుంటున్న బాధితులను కలవటం కోసం ఆయన అక్కడి నుంచి మధ్యాహ్నం ప్రాంతంలో హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్‌కు వెళ్లారు. అక్కడ సహాయ శిబిరాలను ఆయన సందర్శించారు. ఆశ్రయం పొందుతున్నవారిని రాహుల్ కలిసి మాట్లాడారు.

ప్రభుత్వం నన్ను అడ్డుకోవటం దురదృష్టకరం : రాహుల్

తన కాన్వాయ్‌ను అడ్డుకోవటంపై రాహుల్ సైతం బీజేపీ సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లోని సోదర, సోదరీమణుల బాధను వినటానికి తాను ఇక్కడకు వచ్చాననీ, అయితే, తనను అడ్డుకున్నారని ఆయన అన్నారు. "ప్రభుత్వం నన్ను అడ్డుకోవటం దురదృష్టకరం. మణిపూర్‌కు చికిత్స అవసరం. శాంతి మాత్రమే మన ప్రాధాన్యం కావాలి" అని రాహుల్ ట్వీట్ చేశారు.

ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాదు : కాంగ్రెస్

రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను అడ్డుకోవటంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా అడ్డు కోవటం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని తెలిపింది. ప్రధాని మోడీ నిరంకుశ పద్ధతులను ఉపయోగిస్తున్నారని ఆరోపించింది. " ప్రభుత్వ చర్య పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. అన్ని రాజ్యాంగ మరియు ప్రజాస్వామ్య నిబంధనలను విచ్ఛిన్నం చేస్తుంది" అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ట్వీట్ చేశారు.

భారత్ జోడో యాత్ర స్ఫూర్తిగా మణిపూర్‌లో రెండు రోజులు పర్యటనలో భాగంగా అన్ని వర్గాలను వినడానికి రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నాలను ఎందుకు ఆపాలి అని కాంగ్రెస్ అగ్రనేత జైరామ్ రమేశ్ అన్నారు. పోలీసుల చర్య నియంతృత్వమని మణిపూర్ మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓక్రమ్ ఇబోబి సింగ్ ఆరోపించారు. తాము రాజకీయాల కోసం ఇక్కడకు రావటం లేదనీ, కష్టాల్లో ఉన్న ప్రజలను కలవటానికి, వారిని ఓదార్చడానికి ఇక్కడ ఉన్నామని స్పష్టం చేశారు.

బీజేపీ నిరాశకు అద్దం పడుతున్నది : టీఎంసీ

రాహుల్ కాన్వాయ్‌ను అడ్డుకోవటం బీజేపీ నిస్పృహకు అద్దం పడుతున్నదని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఆరోపించింది. బీజేపీ ప్రభుత్వానికి ఇవి చివరి రోజులు అని టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రెయిన్ అన్నారు.

బెంగళూర్‌లో ప్రతిపక్షాల రెండో సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాల్లో మతహింసను ప్రోత్సహించేందుకు జరుగుతున్న ఉద్దేశపూర్వక ప్రయత్నాలపై చర్చ జరిగినట్టు ఆయన తెలిపారు.

ఏండ్ల నిరీక్షణ.. ఫలించనున్నట్టేనా..!

(మొదటిపేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 2006అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13వ తేదీ నాటికి అటవీ భూముల్లో సాగులో ఉన్న వారికే హక్కుపత్రాలు లభిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అర్హులైన గిరిజన రైతులను ఎంపిక చేయడం వంటి ప్రక్రియలు పూర్తిచేసింది. నెల కిందటే హక్కు పత్రాలను సిద్ధం చేసినప్పటికీ వివిధ కారణాలతో వాటిని పంపిణీ చేయలేదు. తొలుత ఈ నెల 24వ తేదీన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారని ప్రచారం జరిగినా.. అనివార్య కారణాలతో పర్యటన రద్దయినట్టు తెలిసింది. శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనంతోపాటు వివిధ అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించనున్నారు. అక్కడే బహిరంగ సభలో పోడు భూముల హక్కుపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రంలో 4.50లక్షల ఎకరాలకే హక్కులు

రాష్ట్రంలో 4,50,601 ఎకరాలకుగాను 1,50,012 మంది లబ్దిదారులకు పోడు హక్కుపత్రాలు జారీ చేయనున్నట్టు తెలిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 37,401 మంది లబ్దిదారులకు హక్కుపత్రాలను అందించనున్నారు. ఇందులో ఎక్కువగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే లబ్దిదారులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో ఈ పోడు పట్టాలను జారీ చేయనున్నారు. పట్టాలు జారీ కావడంతో ప్రభుత్వపరంగా అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు తదితర పట్టాదారులకు దక్కాల్సిన ప్రయోజనాలన్నీ పోడుదారులకు లభించేందుకు ఆస్కారం ఉంటుంది. కనీ, ఈ ప్రయోజనాలు సగం మందికే చేకూరుతుండటం గమనార్హం. ఫలితంగా మిగిలిన ప్రజలు అసంతృప్తికి గురవడం సహజం. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ప్రతి ఏటా అటవీ అధికారులు, పోడుసాగుదారుల మధ్య జరుగుతున్న ఘర్షణలు ఇక ముందు కూడా కొనసాగే అవకాశమే ఎక్కువగా ఉంది.

గిరిజనేతరులకు నిరాశే..?

పోడు పట్టాల పంపిణీ కోసం గిరిజనేతరులు కూడా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. మూడు తరాలు (75ఏండ్లుగా) అటవీ భూములను సాగు చేసి ఉండాలని నిబంధన విధించింది. 1930కంటే ముందు నుంచి అటవీ ప్రాంతంలో ఉన్నట్టు ఆధారం చూపించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో పోడు పట్టాల కోసం 1.71లక్షల మంది గిరిజనేతరులు 4.36లక్షల ఎకరాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 1,02,606 ఎకరాల కోసం 32,119మంది గిరిజనేతరులు హక్కుపత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం తాజాగా హక్కుపత్రాల పంపిణీలో వీరిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో అనేక మంది గిరిజనేతరుల్లో అసంతృప్తి కనిపిస్తోంది.

కమలంలో ట్వీట్ వార్

(మొదటిపేజీ తరువాయి)

ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జితేందర్‌రెడ్డి వివాదాస్పద పోస్టు దేనికి సంకేతం అని బీజేపీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నది. ఆ పోస్టు ఈటల రాజేందర్, రాజగోపాల్‌రెడ్డిలను ఉద్దేశించి పెట్టినదే అని ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేదనీ, ఇలాగైతే ఎన్నికల్లో ముందుకెళ్లడం కష్టమైన నేపథ్యంలో ఏదో ఒకటి చేయాలని అధిష్టానానికి వారిద్దరూ అల్టిమేటం జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే విషయంపై రాష్ట్రంలో బీజేపీ నేతలు రెండు గ్రూపులుగా చీలిపోయారు. ఇటీవల జితేందర్‌రెడ్డి ఇంట్లో బండి అనుకూల నేతలంతా కలిసి మాట్లాడుకుని ఈటల, రాజగోపాల్‌రెడ్డి వ్యవహార శైలిని తీవ్రంగా ఖండించిన విషయమూ విదితమే. ఇదంతా గతం ముచ్చట. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి నియమితం కాబోతున్నారనీ, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి ఇవ్వబోతున్నారని మీడియాకు కొందరు లీకులిచ్చారు. దీన్ని బండి, కిషన్‌రెడ్డి, తరుణ్‌చుగ్ ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఖండించాల్సి వచ్చింది. ఈటల గ్రూపు వాళ్లే ఇలాంటి లీకులు వదులుతున్నారనే ప్రచారమూ ఉంది. తాజాగా బీజేపీలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలోనే బండి సంజయ్‌ని సపోర్టు చేసేలా జితేందర్‌రెడ్డి ట్వీట్ చేసినట్టు తెలుస్తున్నది. ఇదే సందర్భంలో బీజేపీ నుంచి ఈటల, రాజగోపాల్‌రెడ్డిలను పొమ్మనకుండానే పొగబెట్టి బయటకు పంపే కుట్ర జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో క్రమశిక్షణతో నడుస్తామని చెప్పుకునే బీజేపీలో ఇలాంటి పరిస్థితులు రావడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. కాంగ్రెస్ పార్టీలో మాదిరిగానే పదవుల కోసం పాకులాడే సంస్కృతి, నచ్చని నేతలను తొక్కిపడేసే పరిస్థితి దాపురించిందని వాపోతున్నాయి. పార్టీలో చేరిన వలస నేతల వల్లనే పార్టీలో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని హార్డ్‌కోర్ బీజేపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతిమంగా జితేందర్‌రెడ్డి ట్వీట్..ఉప్పునిప్పుగా చీలిపోయిన నేతల మధ్య మరింత దూరం పెంచే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

విదేశీ పర్యటనకు రాష్ట్ర మంత్రులు, ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మెన్ వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్ విదేశీపర్యటనకు బయలుదేరారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్, సింగపూర్‌లో ఉన్న పర్యాటక కేంద్రాలను అధ్యయనం చేయడానికి వెళ్లారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ రసమయి బాలకిషన్, ఇరిగేషన్ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, నీటిపారుదల శాఖ అధికారులు, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు దక్షిణ కొరియాలోని సియోల్ నగరం, సింగపూర్‌లలో ఉన్న అధునాతన పరిజ్ఞానంతో రూపొందించిన పర్యాటక ప్రదేశాలను సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయడానికి ఉన్నత స్థాయి బందం గురువారం సాయంత్రం నుంచి జులై 7వ తేదీ వరకు విదేశీ పర్యటన కొనసాగనుంది. ఇదిలా ఉండగా విదేశీపర్యటనలో ఆయా పర్యాటకప్రాంతాల్లో అధ్యయనం చేసిన అంశాలను మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో అమలు చేయనున్నారు. అందులో భాగంగానే మొట్టమొదటిసారిగా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న కేబుల్ బ్రిడ్జ్, రోప్‌వే, ట్యాంక్ బండ్‌లతో పాటు మ్యూజికల్ ఫౌంటెన్, లేజర్ షో, జెయింట్ వీల్, వేవ్‌పూల్, వాటర్ రైడ్స్, వాటర్ గేమ్స్‌లను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

గాయకుడు, గిడ్డంగుల శాఖ చైర్మెన్ సాయిచంద్ హఠాన్మరణం

నవతెలంగాణ–బడంగ్‌పేట్/వనస్థలిపురం

గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. సాయిచంద్(39) బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కారుకొండలోని తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అర్ధరాత్రి గుండెపోటు రావడంతో నాగర్‌కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. సాయిచంద్‌కు భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి తరలించారు. సాయిచంద్ మృతదేహానికి సీఎం కేసీఆర్ పుష్పాంజలి ఘటించారు. సీఎం కన్నీరు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాయిచంద్ భార్య రజనీ "సార్ సాయిని పిలువండి. లెమ్మనండి.. మీరు పిలిస్తే లేచివస్తాడు..సార్.." అంటూ హృదయవిదారకంగా రోదించడంతో సీఎం భావోద్వేగానికి గురయ్యారు. సాయిచంద్ తండ్రిని సీఎం అక్కున చేర్చుకొని ఓదార్చారు. తానున్నానంటూ భరోసా ఇచ్చారు. కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



తరలివచ్చిన అభిమానులు

సాయిచంద్ మృతి విషయం తెలుసుకున్న అభిమానులు, కళాకారులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. సాయిచంద్ అమర్ హై అంటూ నినాదాలు చేస్తూ మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ఈ సందర్భంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీలు రంజిత్‌రెడ్డి, జోగినపల్లి సంతోష్ కుమార్, ఉద్యమ నాయకులు కోదండరామ్, కేశవరావు జావేద్, శంభుపూర్ రాజు, కౌశిక్ రెడ్డి, రసమయి బాలకిషన్, పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, జైపాల్ యాదవ్, గువ్వల బాల్‌రాజ్, రాజయ్య, బాల్క సుమన్, ప్రకాష్‌గౌడ్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ప్రణాళిక సంఘం చైర్మెన్ వినోద్ కుమార్, ఎర్రోల్ల శ్రీనివాస్, మధుసూదనాచారి, అల్లం నారాయణ, ప్రజా గాయకులు గద్దర్, విమలక్క, సుద్దాల అశోక్ తేజ, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, నాగర్ కర్నూలు జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బాలాజీ సింగ్, తదితర ప్రజాప్రతినిధులు నివాళు లర్పించారు.

ముగిసిన అంత్యక్రియలు

సాయిచంద్ మృతదేహానికి బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో మంత్రులు నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరేశం, జెడ్పీ చైర్మెన్ తీగల అనిత రెడ్డి, అధికార ప్రతినిధి దాసోజ్ శ్రవణ్, ఉద్యమకారులు మాధవరం నరసింహ, బీఆర్ఎస్ బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ నాయకుడు చంద్రకాంత్‌గౌడ్ పాల్గొన్నారు. శ్మశాన వాటిక వద్ద ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తంరెడ్డి, వనస్థలిపురం సీఐ జలంధర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాయిచంద్ అంత్యక్రియలో పాల్గొన్న సీపీఐ(ఎం) నేతలు

ప్రముఖ గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సాయిచంద్ నివాసంలో ఆయన మృతదేహానికి రాష్ట్ర నాయకులు పూలమాలలేసి నివాళి అర్పించారు. సాయిచంద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సాంస్కృతికరంగంలో పాట ఉన్నన్నీ రోజులు సాయిచంద్ పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని, రాష్ట్రం గొప్ప ఉద్యమకారున్ని కోల్పోయిందని అన్నారు. సాయిచంద్ అంత్యక్రియల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సాగర్, డిజి.నర్సింహారావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, నాయకులు కిషన్, శ్యామ్, చంద్రమోహన్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పాయల్ గుప్తా, నరేన్, బి.గోపాల్

మెప్పించే సరికొత్త కథ..

నటుడు జయ ప్రకాష్ రెడ్డి కూమార్తె మల్లికా రెడ్డి నిర్మాతగా శ్రీ జయప్రకాష్ రెడ్డి ప్రొడక్షన్స్ (జెపి ప్రొడక్షన్స్) బ్యానర్ పై ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఊరికి ఉత్తరాన' ఫేం నరేన్ వనపర్తి కథానాయకుడిగా మల్లికార్జున్ రెడ్డి దర్శకత్వంలో రూపొందనున్న ఈ నూతన చిత్ర ప్రారంభోత్సవం గురువారం గ్రాండ్‌గా జరిగింది. పాయల్ గుప్తా కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి దర్శకులు బి.గోపాల్ క్లాప్ కొట్టగా, నిర్మాత బెక్కం వేణుగోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. డైరెక్టర్ త్రినాథరావు నక్కిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా హీరో నరేన్ వనపర్తి మాట్లాడుతూ,"ఊరికి ఉత్తరాన' తర్వాత నేను చేస్తున్న సినిమా ఇది. నా రెండో సినిమాకి జయ ప్రకాష్ రెడ్డి ఆశీస్సులతో వారి కుమార్తె మల్లికా రెడ్డి సినిమాలో చేయడం సంతోషంగా ఉంది. నాపై నమ్మకంతో ఈ సినిమాని నిర్మిస్తునందుకు వారికి కృతజ్ఞతలు. ఇది యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. కథ కొత్తగా ఉంటుంది' అని తెలిపారు.

'దర్శకుడిగా ఇది నా రెండో సినిమా. యూత్‌ఫుల్ ఎలిమెంట్స్‌తో మంచి ఎంటర్‌టైనర్‌గా దీన్ని తెరకెక్కించ బోతున్నాం. మంచి టీం కుదిరింది. 70శాతం షూటింగ్ తెలంగాణ, ఆంధ్రాలో జరుగుతుంది. మిగతాది కేరళలో చేస్తాం. ఆగస్టు నుంచి షూటింగ్ మొదలుపెడతాం' అని దర్శకుడు అవినాష్ కొకటి చెప్పారు. నిర్మాత మల్లికారెడ్డి మాట్లాడుతూ, 'నాన్న ఆశయాలని ముందుకు తీసుకెళ్లాలని నిర్మాణంలోకి వచ్చాను. మా నాన్నకి ఫస్ట్ హీరో బి.గోపాల్. 'సమరసింహారెడ్డి'లో చేసిన పాత్ర నాన్నకి ఎంతో పేరు తీసుకొచ్చింది. బి గోపాల్ క్లాప్ కొట్టడం చాలా ఆనందంగా ఉంది. అలాగే సురేష్ బాబు బెస్ట్ విషెస్ అందించారు. హీరో నరేన్ చాలా పాజిటివ్ పర్సన్. జెపీ ప్రొడక్షన్స్‌లో నిర్మిస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించేలా కృషి చేస్తాం' అని అన్నారు. నరేన్ వనపర్తి, పాయల్ గుప్తా జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి డీవోపీ: శివ, ఆర్ట్: రవి కుమార్ గుర్రం, ఎడిటర్ : కార్తిక్ శ్రీనివాస్, ప్రొడక్షన్ కంట్రోలర్ : ఆర్ సాయి మహేష్ మణి.

మూడు వేర్వేరు కాలాల్లో జరిగే సినిమా

సాహస్, దీపిక నటించిన ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ '7:11 పిఎం'. బుధవారం ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ చూస్తుంటే భారీ సినిమాలకి ఉన్న వీఎఫ్ఎక్స్ కనిపించాయి. చాలా ఆసక్తికరంగా ఉంది. సినిమాని చాలా ప్యాషన్‌తో నిర్మించిన టీంకి అందరికీ నా అభినందనలు. టైం ట్రావెల్ కాన్సెప్ట్, సౌండ్, విజువల్స్ చాలా బావున్నాయి. జూలై 7న ఈ సినిమా వస్తోంది. అందరూ థియేటర్‌లో తప్పకుండా చూడండి' అని అన్నారు.

'ఈ సినిమాలో కొన్ని సీన్స్ చూపించారు. వీఎఫ్ ఎక్స్ చాలా అద్భుతంగా ఉన్నాయి. ఒక పెద్ద సినిమాకి చేసేలా... వావ్ అనేలా ఉంది. కొత్త దర్శకుడనే భావన రాకుండా చాలా అనుభవం ఉన్న దర్శకుడిలా తీశారు. సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

దర్శకుడు చైతు మాదాల మాట్లాడుతూ, 'టీజర్, ట్రైలర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా వీటి కంటే నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. ఇది మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఈ కథ రాయడానికి ఏడాదిన్నర పట్టింది. చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఒక టౌన్, రెండు గ్రహాలు, మూడు కాలాలు.. ఇది సినిమా లాగ్ లైన్. వీటిని ఎలా కనెక్ట్ చేశామనేది సినిమా చూస్తున్నప్పుడు చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అన్ని రకాల ఎలిమెంట్స్ ఉన్న సినిమా ఇది. దీపిక, సాహస్ చాలా చక్కగా నటించారు. మైత్రీ రవి ఒక మంచి సినిమాకి సపోర్ట్ ఇవ్వాలని బ్యాక్ బోన్‌గా నిలబడ్డారు. వారికి కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా ఒక గ్రహాన్ని రూపొందించాం. అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఖచ్చితంగా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. హీరో సాహస్ మాట్లాడుతూ,'మైత్రీ రవి, హరీష్ శంకర్‌కి కృతజ్ఞతలు. చైతు చాలా ప్యాషన్ ఉన్న డైరెక్టర్. ఈ ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. మా నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు' అని చెప్పారు. ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ హౌస్ మైత్రి ద్వారా జూలై 7న భారీగా విడుదల కానున్న ఈచిత్రానికి నిర్మాత – నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి, సంగీతం – గ్యాని, డీవోపీ – శివ శంకర్ / ఫాబియో కాపోడివెంటో, ఎడిటర్ – శ్రీను తోట.



నవచిత్రం

ఫ్యాన్‌కు ఫుల్ ట్రీట్ బ్రో..

పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'బ్రో'. ఈ చిత్రానికి సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకులు త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్‌తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ స్థాయిలో నిర్మిస్తోంది.

ఈ సినిమా జూలై 28న విడుదల కానున్న నేపథ్యంలో ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలు నటించిన టీజర్‌ను గురువారం మేకర్స్ ఆవిష్కరించారు. 'చీకటిలో చిక్కుకొని ఒకరి సహాయం కోరుతున్న సాయి ధరమ్ తేజ్ వాయిస్‌తో టీజర్ మొదలవుతుంది. అతను వారిని 'మాస్టర్', 'గురు', 'తమ్ముడు' అని రకరకాలుగా సంబోధిస్తాడు. చివరకు 'బ్రో' అని పిలుస్తాడు. ఆ తర్వాత పెద్ద ఉరుము


పవన్‌కళ్యాణ్, సాయిధరమ్ తేజ్

పవన్ కళ్యాణ్ రాకకు స్వాగతం పలుకుతుంది. 'తమ్ముడు' సహా తన ఇతర హిట్ చిత్రాలను గుర్తు చేస్తూ, టీ గ్లాస్ పట్టుకుని, పవర్ స్టార్ అనేక రకాల లుక్స్‌లో కనిపిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఓం లాకెట్ ధరించి, మనోహరమైన చిరునవ్వుతో కనిపించారు. ఆ తర్వాత కూలీ దుస్తులు ధరించి 'కాలం మీకు అంతు పట్టని ముడి జాలం' అంటూ సాయి ధరమ్ తేజ్‌కి స్వాగతం పలికారు. అల్లరిగా కనిపించే సాయి ధరమ్ తేజ్‌తో ఆయన సరదాగా ఆడుకుంటారు. గిటార్ పట్టుకుని పార్టీలో డ్యాన్స్ చేయడం నుండి స్టార్‌ల మధ్య హాస్య సంభాషణల వరకు అభిమానులతో విజిల్ వేయించే అద్భుతమైన మూమెంట్స్ టీజర్‌లో ఎన్నో ఉన్నాయి. 'సినిమాలు ఎక్కువ చూస్తావేంట్రా నువ్వు' అంటూ కారులో పవన్ కళ్యాణ్ చెప్పే డైలాగ్‌తో టీజర్‌ని ముగించిన తీరు బాగుంది. తమన్ ఆకట్టుకునే నేపథ్య సంగీతం, అందమైన విజువల్స్, పవన్ కళ్యాణ్ అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో.. జూలైలో వెండితెరపై విందు ఖాయమనే నమ్మకాన్ని కలిగిస్తుంది టీజర్. ఇందులో టైటిల్ పాత్రధారి 'బ్రో'గా పవన్ కళ్యాణ్ నటిస్తుండగా, మార్క్ అకా మార్కండేయులుగా సాయి ధరమ్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. తన మేనల్లుడితో పవన్ కళ్యాణ్ నటిసున్న మొదటి సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి' అని చిత్ర బృందం తెలిపింది.

కుక్కని పెళ్ళి చేసుకుంటే?

'స్లమ్ డాగ్ హస్బెండ్' చిత్ర ట్రైలర్‌ను గురువారం హీరో కళ్యాణ్‌రామ్ రిలీజ్ చేశారు. 'పిట్ట కథ' సినిమాతో తెరంగేట్రం చేసిన యువ నటుడు సంజయ్ రావ్ 'స్లమ్ డాగ్ హస్బెండ్' అనే కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా వైవిధ్యమైన కామెడీ ఎంటర్టైనింగ్ కథతో రాబోతోందని ఈ చిత్ర ట్రైలర్ చెప్పకనే చెప్పింది.

స్లమ్ ఏరియాలో ఉండే ఒక అమ్మాయి, అబ్బాయి పెళ్లి కోసం తాపత్రయం పడే సీన్లతో ట్రైలర్ స్టార్ట్ కాగా, ఆ తరువాత ఈ ట్రైలర్ మొత్తం చాలా డిఫరెంట్‌గా కొనసాగింది. ఆ అమ్మాయి, అబ్బాయి పెళ్లి చేసుకోవాలి అంటే ఆ అబ్బాయికి ఒక గండం ఉందడంతో తాను ఆ కారణం వల్ల మొదటిగా కుక్కని పెళ్లి చేసుకోవడం, ఇక కుక్కని పెళ్లి చేసుకున్నాక ఆ గండం గట్టెక్కింది అనే నమ్మకంతో హీరోయిన్‌ని పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు కోర్టులో మొదటి భార్య (కుక్క) బతికి ఉండగా రెండో భార్యని ఎలా చేసుకుంటారు అని కేసు పెట్టడంతో ఈ ట్రైలర్ మరింత ఆసక్తిగా మారింది. ఇక ఈ ట్రైలర్ చూశాక ప్రేక్షకులకు ఇది వింతగా అనిపించడమే కాకుండా ఎగ్జైట్‌మెంట్‌ని కూడా పెంచేయడం ఖాయం. ముఖ్యంగా ట్రైలర్ మొత్తం మంచి కామెడీతో ఆద్యంతం ఈ సినిమా ప్రేక్షకులను చూసినంత సేపు నవ్విస్తూ ఉంటుంది అనే క్లారిటీ ఇచ్చేసింది. అంతేకాదు ఈ ట్రైలర్‌లో బ్రహ్మాజీ, సప్తగిరి, ఆలీ తమదైన శైలిలో కామెడీని పండించారు.



సరైన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ స్లమ్ డాగ్ హస్బెండ్ సినిమాకి ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించగా, మైక్ మూవీస్ బ్యానర్ పై అప్పి రెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించబోతున్నారు.

సంజయ్ రావ్, ప్రణవి మానుకొండ, బ్రహ్మాజీ, సప్తగిరి, రఘు కారుమంచి, యాదమ్మ రాజు, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్:: సురేష్ రెడ్రౌతు, కాస్ట్యూమ్స్:: తేజ, నరేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:: రమేష్ కైగురి, డిఓపి : శ్రీనివాస్ జె రెడ్డి, ఎడిటర్: ఎ. వైష్ణవ్ వాసు, సంగీత దర్శకుడు: భీమ్స్ సిసిరోలియో, సహ నిర్మాతలు:: నిహార్ దేవెళ్ల, ఎం.కె.చైతన్య పెన్మెత్స, చింతా మెర్వాన్, ప్రకాష్ జిర్రా, రవళి గణేష్, సోహం రెడ్డి మన్నెం, నిర్మాతలు:: అప్పి రెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి, కథ-స్క్రీన్ ప్లే-మాటలు-దర్శకత్వం:: ఏ ఆర్ శ్రీధర్.

ఇంటెన్స్ లవ్‌స్టోరీ

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ముఖ్య పాత్రధారులుగా నటించిన మూవీ 'బేబీ'. 'కలర్ ఫోటో' లాంటి నేషనల్ అవార్డ్ సినిమాను ప్రొడ్యూస్ చేసిన సాయి రాజేష్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ ఫీల్ గుడ్ లవ్ స్టోరీ నుంచి విడుదలైన టీజర్, సాంగ్స్ ఇప్పటికే సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి మొదటి వీడియో గ్లిమ్స్ వచ్చిన దగ్గరి నుంచే ఈ చిత్రం పై ప్రేక్షకులందరికీ ఆసక్తి నెలకొంది. ఇక ఆ తర్వాత వచ్చిన ప్రతి సాంగ్ తెలుగు సినీ ప్రియులను బాగా ఆకట్టుకుంటూ వచ్చింది. దీంతో ఈ చిత్రంపై ఎక్స్పెక్టేషన్స్ రెట్టింపు అయ్యాయి. ఈ సినిమా జూలై 14న విడుదల కానుంది. ఇదే విషయాన్ని గురువారం ప్రసాద్ ఐ-మాక్స్ దగ్గర దాదాపు 70 అడుగుల విడుదల తేదీ పోస్టర్‌తో మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్ర టీజర్, సాంగ్స్ లాగానే కొత్త పోస్టర్ డిఫరెంట్‌గా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంది.


విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య, ఆనంద్ దేవరకొండ

ఈ విడుదల తేదీ పోస్టర్ లాంచ్‌కి ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్యతో పాటు ఈ చిత్ర దర్శకుడు సాయి రాజేష్, నిర్మాత ఎస్‌కేఎన్, కో ప్రొడ్యూసర్ ధీరజ్ హాజరయ్యారు. ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీతో అందరికీ నచ్చే అంశాలతో జూలై 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు మేకర్స్ తెలిపారు.విడుదల తేదీ దగ్గర పడుతూ ఉండడంతో ఈ చిత్ర ట్రైలర్‌ని వచ్చే వారంలో విడుదల చేయనున్నట్టు, అలానే ఈ చిత్ర ప్రమోషన్స్‌ని మరింత జోరుగా కొనసాగించనున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి దర్శకత్వం: సాయిరాజేశ్, సంగీతం : విజయ్ బుల్గానిన్, ఎడిటింగ్ : విప్లవ్ నైషధం, సినిమాటోగ్రఫీ : ఎమ్ఎన్ బాల్‌రెడ్డి.

ముస్లింలు, ఎస్సీలపై వివక్ష రెట్టింపు

కనీస ప్రాథమిక సౌకర్యాలకూ నోచుకోని వైనం

స్కూళ్లు, ఆస్పత్రులు వంటి సదుపాయాలు అందని దుస్థితి

- మోడీ పాలనలో ఇదీ భారత్ పరిస్థితి
- దార్ట్‌మౌత్ కాలేజీ అధ్యయనం

'సబ్‌కా సాత్, సబ్‌కా విశ్వాస్' అంటూ ఇటీవలి అమెరికా పర్యటనతో పాటు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మోడీ అనేక సార్లు ప్రసంగాలు వినిపిస్తున్నారు. మోడీ చెప్తున్నట్టు భారత్‌లో మాత్రం అలాంటి పరిస్థితులు కనిపించటం లేదు. కేంద్రంలోని బీజేపీ పాలనలో దళితులు, ముస్లింలు ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులే ఇందుకు నిదర్శనం. మోడీ సర్కారు కేంద్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, ముస్లింలు అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. వారి భద్రత, సామాజికాభివృద్ధి కోసం కల్పించిన రిజర్వేషన్లు, ప్రత్యేక చట్టాలను నీరుగార్చే ప్రయత్నాలను మోడీ ప్రభుత్వం గతంలో చేసిన విషయం విదితమే. ఇప్పుడు అదే మోడీ పాలనలో దేశంలోని ఎస్సీలు, ముస్లింలు ఇప్పటికీ కనీస సౌకర్యాలకు నోచుకోలేక రెట్టింపు వివక్షను ఎదుర్కొంటున్నారని ఒక అధ్యయనం వెల్లడిస్తున్నది.



న్యూఢిల్లీ : బీజేపీ పాలనలో భారత్‌లోని దళితులు, ముస్లింలకు రక్షణ లేకపోవటమే కాదు.. పట్టణ ప్రాంతాల్లో వారి మీద వివక్ష కూడా రెట్టింపు స్థాయిలో ఉన్నది. వారు పాఠశాలలు, ఆస్పత్రులు వంటి సదుపాయాలకు నోచుకోలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాలు, గ్రామాల్లో ఎస్సీలు, ముస్లింలు నివసిస్తున్న పరిస్థితులపై ఐదేండ్ల సుదీర్ఘ అధ్యయనం నిర్వహించిన యూఎస్ డార్ట్‌మౌత్ కాలేజీలోని డెవలప్‌మెంట్ డేటా ల్యాబ్ ఈ విషయాన్ని వెల్లడించింది.

అధ్యయనంలో భాగంగా 15 లక్షల మంది పట్టణ, గ్రామీణ ప్రాంతాలను కవర్ చేసింది. ప్రభుత్వ శ్రద్ధ కొరవడి.. మౌలిక సదుపాయాలకు నోచు కోకపోవటంతో ఇతర వర్గాలతో పోలిస్తే ఎస్సీలు, ముస్లింలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిపోతున్నారని సామాజిక వేత్తలు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ అధ్యయనం ప్రకారం.. షెడ్యూల్ కులాలు, ముస్లిం వర్గాల జీవన విధానాలు ఎక్కువగా వేరు చేయబడుతున్నాయి. కనీస ప్రాథమిక సౌకర్యాలైన శుద్ధమైన నీరు, మరుగుదొడ్లు, మురుగుకాలువలు, పాఠశాలలు, ఆస్పత్రులు వంటివి వారికి సరిగ్గా అందటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నప్పటికీ.. పట్టణ ప్రాంతాల్లో ముస్లింల పరిస్థితి అయితే దారుణంగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లోలాగానే ఎస్సీలకూ పట్టణ ప్రాంతాలూ వేరు చేయబడ్డాయి. ఇది ముస్లింల విషయంలో మరింత అధికంగా ఉన్నది.

అనేక సౌకర్యాలకూ ఎస్సీలు, ముస్లింలు దూరంగానే నెట్టివేయబడుతున్నారు. పైపు ద్వారా నీటి సరఫరా, అంతర్గత డ్రైనేజీ, పాఠశాలలు, హెల్త్ క్లినిక్‌లు వంటివి ముసింలు, ఎస్సీలు నివసించే ప్రాంతాలకు దూరంగా కేటాయించబడటం గమనార్హం. స్కూళ్లు, క్లినిక్‌లు వంటి విషయాల్లో ముస్లింలు నివసించే పరిసర ప్రాంతాల్లో ప్రతికూలత.. ఎస్సీలుండే ప్రాంతాల కంటే రెట్టింపు ఉన్నది. విద్యుత్, నీరు, డ్రైనేజీ, గూడ్స్ విషయాల్లో ఎస్సీలు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొంటున్నారు.

మోడీ పాలనలో ఎస్సీలు, ముస్లింలపై వివక్ష పెరిగిపోయిందని సామాజిక విశ్లేషకులు, కార్యకర్తలు వెల్లడించారు. ఎస్సీలు, ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేసే ప్రయత్నాలను బీజేపీ చేసిందని వారు గుర్తు చేశారు. తినే తిండి, వేసుకునే బట్టలు మొదలుకొని ప్రతి ఒక్క విషయంలోనూ బీజేపీ, దాని అనుబంధ హిందుత్వ సంస్థలు వారిని టార్గెట్ చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో ముస్లింల పట్ల వివక్ష ఎలా ఉన్నదో తెలుసుకోవటానికి అంతర్జాతీయ నాయకులు, జర్నలిస్టులు ప్రపంచ వేదికలపై చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనమని సామాజిక విశ్లేషకులు చెప్పారు.

కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేయాలి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాష్ట్ర విభజన చట్టం 13వ షెడ్యూల్, సెక్షన్ 93 లో పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జులై 8న రాష్ట్రానికి రావాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మంత్రుల నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సహా రాష్ట్ర ప్రజలు నాలుగు దశాబ్దాలుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం పోరాటాలు చేస్తూ ఎదురు చూస్తున్నారని తెలిపారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కాకుండా కేవలం వ్యాగన్ల మరమ్మతులు చేసే సెంటర్‌ను మాత్రమే ప్రారంభించేందుకు ప్రధాని హోదాలో మోడీ కాజీపేటకు రావటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. కోచ్ ఫ్యాక్టరీ మాత్రమే ఏర్పాటు చేయాలని, ఇది రాష్ట్ర ప్రజల హక్కు అని ఆయన స్పష్టం చేశారు.

గత నాలుగు దశాబ్దాలుగా కేంద్రంలోని కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ విషయంలో దాగుడు మూతలు ఆడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో రైల్వే శాఖ మంత్రిగా ఎవరు ఉన్నా వారు రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను వారి వారి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారనీ, ఇదేనా..? జాతీయ సమైక్యతా స్ఫూర్తి అంటే అని ప్రశ్నించారు.

ఆటలు

నాకైతే అర్థం కాలేదు!

రహానెకు వైస్ కెప్టెన్సీపై గంగూలీ



కోల్‌కత : కరీబియన్ పర్యటనలో భారత టెస్టు జట్టుకు అజింక్య రహానె వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సుమారు 18 నెలలు జాతీయ జట్టుకు దూరమైన అజింక్య రహానె.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తిరిగి చోటు దక్కించుకున్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన రహానెకు వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌లో ప్రమోషన్ లభించింది. ఏడాదిన్నర పాటు అవసరం లేదని పక్కనపెట్టిన ఆటగాడికి పునరాగమనంలోనే వైస్ కెప్టెన్సీ అందించడానికి వెనుక ఉన్న కారణాలు నాకు అర్థం కాలేదని భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అన్నాడు. గురువారం కోల్‌కతలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ చర్చాగోష్టిలో మాట్లాడారు. 'యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ వంటి వారిని నాయకత్వ గ్రూప్‌లోకి తీసుకోవాలనే ఆలోచనతో ఏకీభవిస్తాను. రహానెను 18 నెలలు పక్కనపెట్టారు. ఇప్పుడు పునరాగమనంలో వైస్ కెప్టెన్‌ను చేశారు. దీని వెనుక సెలక్షన్ కమిటీ ఆలోచనలు నాకు అర్థం కాలేదు. సెలక్షన్ కమిటీ నిర్ణయాలు ఎప్పుడూ హాట్ అండ్ కోల్డ్ తరహాలో ఉండకూడదు. జట్టు ఎంపికలో నిలకడ, కొనసాగింపు అవసరం.జట్టులో సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా అందుబాటులో ఉన్నాడు. టెస్టు జట్టులో అతడు నిలకడగా రాణిస్తున్నాడు. జడేజాకు ఆ బాధ్యతలు అప్పగించాల్సిందని' గంగూలీ అన్నాడు.

ఇక చతేశ్వర్ పుజారాను తప్పించటం వెనుక సెలక్షన్ కమిటీ ఉద్దేశాలు కనిపిస్తున్నాయి. వందకు పైగా టెస్టులు ఆడిన సీనియర్ ఆటగాడిని తప్పించా లనుకున్నప్పుడు ఆ సమాచారం స్పష్టంగా తెలియ జేయాలి. పుజారా వంటి ఆటగాడిని ఇప్పుడు తప్పించి, మళ్లీ జట్టులోకి తీసుకోవటం సరికాదు. ఇదే రూల్ అజింక్య రహానెకు సైతం వర్తిస్తుంది. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనుకున్నప్పుడు ఆ విష యం స్పష్టం చేసి.. ముందుకు సాగాలి. సీనియర్ ఆటగాళ్లతో సెలక్షన్ డైలామా ఉండకూడదు.

ఇక సర్ఫరాజ్ ఖాన్ పేస్ బౌలింగ్‌ను ఆడలేడనే వాదనలో నిజం లేదు. పేస్‌ను ఎదుర్కోలేనిదే.. రంజీ ట్రోఫీలో ఇన్ని పరుగులు చేయలేడు. యువ ఆట గాడు యశస్వి జైస్వాల్ దేశవాళీలో గొప్ప ప్రదర్శన చేశాడు. సెలక్షన్ కమిటీ జైస్వాల్‌ను ఎంపిక చేసి మంచి పని చేసింది. సర్ఫరాజ్ ఖాన్‌కు సైతం సెలక్షన్ కమిటీ అవకాశం కల్పించాలని గంగూలీ పేర్కొన్నాడు.

చీఫ్ సెలక్టర్‌గా అగార్కర్?

- ఐపీఎల్ ఫ్రాంచైజీ వదులుకున్న అజిత్
- ముంబైకర్ ఎంపిక ఇక లాంఛనమే



ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆల్ ఇండియా సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్‌గా మాజీ క్రికెటర్, ముంబైకర్ అజిత్ అగర్కార్ ఎంపిక కావటం లాంఛనంగా కనిపిస్తుంది. సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మెన్‌గా వరుసగా రెండోసారి ఎంపికైన చేతన్ శర్మ.. ఓ టెలివిజన్ ఛానల్ శూల శోధనలో వివాదాస్పద వ్యాఖ్యలతో పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి చీఫ్ సెలక్టర్ పదవి ఖాళీగా ఉండగా.. తాజాగా బీసీసీఐ దరఖాస్తులు ఆహ్వానించింది.

చీఫ్ సెలక్టర్ పదవికి దరఖాస్తు చేసిన అజిత్ అగార్కర్..ఇటీవల క్రికెట్ సలహా సంఘం (సీఏసీ) ఎదుట ఇంటర్వ్యూకు సైతం హాజరైనట్టు సమాచారం. దిలీప్ వెంగ్‌సర్కార్, రవిశాస్త్రి పేర్లు సైతం చీఫ్ సెలక్టర్ పదవి రేసులో వినిపించినా.. ఆ ఇద్దరు దరఖాస్తు చేసినట్టు ఎటువంటి సమాచారం లేదు. దిలీప్ వెంగ్‌సర్కార్ గతంలోనే చీఫ్ సెలక్టర్‌గా పని చేశారు. ఓ సెలక్టర్ సెలక్షన్ కమిటీ ప్యానల్‌లో గరిష్టంగా నాలుగేండ్లు పని చేసేందుకు అర్హుడు. వెంగ్‌సర్కార్ గతంలో మూడేండ్ల పాటు చీఫ్ సెలక్టర్‌గా కొనసాగారు. చేతన్ శర్మ సెలక్షన్ ప్యానల్‌లో సెలక్టర్‌గా చేరేందుకు అజిత్ అగర్కార్ ఆసక్తి చూపినా.. ముంబయి క్రికెట్ సంఘం (ఎంసీఏ) అడ్డుచెప్పినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. అజిత్ అగర్కార్ సెలక్షన్ కమిటీలో ఉండగా చేతన్ శర్మను చీఫ్ సెలక్టర్‌గా కొనసాగించటం సైతం బోర్డుకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. దీంతో అజిత్ అగార్కర్‌ను గతంలో సెలక్టర్ పదవికి పరిగణనలోకి తీసుకోలేదు. ఇక తాజాగా ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ సహాయక కోచ్ బాధ్యతల నుంచి అజిత్ అగార్కర్ తప్పుకున్నారు. దీంతో అజిత్ అగర్కార్ చీఫ్ సెలక్టర్ బాధ్యతలు చేపట్టడం ఖాయంగా అనిపిస్తుంది.

వేతనం పెంపు?

సుదీర్ఘ విరామం అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం కలిగిన మాజీ క్రికెటర్ చీఫ్ సెలక్టర్‌గా రానుండటంతో.. సెలక్షన్ కమిటీ వేతనాలను బీసీసీఐ సవరించే అవకాశం ఉంది. ప్రస్తుతం చీఫ్ సెలక్టర్ ఏడాది రూ. 1 కోటి, ఇతర సెలక్టర్లు ఏడాదికి రూ.90 లక్షలు వేతనంగా అందుకుంటున్నారు. చీఫ్ సెలక్టర్ వేతనం రూ. 2 కోట్లు, సెలక్టర్ వేతనం రూ.1.5 కోట్లకు పెంపుదల ప్రతిపాదనలు బోర్డు ముందు ఉన్నట్టు సమాచారం.

బంగ్లా పర్యటనకు అమ్మాయిలు


మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్

ముంబయి : భారత మహిళల క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ ఆడనుంది. జులై తొలి వారంలో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లనున్న భారత వైట్‌బాల్ జట్టు.. అక్కడ మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లో పోటీపడనుంది. జులై 9న తొలి టీ20తో పొట్టి సిరీస్ ఆరంభం కానుండగా.. జులై 16, 19, 22న వన్డేలు జరగనున్నాయి. గత తొమ్మిదేండ్లలో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లటం భారత్‌కు ఇది తొలిసారి. గత పర్యటనలో టీ20 సిరీస్‌ను 3-0తో స్వీప్ చేసిన టీమ్ ఇండియా అమ్మాయిలు.. ఈ సారి వన్డే సిరీస్‌లోనూ ఆడనున్నారు.

చీఫ్ కోచ్‌గా మజుందార్! : రమేశ్ పోవార్ నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు బదిలీ అనంతరం.. భారత మహిళల జట్టుకు చీఫ్ కోచ్ లేడు. హృషికేశ్‌కు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ (ఫిబ్రవరి) సెమీఫైనల్లో ఓడిన భారత్.. ఆ తర్వాత మరో సిరీస్ ఆడలేదు. తాజాగా క్రికెట్ సలహా సంఘం (సీఏసీ) నిర్వహించిన ఇంటర్వ్యూకు మాజీ క్రికెటర్లు అమోల్ ముజుందార్, తుషార్ అరోతె, జాన్ లెవిస్‌లు హాజరయ్యారు. ముంబయి మాజీ కోచ్ అమోల్ ముజుందార్ చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. బంగ్లా పర్యటనకు చీఫ్ కోచ్‌తోనే భారత జట్టు వెళ్లనుంది.

టాప్-100లో భారత్

ఐదేండ్లలో తొలిసారి వందలో..



న్యూఢిల్లీ : భారత ఫుట్‌బాల్ జట్టు ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఎగబాకింది. గత ఐదేండ్లలో తొలిసారి టాప్-100లోకి అడుగుపెట్టింది. గత ఏడాది ఇదే సమయంలో 104వ స్థానంలో నిలిచిన భారత్.. తాజాగా వరుసగా రెండు ఏఫ్ఏ టోర్నీలో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ఫిఫా తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఫుట్ బాల్ జట్టు (మెన్స్) 100వ స్థానంలో నిలిచింది. లెబనాన్, న్యూజిలాండ్‌లను వెనక్కి నెట్టిన టీమ్ ఇండియా..ఐదేండ్లలో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. ఫిఫా ప్రపంచకప్ చాంపియన్ అర్జెంటీనా అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. ఫ్రాన్స్, బ్రెజిల్, ఇంగ్లాండ్, బెల్జియం, క్రోయేషియా, నెదర్లాండ్స్, ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ టాప్-10లో కొనసాగుతున్నాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

రెట్టింపైన క్రెడిట్ కార్డ్ల ఎన్‌పిఎలు

- 18 శాతానికి చేరిన నిరర్థక ఆస్తులు
- చెల్లింపుల్లో భారీగా విఫలం : ఆర్‌బిఐ వెల్లడి



న్యూఢిల్లీ : క్రెడిట్ కార్డ్లపై ఆధారపడే సంస్కృతి బాగా పెరిగింది. బ్యాంక్‌లు కూడా అడగ్గానే క్రెడిట్ కార్డ్లను జారీ చేస్తున్నాయి. తీరా వాడుకున్న తర్వాత ఆదాయాలు లేక, అధిక వడ్డీ రేట్ల బెంబేలుతో అనేక మంది తిరిగి చెల్లించలేకపోతున్నారు. దీంతో క్రెడిట్ కార్డ్ల నిరర్థక ఆస్తులు భారీగా పేరుకుపోతున్నాయి. ఈ రంగంలో కేవలం ఒక్క ఏడాదిలోనే రెట్టింపు ఎన్‌పిఎలు నమోదు కావడం ఆందోళనాకరం. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ కార్డ్ ఎన్‌పిఎలు 18 శాతానికి ఎగిశాయని ఆర్‌బిఐ గణంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే కాలంలో దాదాపు 9 శాతంగా ఉంది. 2022 సెప్టెంబర్ నాటికి 15 శాతంగా నమోదయ్యాయి. ఈ వివరాలను ఆర్‌బిఐ తన ఆరు మాసాల ఆర్థిక స్థిరత్వ నివేదికలో వెల్లడించింది.

క్రెడిట్ కార్డ్లు, వ్యక్తిగత రుణాలు, మైక్రోఫైనాన్స్ సహా అసురక్షిత రుణాలపై ఆర్‌బిఐ గణంకాలు హెచ్చరికలను జారీ చేశాయి. మరోవైపు ప్రయివేటు రంగ బ్యాంక్‌ల క్రెడిట్ కార్డ్ల ఎన్‌పిఎలు యథాతథంగా 1.9 శాతంగా, విదేశీ బ్యాంక్‌ల కార్డ్ల ఎన్‌పిఎలు 1.8 శాతంగా చోటు చేసుకున్నాయి. భారత బ్యాంకింగ్ వ్యవస్థలో 2023 మార్చి ముగింపు నాటికి మొత్తం ఎన్‌పిఎలు 3.9 శాతం తగ్గి.. పదేళ్ల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయి. 2024 మార్చి ముగింపు నాటికి 3.6 శాతానికి తగ్గొచ్చని అంచనా. అధిక ద్రవ్యోల్బణం, రుణ ఖర్చులు పెరగడం వల్ల కుటుంబాల ఆర్థిక స్థితి, వారి రుణాల చెల్లింపు సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆర్‌బిఐ విశ్లేషించింది. ఇది రుణాలు ఇచ్చే బ్యాంకులపై ఒత్తిడి పెంచనుందని పేర్కొంది.

కోల్ ఇండియాతోనే ధరల స్థిరత్వం

- పిఎస్‌యుగానే కొనసాగించాలి : చైర్మెన్ ప్రమోద్ అగర్వాల్ వెల్లడి



న్యూఢిల్లీ: కోల్ ఇండియాను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని ఆ కంపెనీ చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ అన్నారు. భవిష్యత్తులోనూ బొగ్గు ధరల్లో స్థిరత్వం ఉండాలంటే కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) పిఎస్‌యుగానే ఉండాలని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులో బొగ్గు ధరల కోసం ప్రత్యామ్నాయ పద్దతి అందుబాటులో ఉంటుందన్నారు. జూన్ 30న (నేటి)తో ఆయన పదవీకాలం ముగియనుంది. ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థగా, బొగ్గు ఉత్పత్తి ప్రయోజనాలను ప్రజలకు పంపిణీ చేసే బాధ్యత కోల్ ఇండియాపైనే ఉందన్నారు. "గత సంవత్సరం అంతర్జాతీయంగా బొగ్గు ధరల్లో తీవ్రమైన ధరల పెరుగుదలను చూశాము. అటువంటి పరిస్థితిలో ప్రయివేటు కంపెనీలు కూడా తమ ధరలను పెంచేవి. అయితే, కోల్ ఇండియా వంటి పిఎస్‌యుకు అలాంటి పరిస్థితి వచ్చే అవకాశం లేదు" అని అగర్వాల్ అన్నారు. ఇటీవల మోడీ సర్కార్ కోల్ ఇండియాలో 3 శాతం వాటాను ప్రయివేటు శక్తులకు విక్రయించడం ద్వారా రూ.4,185 కోట్లు తన ఖజానాలో వేసుకుంది. దీంతో సిఐఎల్‌లో ప్రభుత్వ వాటా 63.1 శాతానికి తగ్గింది.

నైకా నుంచి తొలి సన్‌స్క్రీన్ లోషన్



హైదరాబాద్ : ప్రముఖ సౌందర్య సాధానాల ఉత్పత్తి సంస్థ నైకా తొలిసారి నైకా స్కిన్‌ఆర్‌ఎక్స్ పేరుతో సన్‌స్క్రీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇందులో రెండు వేరియంట్లను ఆవిష్కరించినట్లు పేర్కొంది. వీటితో వినియోగదారుల చర్మం సూర్యరశ్మిని ఎదుర్కోగలదని, నీలి కాంతి నుండి కూడా రక్షించనుందని తెలిపింది. 50 గ్రాముల ధర రూ. 780గా నిర్ణయించినట్లు తెలిపింది.

డిసెంబర్ కల్లా వెయ్యి హోటళ్లను జోడిస్తాం : ఓయో

న్యూఢిల్లీ : హాస్పిటలిటీ టెక్నలాజీ ప్లాట్‌ఫాం ఓయో 2023 డిసెంబర్ ముగింపు నాటికి కొత్తగా 1000 హోటళ్లను జోడించనున్నట్లు తెలిపింది. అక్సలేరేటర్ ప్రోగ్రామ్ కింద మరింత విస్తరణ చేపట్టనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న యాజమానుల సహకారం తీసుకోనున్నట్లు పేర్కొంది. మార్చిలో ఈ ప్రోగ్రామ్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా 300 హోటళ్లను చేర్చుకున్నట్లు ఓయో చీఫ్ మర్చంట్ ఆఫీసర్ అనుజ్ తేజ్‌పాల్ తెలిపారు. కొత్త మార్కెట్లకు విస్తరించడానికి రూ.10 కోట్ల వ్యయం చేయనున్నామన్నారు.

కీర్తిలాల్స్‌కు 'మోస్ట్ ప్రిఫర్డ్ వర్క్స్' అవార్డ్



హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ సంస్థ కీర్తిలాల్స్ జ్యువెల్స్ మోస్ట్ ప్రిఫర్డ్ వర్క్స్ 2023-24 అవార్డ్‌కు ఎంపికయినట్లు తెలిపింది. టీం మార్క్స్ మెన్ నిర్వహించిన పరిశోధన, పరిశ్రమ వ్యాప్తంగా సేకరించిన సమాచార విశ్లేషణ ఆధారంగా ఎంపిక చేసినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డ్‌ను కీర్తిలాల్స్ డైరెక్టర్ క్రియేటివ్ సీమా మెహతా, గ్రూప్ హెచ్‌ఆర్ హెడ్ ఆర్ సంగీతలకు ప్రముఖ నటుడు గోవింద, టీం మార్క్స్ మెన్ నెట్వర్క్ సిఇఒ రాజేష్ ఖుబ్‌చందానిలు అందజేశారని పేర్కొంది.

క్రెడాయ్ తెలంగాణ నూతన కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రెడాయ్ నూతన కార్యాలయాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వి.ప్రశాంత్ రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు జి.రంజిత్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే డి.సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రెడాయ్ తెలంగాణ చైర్మెన్ సీహెచ్.రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ రంగంలో ప్రగతిని సాధించేందుకు అవసరమైన శిక్షణ, నైపుణ్యాన్ని అందించనున్నట్టు తెలిపారు. అధ్యక్షులు డి.మురళీక్రిష్టారెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో స్థిరాస్తి క్రమబద్ధమైన వృద్ధిని నిర్ధారించడానికి అవసరమైన నైపుణ్యాలు నేర్పించనున్నట్టు తెలిపారు. ప్రెసిడెంట్-ఎలెక్ట్ ఇ.ప్రేంసాగర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా డెవలపర్లకు ఈ కేంద్రం మార్గదర్శకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యదర్శి కె.ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్త కార్యాలయం అత్యాధునిక సౌకర్యాలను అందిస్తుందని తెలిపారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో 4,401 మంది వెబ్‌ఆప్షన్ల నమోదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియలో గురువారం 12,751 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. 67,110 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు వచ్చేనెల ఐదో తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. గురువారం నాటికి 4,401 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని వివరించారు. వచ్చేనెల ఆరు వరకు ధ్రువపత్రాల పరిశీలన, ఎనిమిదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.:// tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

యూసీసీపై విస్తృత చర్చలు అవసరం

అన్ని మతాలపై ప్రభావం చూపుతుంది

- దానిని మత రాజకీయాల నుండి విడదీయండి
- ఆంగ్ల పత్రికల సంపాదకుల మనోగతం

న్యూఢిల్లీ : ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) కేవలం ముస్లింల పైన మాత్రమే ప్రభావం చూపదని ఆంగ్ల పత్రికల సంపాదకులు అభిప్రాయ పడ్డారు. అది అన్ని మతాల వారి పైన ప్రభావం చూపుతుందని, అందువల్ల దానిపై ఏ నిర్ణయమైనా తీసుకునే ముందు విస్తృత స్థాయిలో చర్చించాల్సి ఉంటుందని వారు సూచించారు. యూసీసీని మత రాజకీయాల నుండి వేరు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. యూసీసీపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా జాతీయ లా కమిషన్ ఇటీవలే దేశ ప్రజలను కోరింది. ఈ నేపథ్యంలో వివిధ ఆంగ్ల పత్రికలు దానిపై సంపాదకీయాలు ప్రచురించాయి. దేశ పౌరులందరి పైనా ప్రభావం చూపే ఇలాంటి అంశాలను రాజకీయ నిర్బంధాలు శాసించకూడదని సంపాదకులు స్పష్టం చేశారు.

ఒకే గాట కట్టొద్దు

రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు హామీలను, యూసీసీని ఒకేలా చూడరాదని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలిపింది. 'మిగిలిన రెండు హామీలను నెరవేర్చిన విధంగానే లోక్‌సభ ఎన్నికల లోగా మూడో హామీని కూడా నెరవేర్చాలని బీజేపీ అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. అయితే యూసీసీ భిన్నమైనదని ఆ పార్టీ గుర్తించాలి. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది.

యూసీసీ భిన్నమైనదన్న విషయాన్ని బీజేపీ నాయకత్వం గుర్తించాలి. ఎందుకంటే అది దేశ పౌరులందరినీ స్పృశిస్తుంది. వారి జీవన విధానంలోకి, వ్యక్తిగత జీవితాలలోకి తొంగిచూస్తుంది. మత రాజకీయాలతో కూడిన వాతావరణంలో గుడ్డిగా నిర్ణయాలు తీసుకోకుండా సంయమనం పాటిస్తూ, అందరినీ సంప్రదించి నిర్ణయానికి రావాలి. యూసీసీ అనేది ముస్లింల పైనే కాదు. హిందువులు, ఇతర మైనారిటీలు, గిరిజనుల పైన కూడా ప్రభావం చూపుతుంది' అని తన సంపాదకీయంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అభిప్రాయం వ్యక్తం చేసింది.

తొందరపాటు తగదు

ఆధిపత్య మతానికి సంబంధించిన చట్టాలకు యూసీసీ బ్లూప్రింట్ మాదిరిగా పనిచేస్తుందన్న ఆందోళన ఉందని హిందుస్థాన్ టైమ్స్ తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. మైనారిటీలు తమ సంస్కృతీ సంప్రదా యాలను కాపాడుకోకుండా ఇది నిరోధిస్తుందని తెలిపింది. 'వివాహం, విడాకులు, వారసత్వం, నిర్వహణ వంటి విషయాలలో మహిళలను బలహీనుల్ని చేస్తుంది. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వ్యక్తిగత చట్టాలు ఉల్లంఘించేలా ఉండకూడదు. యూసీసీపై నిర్ణయం తీసుకునే ముందు విస్తృతంగా సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు.

జాగరూకతతో, అనుభవంతో, రాజనీతిజ్ఞతతో, దయతో ముందడుగు వేయాల్సి ఉంటుంది' అని హిందుస్థాన్ టైమ్స్ సంపాదకీయం తెలిపింది.

విద్వేష రాజకీయాలు... హిందూత్వ సిద్ధాంతం

లోక్‌సభ ఎన్నికల అజెండాగా ఉమ్మడి పౌరస్మృతి

- బక్రీద్‌నూ వదలని బీజేపీ నేతలు

న్యూఢిల్లీ : వచ్చే సంవత్సరం జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాని నరేంద్ర మోడీ అజెండాను నిర్దేశించడం మొదలు పెట్టారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అస్త్రాన్ని ఎక్కుపెట్టారు. అదే రాబోయే ఎన్నికలలో బీజేపీ ప్రధాన అజెండా అని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అవి లోక్‌సభ ఎన్నికలైనా కావచ్చు లేదా ఈ సంవత్సరంలోనే జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలైనా కావచ్చు. బీజేపీ అజెండా ఏమిటంటే విద్వేష రాజకీయాలు, హిందూత్వ సిద్ధాంతం. ఈ అస్త్రం సృష్టికర్త మోడీయే.

యూసీసీకి అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు మోడీ ప్రయత్నాలు ప్రారంభించారు. దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే అత్యున్నత న్యాయ స్థానం ఉన్నాయని, దేశమంతా ఒకే కుటుంబంగా ఉంటోందని, అలాంటప్పుడు రెండు చట్టాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అయితే మణిపూర్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్న విషయాన్ని ఆయన విస్మరించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మే 3వ తేదీ నుండి ఆ రాష్ట్రం అల్లర్లతో అట్టుడికిపోతోంది. అయినా ఆయన ఎందుకు మౌనం వహిస్తున్నారంటే ఆ రాష్ట్రం నుండి లోక్‌సభలో ఎక్కువ స్థానాలు లేవు. అక్కడ ఇప్పట్లో అసెంబ్లీ ఎన్నికలు కూడా లేవు. అందుకే ఆయన మధ్యప్రదేశ్ వెళ్లి లోక్‌సభ ఎన్నికల అజెండాను నిర్దేశించారు. ఈ సంవత్సరం చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ కూడా ఉంది మరి.

గొర్రెలు కొనాలంటేనే భయం

యూసీసీకి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని మార్చేందుకు ఓ వైపు ప్రయత్నిస్తూనే మరోవైపు ముస్లింలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు బక్రీద్ పండుగ కంటే మరో మంచి అవకాశం రాదని భావించారు. గొర్రెల ను, ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారు. మైనారిటీ లు ఎక్కువగా నివసించే ప్రదేశాలను ఎంచుకొని విష బీజాలు నాటారు. బక్రీద్ సందర్భంగా గొర్రెలను కొనుగోలు చేసేందుకు సైతం ముస్లింలు భయపడే పరిస్థితిని కల్పించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో లోనూ, పారిశ్రామిక నగరం కాన్పూర్‌లోనూ, ఉత్తరా ఖండ్‌లోని భోవాలీ నగరంలోనూ నివసిస్తున్న ముస్లింలకు భయపెట్టేలా సందేశాలు పంపుతున్నా రు. తాము ఎంతగా భయపడుతున్నప్పటికీ బయట కు చెప్పుకునే పరిస్థితి వారికి లేదు.

ఎందుకంటే ఎవరికైనా చెప్పినా ప్రయోజనం ఉండదని వారికి తెలుసు. పైగా తమ పైనే పోలీసులు తప్పుడు కేసులు పెడతారని వారు అంటున్నారు. బక్రీద్ సంద ర్భంగా గొర్రెలను కొనుగోలు చేసి ఇంటికి తెచ్చినం దుకు ముంబయిలోని జేపీ ఇన్‌ఫ్రా సొసైటీ ప్రాంతంలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. ఆ ప్రాంతంలో భక్తులుగా చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు కవ్వింపు చర్యలకు దిగుతూ హనుమాన్ చాలీసా పారాయణం మొదలు పెట్టారు. దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాలలో వైరల్ చేశారు. ఇంకేముంది? వార్తా ఛానల్స్‌కు మేత దొరికింది. హిందూ-ముస్లిం చర్చలు ప్రారంభం చాయి. తమ విలేకరులను కొన్ని సొసైటీలలో నియమించి, ఎక్కడైనా గొర్రెలు కన్పిస్తాయేమో చూడండంటూ పురమాయించాయి. అది 'ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం' అట. హిందూత్వకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకునే యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రంగంలోకి దిగారు. సున్నితమైన, సమస్యాత్మకమైన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, అసాంఘిక శక్తుల ఆట కట్టించాలని అధికారులను ఆదేశించారు.

ఆదిత్యనాథ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన స్వామిభక్తి పరాయణులైన పోలీసు అధికారులు మొరాదాబాద్‌లోని ఓ కాలనీకి చేరుకొని జంతువులేవీ లోపల కన్పించకూడదని హుకుం జారీ చేశారు. ఒకవేళ దొరికితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పండుగ ఏదైనా...

దేశంలో కులం, మతం ప్రాతిపదికన ఎవరిపైనా వివక్ష చూపబోమంటూ ప్రధాని మోడీ అమెరికాలో చేసిన ప్రకటనను ఈ పరిణామాలు అపహాస్యం చేస్తున్నాయి. గొర్రెలను కొనుగోలు చేసేందుకే ముస్లింలు భయపడేటట్లు చేస్తున్నారు. వాస్తవానికి గత కొంతకాలంగా దేశంలో ఏ పండుగ వచ్చినా ఉద్రిక్త, విద్వేషపూరిత వాతవరణం కన్పిస్తోంది. అది హోలీ, దీపావళి, క్రిస్టమస్, నవరాత్రి, సరస్వతి పూజ, బక్రీద్ .... ఏ పండుగైనా కానివ్వండి. ద్వేషపూరిత ప్రచారం సాగుతోంది. సమాజాన్ని నిట్టనిలువునా చీల్చేందుకు పండుగలను ఉపయోగించుకుంటున్నారు. గోవా నుండి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వరకూ ఎక్కడ చూసినా ఇదే వాతావరణం. ఇదంతా భారత ప్రజాస్వామ్యాన్ని మనువాద రాజదండం చేతిలో పెట్టడానికి జరుగుతున్న ప్రయత్నంలో భాగమే.

సీఎం మహారాష్ట్రకా? తెలంగాణకా?

- బీఆర్‌ఎస్‌కు రబ్బరు స్టాంపు గవర్నర్లే నచ్చుతారు: బండి
- బీజేపీలో చేరిన మాజీ డీజీపీ జయచంద్ర

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేసీఆర్ సీఎం మహారాష్ట్రకా? తెలంగాణకా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ అందుబాటులో ఉండట్లేదు కాబట్టే ప్రజలు రాజ్‌భవన్‌వైపు చూస్తున్నారని చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గవర్నర్ తమిళి సైపై రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గవర్నర్‌ను అవహేళన చేయడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని చెప్పారు. అవినీతి జరుగుతుంటే గవర్నర్ చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. రబ్బరు స్టాంపులా ఉండే గవర్నర్లే బీఆర్‌ఎస్‌కు నచ్చుతారనీ, నిజాయితీగా ఉండేవాళ్లు నచ్చరని ఎద్దేవా చేశారు. ప్రగతిభవన్‌ను తాగి, తినడానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. అంతకుముందు బండి సమక్షంలో మాజీ డీజీపీ ఎస్.కే.జయచంద్ర, ఆయన కుమార్తె పాయల్ నేహా బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎన్.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు జి.మనోహర్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గీతామూర్తి, అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, జెనవాడే సంగప్ప పాల్గొన్నారు.

జులై 8న వరంగల్‌కు ప్రధాని మోడీ

- టెక్స్‌టైల్ పార్కు, కాజీపేట వ్యాగన్ ఓరలింగ్ సెంటర్‌కు శంకుస్థాపన
- అదే రోజు బహిరంగ సభ నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి జులై ఎనిమిదో తేదీన రానున్నారు. కాజీపేటలోని రైల్వే వ్యాగన్ ఓరలింగ్ సెంటర్‌కు, వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు ప్రధాని పర్యటనను రాజకీయంగా కూడా వాడుకోవాలని బీజేపీ నిర్ణయం తీసుకున్నది. అందులో భాగంగానే వరంగల్‌లో అదే రోజు బహిరంగ సభను నిర్వహించనున్నది. ఈ మహాసభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించాలని ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నది. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రధాని మోడీ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకున్నది.

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి : టీపీటీఎఫ్ డిమాండ్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని టీపీటీఎఫ్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొదటి పీఆర్సీ గడువు శుక్రవారం (ఈనెల30)తో ముగుస్తున్నందున రెండో పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొదటి పీఆర్సీని ఆలస్యంగా అమలు చేయడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రెండో పీఆర్సీ అయినా ఆలస్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. వచ్చేనెల నుంచి మధ్యంతర భృతి (ఐఆర్)ని ఇప్పుడున్న పెరిగిన ధరలకనుగుణంగా ప్రకటించాలని డిమాండ్ చేసారు. కేజీబీవీ టీచర్లకు రెగ్యులరైజ్ చేసి పే స్కేళ్లను వర్తింపజేయాలని కోరారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకుండా విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయులకు ఎనిమిదేండ్లుగా పదోన్నతులు కల్పించకుండా, ఐదేండ్లుగా బదిలీలు చేయకపోవడంతో పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల విద్యావ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయిందని తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అసాంజేకి ఆశ్రయం కల్పించాలంటూ లూలాకు బ్రెజిల్ పౌర సమాజం లేఖ

బ్రసీలియా: ఆస్ట్రేలియన్ జర్న లిస్ట్ జూలియన్ అసాంజేకి రాజకీ య ఆశ్రయం కల్పించాలంటూ సుమారు 2,900 మందితో కూడిన పౌర సమాజం ఆ దేశ అధ్యక్షుడు లూలా డ సిల్వాకు బుధవారం లేఖ రాసింది. అసాంజేకు మద్దతు ప్రకటించాలని తాము కోరుకుంటున్నట్లు. రాజకీయ నేతలు, శాస్త్రవేత్తలు, మేధావులు, సామాజిక సంస్థల నేతలు, జర్నలిస్టులు, అధ్యాపకులు, యూనియన్ల నేతలు ఆ లేఖలో పేర్కొన్నారు. కమ్యూ నిస్ట్ శాస నసభ్యురాలు జండిరా ఫెఘాలి, న్యూరాలజిస్ట్ సిదర్తా రిబీరో, మ్యూజిషియన్ జాక్వస్ మెరోలంబమ్, శాస్త్రవేత్త ఎన్నియో కాన్డొట్టి, మాజీ మంత్రులు రెనాటో రిబీరో, అనాడి హోలాండా, సెర్గియా మచాడో, జోస్ గెమ్స్ టెంపోరవో సహా సుమారు 2,900 మంది ఆ లేఖపై సంతకం చేశారు. వీలైనంత త్వరగా జూలియన్ అసాంజేకి రాజకీయ ఆశ్రయం కల్పించేందుకు బ్రెజిల్ చట్టపరమైన, దౌత్యపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పత్రికా స్వేచ్ఛకు భరోసా ఇచ్చినందుకు,



ప్రపంచవ్యాప్తంగా అమెరికా చేపట్టిన మానవ హక్కుల ఉల్లంఘనలను బహిర్గతం చేసినందుకు అసాంజే జైలు పాలయ్యాడంటూ పలు సందర్భాల్లో లూలా పేర్కొన్నారని గుర్తుచేశారు. వికీ లీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజేను అమెరికాకు అప్పగించాలనే నిర్ణ యాన్ని బ్రిటన్ కోర్టు ఆమోదిస్తే... అమెరికా గురించి వాస్తవాలను వెల్లడించినందుకు అసాంజే 175 ఏండ్ల జైలుశిక్షను ఎదుర్కోవాల్సి వుంటుంది.

బ్రిటన్ నుండి ఆశ్రయం ఆమోదం పొందేందుకు లూలా బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో పాటు జి 20 దేశాల్లో ప్రచారాన్ని చేపట్టాలని వారు ప్రతిపాదించారు. ఫలితం ఏదైనప్పటికీ..అసాంజేను రక్షించేందుకు చేసే యత్నం ప్రపంచంలో బ్రెజిల్ ప్రభుత్వ మానవతా ప్రగతిశీల వైఖరిని మరింత హైలెట్ చేస్తుందని తాము విశ్వసిస్తున్నామని వారు ఆ లేఖలో ఉద్ఘాటించారు. పోప్ ఫ్రాన్సిస్, నటుడు లియోనార్డో డికాప్రియో, నోబెల్ బహుమతి పొందిన సాహితీవేత్త అడాల్ఫో పెరెజ్ ఎస్క్వివెల్ వంటి ప్రపంచ ప్రముఖుల మద్దతుతో బ్రెజిల్ ప్రభుత్వం ప్రత్యక్షంగా బ్రిటన్ ప్రభుత్వానికి పిటిషన్ సమర్పించే అవకాశముంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా చేపట్టిన యుద్ధ నేరాలను బహిర్గతం చేయడంతో వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే 2010లో అరెస్టైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం లండన్ జైలులో ఉన్నారు.

ప్రపంచ గమనం

బ్రిక్స్ సదస్సుకు ముందు మిత్రకూటమి ఏర్పాటుకు బ్రెజిల్ యత్నం



బ్రెసిలియ : ఈ సంవత్సరారంభంలో బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికైన లూయిజ్ ఇనాషియో లూలా డిసిల్వా(వర్కర్స్ పార్టీ-పీటీ) తాను గత రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటిలా (2003-2010) క్రియాశీల విదేశాంగ విధానాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తున్నారు. బోల్సొనారో పాలనలో అనేక సంవత్సరాలుగా ఒంటరిగా మిగిలిపోయిన బ్రెజిల్ అంతర్జాతీయ యవనికపైకి "బ్రెజిల్ పునరాగమనం" అనే నినాదంతో ముందుకు వచ్చింది.

అమెరికా, చైనా, ఫ్రాన్స్‌లతో సహా పది దేశాలను దర్శించిన లూలా అమెరికా, ఐరోపాల ఆధిపత్యాన్ని అధిగమించటానికి 'బహుళ ధ్రువ ప్రపంచం' ఆవిర్భవించటమే ఏకైక మార్గమని చెబుతున్నాడు. తన ప్రయత్నంలో భాగంగా మే30వ తేదీనాడు బ్రాసిలియాలో 12దక్షిణ అమెరికా దేశాల అధ్యక్షుల, అధికారుల సదస్సును నిర్వహించారు. ఇది 2008లో ఏర్పాటైన దక్షిణ అమెరికా దేశాల యూనియన్ (ఖచీూాఖక్ష)ను పోలివుంది. ఇది అప్పటి వామపక్ష ప్రభుత్వాల క్రుషితో ఏర్పడింది. గత దశాబ్దం ద్వితియార్థంలో లాటిన్ అమెరికాలో ప్రగతి నిరోధక ప్రభుత్వాలు ఏర్పడటంతో ఈ యూనియన్ నిర్వీర్యమైంది. ఆ తరువాత అర్జంటీనా, కొలంబియావంటి దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఈ యూనియన్ తిరిగి ఊపిరిపోసుకుంది.


అయితే ఈ దక్షిణ అమెరికా దేశాల యూనియన్ పున్ణప్రతిష్ట చేయటానికిగల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు 15సంవత్సరాల క్రితంకంటే పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. 21వ శతాబ్దం ఆరంభంలో లాటిన్ అమెరికా దేశాలు చైనాతో వాణిజ్య సంబంధాలు పెట్టుకుని బాగా లాభపడ్డాయి. కోవిడ్ మహమ్మారి కారణంగా నేటి దక్షిణ అమెరికాలో సామాజిక అసమానతలు తీవ్రంగా పెరిగాయి. అంతేకాకుండా అమెరికా, నాటో దేశాల దన్నుతో నడుస్తున్న ఉక్రెయిన్ యుద్ధంవల్ల ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ వత్తిడులు ఎక్కువయ్యాయి. దక్షిణ అమెరికాలోని ప్రతి దేశాధ్యక్షుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. సైన్యంతో ఘర్షణ పడుతున్నారు. చైనాతో, కొంతవరకు రష్యాతో కూడా తమకున్న వాణిజ్య సంబంధాలను కొనసాగించటానికి అడ్డంకిగావున్న సామ్రాజ్యవాదాన్ని అధిగమించటానికి నానా తంటాలు పడుతున్నారు.

దక్షిణ అమెరికా దేశాల యూనియన్ "గ్లోబల్ సౌత్"గా పిలువబడే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ప్రతిబింబిస్తుందని లూలా అన్నారు. లూలా అవగాహనలో ఇది సంపన్న దేశాలకు ఉపయోగపడే ప్రస్తుతమున్న ప్రపంచ వాణిజ్య సంస్థవంటి 'గ్లోబల్ పాలనా ఫోరమ్‌ల'కు భిన్నమైనది. లాటిన్ అమెరికా 4ట్రిల్లియన్ డాలర్ల(ఒక ట్రిల్లియన్ 1000 బిలియన్లు. ఒక బిలియన్ 100కోట్లు) ఆర్థిక వ్యవస్థ. ఈ దేశాల జనాభా 45కోట్లు. కావలసినన్ని సహజవనరులు, పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ఖనిజ సంపద ఈ దేశాల్లో ఉన్నాయి. "మారుతున్న ప్రపంచం"లో దక్షిణ అమెరికా తనదైన పాత్రను పోషించటానికి ఇది చాలని లూలా అభిప్రాయపడుతున్నాడు.

బ్రిక్స్ బ్యాంకు పేరుతో పిలువబడుతున్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు(ఎన్‌డీబీ) వార్షిక సమావేశం జరుగుతున్న నేపథ్యంలో బ్రెజిల్‌లో దక్షిణ అమెరికా దేశాల సదస్సు జరిగింది. బ్రిక్స్ దేశాల వార్షిక సమావేశం ఆగస్టు నెలలో దక్షిణ ఆఫ్రికాలో జరగనుంది. ఈ బ్రిక్స్ వార్షిక సమావేశంలో బ్రిక్స్ దేశాలకు ఒకే ఒక కరెన్సీని ఏర్పాటుచేసుకోగలిగే సాధ్యత గురించి చర్చ జరుగుతుంది. ఇది అమెరికన్ డాలర్‌కు ప్రత్యామ్నాయ పాత్రను పోషిం చటం వల్ల వివిధ దేశాల మధ్య వాణిజ్య విస్తరణను వేగవంతం చేస్తుంది. బ్రిక్స్‌లోను, ఎన్‌డీబీలోను సభ్యత్వాన్ని పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే అనేక దేశాలు బ్రిక్స్ లో చేరటానికి సిద్ధంగా ఉన్నాయి.

ఒకవైపు అమెరికా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపకుండా దీర్ఘకాలం కొనసాగేలా చేయటానికి ప్రయత్నించటాన్ని, మరోవైపు తైవాన్ సమస్యపైన చైనాను పదేపదే రెచ్చగొట్టటాన్ని చూస్తుంటే లాటిన్ అమెరికాను తన కబంధ హస్తాలనుంచి అమెరికా అంతతేలికగా చేజారనీయదనేది సుస్పష్టం. ఏదో ఒక ప్రళయాన్ని స్రుష్టించకుండా అంత తేలికగా అమెరికా తన ఆధిపత్యాన్ని(ఏక ధ్రువ ప్రపంచం) వదులుకుని "బహుళ ధ్రువ ప్రపంచం" ఆవిర్భవించటాన్ని చూస్తూ ఊరుకోదు. గత శతాబ్దంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాల కష్టనష్టాల నుంచి తప్పించుకున్న దక్షిణ అమెరికా ఈ శతాబ్దంలో జరుగుతున్న సామ్రాజ్యవాద యుద్ధాల పర్యవసానాలను తప్పిం చుకోజాలదు. అయితే ఈ శతాబ్దంలో జరిగిన, జరుగుతున్న యుద్ధాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను సంక్షుభితం చేయటంతోపాటుగా ప్రపంచం మీద అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని బలహీన పరుస్తు న్నాయి. అదే దక్షిణ అమెరికా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఆశాకిరణం అవుతుంది.

ఆర్థిక మాంద్యం అంచున అమెరికా, పశ్చిమ దేశాలు : హెచ్‌ఎస్‌బీసీ



2023వ సంవత్సరంలో నాలుగవ త్రైమాసికంలో అమెరికాలో మాంద్యం సంభవించే అవకాశం ఉందని బ్రిటిష్ బ్యాంకు హెచ్‌ఎస్‌బీసీ పేర్కొంది. వచ్చే సంవత్సరంలో పశ్చిమ ఐరోపాలోనూ మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని కూడా హెచ్‌ఎస్‌బీసీ అంటోంది. అనేక ఆర్థిక వ్యవస్థల స్టాక్, బాండ్ మార్కెట్లు విత్త, ద్రవ్య విధానాలతో సరిపోలకపోవటంవల్ల మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్‌ఎస్‌బీసీ ఎస్సెట్ మేనేజ్‌మెంట్ సంవత్సరం మధ్యలో అంచనా వేసింది. ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికీ కొన్ని విభాగాలు పటిష్టంగా ఉన్నప్పటికీ మిగిలిన విభాగాల క్షీణత మాంద్యం సంభవించే అవకాశాన్ని చూచిస్తోంది. అమెరికాతో పోల్చినప్పుడు ఐరోపా పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ స్థూలంగా చూసినప్పుడు వీటి మధ్య సారూప్యత కనపడుతోందని హెచ్‌ఎస్‌బీసీ గ్లోబల్ చీఫ్ స్ట్రాటజిస్ట్, జోసెఫ్ లిటిల్ తన నివేదికలో పేర్కొన్నారు. బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ద్రవ్యోల్బణాన్ని అరికట్టటం కోసం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్(బీఓఈ) తన వడ్డీరేటును గత 15 సంవత్సరాలలో ఎన్నడూలేనంతగా 5శాతానికి పెంచిన తరువాత వారానికి ఈ హెచ్చరికను చేయటం జరిగింది. మే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీరేటును 5.25శాతానికి పెంచింది. ఇది 2007 తరువాత అత్యంత అధికం. ఇదే కాలంలో యూరో జోన్‌లో ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్(ఈసీబీ) యూరోజోన్ వడ్డీరేటును 3.75శాతానికి పెంచింది. ఇవన్నీ పశ్చిమ దేశాలలో మాంద్యం ఆగమనానికి సూచికలుగా ఉన్నాయి.

ట్రాన్స్‌జెండర్లకు 'గౌరవం'

- ఉపాధి కల్పనకు కేరళ కొత్త పథకం

తిరువనంతపురం : ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి కల్పించేందుకు 'గౌరవం' (ప్రైడ్) పేరుతో కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించింది. ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 'ప్రైడ్' ప్రాజెక్టు ద్వారా ట్రాన్స్‌జెండర్లకు వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత నాలెడ్జ్ ఎకానమీ మిషన్, సామాజిక న్యాయ శాఖ సంయుక్త నిర్వహణలో ఈ 'ప్రైడ్' ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 2026 నాటికి 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి ఆ దిశగా వివిధ వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్న సంగతి విదితమే. ప్రైడ్ కూడా ఇందులో భాగంగానే రూపొందించారు. ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో అందరితో పాటే సమాన గౌరవం దక్కాలనే ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించినట్లు విజయన్ తెలిపారు.